

'రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు కళకళలాడాలి. పాడిపంటలతో పులకించిపోవాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+16 వెల: ₹ 5.00

శనివారం 1-2-2020

సంపుటి: 12

సంచిక: 311

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

Lalithaa®

లలితా జ్యూవెల్లరి మార్ట్ ప్రై. లిమిటెడ్

విజయవాడ • వైజాగ్ • రాజమహేంద్రవరం • భీమవరం • కాకినాడ • తిరుపతి • హైదరాబాద్
చెన్నై • తిరువళ్లూరు • గుడియాత్తం • మదురై • తిరుచ్చి • పుదుచ్చేరి • కుంభకోణం
రామనాథపురం • కోయంబత్తూరు • సేలం • నాగర్‌కోవిల్ • ఈరోడ్ • బెంగళూరు



25th SHOWROOM INAUGURATION COST PRICE SALE

IN ALL OUR SHOWROOMS

JAN 25 - FEB 09

కృతజ్ఞతలు చెప్పే సమయమిది!

నిన్న ఆరంభించినట్టే ఉంది! పదేళ్ల క్రితం ఒక షోరూంగా ఉన్న మీ లలితా జ్యూవెల్లరి, ఇప్పుడు తన ప్రతిష్టాత్మకమైన 25వ షోరూంను మీ దివ్యాశిస్సులతో కాకినాడలో ఆరంభించాం! ఎవరి అండదండలు లేకుండా మిమ్మల్ని మాత్రమే నమ్ముకుని ఆరంభించిన ప్రయాణమిది.

మీరు ప్రసాదించిన జీవితమిది! కష్టపడి సంపాదించిన మీ డబ్బుకు మరెవరూ ఇవ్వని విలువను తక్కువ తరుగు ద్వారా, దాపరికం లేకుండా ఇచ్చేందుకు ముందుకొచ్చా. అందుకు మీరు ఇచ్చిన ఆదరణే ఈ గొప్ప ఎదుగుదలకు కారణం.

మిమ్మల్ని నమ్ముకుని మొదలుపెట్టా.. మిమ్మల్ని నమ్ముకుని కొనసాగిస్తా!

25వ షోరూం ప్రారంభోత్సవ కానుక!

అన్ని షోరూంలలోనూ అన్ని నగలకు!

బంగారు నగలపై ఇప్పటికే ఉన్న మా అతి తక్కువ తరుగులో ఇంకా **2%** తగ్గింపు

వజ్రాభరణాలపై క్యారెట్‌కు రూ.**3000** తగ్గింపు
~~రూ.46000~~ రూ.**43000** నుంచి

మనదగ్గర జిమ్మిక్కులు లేవండి!

ఈ ఆఫర్‌ను హృదయపూర్వకంగా ఇస్తున్నా. ఆఫర్ కోసం ముందుగా ధరలు పెంచి, ఆ తర్వాత తగ్గించి ఇచ్చేవిధమైన జిమ్మిక్కులు లలితా జ్యూవెల్లరి ఎప్పటికీ చేయదు. అలాంటివి నాకు చేతకాదు. ఒకటి లేదా రెండు నెలల ముందు మీరు మా వద్ద తీసుకున్న నగల బిల్లును తెచ్చి... అప్పటి, ఇప్పటి తరుగును కూడా చెక్ చేయండి! ఇప్పుడు మార్కెట్‌లో ఉన్న అన్ని ఆఫర్లతోనూ పోల్చండి. మాది న్యాయమైన కానుక. పోల్చిచూసి మీరే నిర్ణయం తీసుకోండి. పరిమిత కాల ఆఫర్ ఇది. అందువల్ల ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మనసారా కోరుతున్నా!

ఒక సవినయ మనవి!

మీ ఆశిస్సులతో 25 షోరూంలకు అభివృద్ధి చెందాం. మీ ఆదరణతో ఇంకా పలు షోరూంలను ప్రారంభించనున్నాం. ఈ వేగమైన అభివృద్ధి క్రమంలో పొరబాటున కొన్ని తప్పులు దొర్లి ఉంటాయి. కానీ, ఎంత ఎత్తుకు ఎదిగినా, మీకు చేసే సేవలో ఎలాంటి మార్పు ఉండదని మనసారా చెబుతున్నా. మీ మార్గ నిర్దేశంతో వాటిని పరిష్కరించాలని అనుకుంటున్నా. తప్పులు, లోటుపాట్లను, మా సేవలను మెరుగుపరుచుకునేందుకు మీ సలహాలను మా ఈమెయిల్‌కు పంపాల్సిందిగా దయచేసి కోరుకుంటున్నా : chairman@lalithaajewellery.com

ఈ అవకాశం జనవరి 25 నుంచి ఫిబ్రవరి 9వతేది వరకు

100% నాణ్యత - BIS 916 హాల్‌మార్క్ లక్షలాది డిజైన్లు!

తప్పక చూడండి!

డాక్టర్ ఎం.కిరణ్‌కుమార్ ఇంటర్వ్యూను తప్పకుండా చూడండి.

యువత జీవితంలో విజయం సాధించేందుకు పలు సలహాలు, సూచనలు ఇందులో ఉన్నాయి. నగలు కొనడం, డబ్బు అదా చేయడానికి సంబంధించి, అవగాహన కల్పించే విషయాలు కూడా ఉన్నాయి.

https://youtu.be/HYBogKvFscY

1.4 M VIEWS

అద్వితీయమైన మా నగల కొనుగోలు పథకానికి సంబంధించి వివరాలను ఈ వీడియో ద్వారా తెలుసుకోండి.

https://youtu.be/6qdydUnfIVI

Lalithaa®

లలితా జ్యూవెల్లరి మార్ట్ ప్రై. లిమిటెడ్

హైదరాబాద్ • విజయవాడ • వైజాగ్ • రాజమహేంద్రవరం • భీమవరం
కాకినాడ • తిరుపతి • చెన్నై • తిరువళ్లూరు • గుడియాత్తం
మదురై • తిరుచ్చి • పుదుచ్చేరి • కుంభకోణం • రామనాథపురం
కోయంబత్తూరు • సేలం • నాగర్‌కోవిల్ • ఈరోడ్ • బెంగళూరు

మీరు కొంటున్నది నగలు.. శ్రద్ధ చాలా ముఖ్యం!

ప్రతి గ్రామములోనూ మీ శ్రమ ఉంది

పోల్చండి

దయచేసి మా వద్ద ఎస్టిమేట్‌స్లిప్, మొబైల్‌లో ఫొటోను తీసుకోండి. నాలుగైదు షోరూంలలో ధరలు పోల్చిచూడండి. ఈ ఆఫర్ తర్వాత కూడా పోల్చిచూడండి. ఎక్కడ తక్కువగా ఉంటే అక్కడే కొనండి.

నాణ్యత

BIS 916 హాల్‌మార్క్ నగలను మాత్రమే కొనండి. హాల్‌మార్కు లేకుండా నగలు కొంటే బంగారం నాణ్యత ఏంటనేది తెలియదు. అంత డబ్బులు పెట్టి మనం ఏం కొంటున్నామో కూడా తెలియకపోతే ఎలా?

బిల్లు

దయచేసి బిల్లు లేకుండా నగలు కొనకండి. జీఎస్టీ చెల్లించి బిల్లు తీసుకుంటే మీ కొనుగోలు సంపూర్ణం అవుతుంది. దేశానికి, ప్రభుత్వానికి కూడా మేలు చేకూరుతుంది. బిల్లులో నగల వివరాలు ఉన్నందువల్ల భవిష్యత్తులో మీకు భద్రత ఉంటుంది.



డిజైన్

మావద్ద లక్షలాది డిజైన్లు ఉన్నాయి. అవి కాకుండా మీకు నచ్చిన డిజైన్ ఫొటో మాకు చూపిస్తే మీకోసం ప్రత్యేకంగా 15 నుంచి 25 రోజుల్లో అందంగా చేసిస్తాం.

వజ్రాభరణాలు: క్యారెట్‌కు రూ.3000 తగ్గింపు! రూ.~~46000~~ రూ. 43000 నుంచి! V.A. గ్రాముకురూ.975 మాత్రమే

వజ్రాభరణాల విక్రయాలలోనే ఎక్కువ జిమ్మిక్కులు ఉన్నాయి. ఈ విషయాలను తప్పక చదవి జాగ్రత్త పడండి.

అథెంటిసిటి (నాణ్యత నిర్ధారణ) సర్టిఫికెట్

షోరూంవాళ్లు సొంతంగా తయారు చేసే 'ఇన్‌హౌస్' సర్టిఫికెట్‌ను నమ్మకండి. ఎందుకంటే, తమ వస్తువు నాణ్యతలేనిదని ఎవరైనా చెబుతారా? గుర్తింపు పొందిన మూడోవ్యక్తి (సంస్థ) ఇచ్చే నాణ్యత సర్టిఫికెట్ కావాలని అడగండి. (లలితా జ్యువెల్లరిలో ప్రతి వజ్రాభరణం అంతర్జాతీయ స్థాయి గుర్తింపు పొందిన జెమ్మాలజీ సంస్థ ఇచ్చే సర్టిఫికెట్ పొందినవే.)

ఎక్స్‌ఛేంజ్ పాలసి

వజ్రాభరణాలకు మార్పిడికైతే 100% బైబ్యాక్, నగదుగా, బంగారు నగలుగా అయితే 85% బైబ్యాక్ ఉండాలి. (ఎక్స్‌ఛేంజ్ చేసుకునే రోజు నాటి మా వజ్రపు ధర ప్రకారం. లలితా జ్యువెల్లరిలో మార్పిడి చేసుకోవచ్చు.)

కలర్ & క్లారిటి

మీరు కొనే వజ్రాభరణాలకు E-F కలర్‌గ్రేడ్ మరియు VVS క్లారిటి ఉన్నాయా అని సరిచూసుకోండి. తక్కువ ధరకు లభిస్తున్నాయనే కారణం వల్ల G-H కలర్‌గ్రేడ్ వంటి నాణ్యత తక్కువైన ఆభరణాలను కొనకూడదు. (లలితా జ్యువెల్లరిలో E-F కలర్‌గ్రేడ్, VVS క్లారిటి వజ్రాభరణాలు మాత్రమే అందజేస్తున్నాం.)

క్యారెట్‌కు అధిక ధర చెల్లిస్తే ఏమవుతుంది?

4 క్యారెట్ బరువున్న వజ్రాభరణానికి కేవలం రూ.5,000 అధికంగా ఇచ్చినా కానీ రూ.20,000 కోల్పోవాల్సి వస్తుంది! లలితా జ్యువెల్లరిలో రూ.43,000లకే అందిస్తున్న ఈ వజ్రాభరణాన్ని మార్కెట్‌లో రూ.60,000, రూ.70,000 అంటూ విక్రయిస్తున్నారు. ఆఖరి ధరల్లో వ్యత్యాసమేంటో మీరే లెక్కగట్టి తెలుసుకోవచ్చు!

ధరలు చెక్ చేయండి!

వజ్రపు వ్యాసం (సెంట్లలో)	మార్కెట్లో వజ్రపు ధర క్యారెట్‌కి	లలితా జ్యువెల్లరిలో వజ్రపు ధర క్యారెట్‌కి
0 నుంచి 0.0749	రూ.60000 నుంచి 76000	రూ.43000
0.0750 నుంచి 0.1349	రూ.76000 నుంచి 85000	రూ.63500
0.1350 నుంచి 0.1749	రూ.98500 నుంచి 105000	రూ.80000
0.1750 నుంచి 0.2249	రూ.108500 నుంచి 112000	రూ.91000

ధరలు సర్వదేశ ఎగుమతి దిగుమతులకు తగినట్లు నిర్ణయించబడతాయి.

నగల కొనుగోలు పథకం

లలితా జ్యువెల్లరి మాత్రమే అందిస్తోంది. **మార్కెట్‌లోనే అధిక ప్రయోజనాలు అందించే 2 పథకాలు !**

11 నెలల 'నగల కొనుగోలు పథకం'.

తొలి వాయిదా ఉచితం
+
తరుగు (V.A.) 50% ఉచితం

అన్ని బంగారు నగలకు వర్తిస్తుంది.

చిన్న వాయిదాలు: రూ.1000 / రూ.1500 / రూ.2000 / రూ.2500

ప్రతినెల మీరు చెల్లించే నగదు, ఆరోజునాటి విలువ ప్రకారం 22 క్యారెట్ బంగారంగా అదా చేయబడుతుంది.

అడ్వాన్స్ నగల బుకింగ్ స్కీమ్

One Time Payment !

ఏ నగకూ 100% V.A. లేదు

5 నెలల నుంచే ఫలితం!

11 నెలల తర్వాత నగను కొనేటప్పుడు, 14% లేదా 16% వరకు V.A. ఉన్న నగ అయినప్పటికీ.. 1% V.A. కూడా చెల్లించనక్కర్లేదు.

మీ పాత నగలను ఇచ్చి కూడా ఈ పథకంలో చేరొచ్చు.

కేవలం అరశాతం (0.5%) మీ పాత బంగారు నగలను మెల్టింగ్, ప్యూరిఫికేషన్ చేసేందుకు పట్టుకుంటాం.

వెండివస్తువులు

బంగారు నగలు, వజ్రాభరణాలు మాదిరిగా వెండి వస్తువుల ధరలను కూడా బాగా పోల్చి కొనాలి. ఎందుకంటే, ప్రతిరూపాయి ముఖ్యం!

90% వెండి వస్తువులకు మజూరి, తరుగు లేదు

Lalithaa®

www.lalithaajewellery.com

లలితా జ్యువెల్లరి మార్ట్ ప్రై. లిమిటెడ్

100% నాణ్యత - BIS 916 హాల్‌మార్క్ లక్షలాది డిజైన్లు!

హైదరాబాద్ - సోమాజిగూడ: 6-3-883, SBR సౌక్, రాజీవ్‌గాంధి విగ్రహం ఎదురుగా. ఫోన్: 040 - 6748 6677.

కూకట్‌పల్లి : 2-22-298, PNR ఎంపైర్, కళామందిర్ పక్కన, KPHB మెట్రో స్టేషన్ సమీపం.

ఫోన్: 040 - 2384 2277 / 2200 / 2299.

విజయవాడ • వైజాగ్ • రాజమహేంద్రవరం • భీమవరం • కాకినాడ • తిరుపతి • హైదరాబాద్ • చెన్నై • తిరువళ్లూరు • గుడియాత్తం మదురై • తిరుచ్చి • పుదుచ్చేరి • కుంభకోణం • రామనాథపురం • కోయంబత్తూరు • సేలం • నాగర్‌కోవిల్ • ఈరోడ్ • బెంగళూరు

epaper.sakshi.com

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+16 వెల: ₹ 5.00

సంపుటి: 12
సంచిక: 311

శనివారం 1-2-2020

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండగ రోజు'

విప్రో సీఈవో ఆబిదాలి నిష్క్రమణ

వారసుడి అన్వేషణలో కంపెనీ.. స్టాక్ ఎక్స్ఛేంజీలకు తెలిపిన విప్రో - బిజినెస్‌లో

భారత్ మరో 'సూపర్' విజయం

న్యూజిలాండ్‌తో నాలుగో టి20లో సూపర్ ఓవర్లో గెలిచిన టీమిండియా -స్పోర్ట్స్‌లో

సీఏఏ చరిత్రాత్మకం

జాతిపిత మహాత్ముని ఆశయ సాధనకు కేంద్రం తీసుకువచ్చిన పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ) చరిత్రాత్మకమైందని రాష్ట్రపతి రామ్‌నాథ్ కొనియాడారు. బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా శుక్రవారం పార్లమెంట్ ఉభయసభల సమావేశంలో ప్రసంగించారు.

- 8లో

'అరవింద్' సమేత..

మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల తర్వాత మరో అమెరికన్ ఐటీ దిగ్గజానికి సారథ్యం వహించే అవకాశం ఇంకో తెలుగు వ్యక్తికి దక్కింది. ఏపీకి చెందిన అరవింద్ కృష్ణ (57)... ఐటీ దిగ్గజం ఐబీఎం చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా (సీఈవో) నియమితులయ్యారు. 200 బిలియన్ డాలర్ల సంస్థ డైరెక్టర్ల బోర్డులోనూ ఆయనకు చోటు దక్కింది.

- బిజినెస్‌లో

'నిర్భయ' దోషుల ఉరి వాయిదా

'నిర్భయ'దోషుల ఉరిశిక్ష అమలు మరోసారి వాయిదా పడింది. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు శిక్షను అమలు చేయరాదంటూ ఢిల్లీ కోర్టు శుక్రవారం ఆదేశించింది. ఈ మేరకు అడిషనల్ సెషన్స్ జడ్జి ధర్మేందర్ రాణా ఆదేశాలిచ్చారు.

- 8లో

ధనరేఖలు..

రాజపూజ్యమింత, అవమానమింత అని పంచాంగం మాత్రమే చెప్పదు. మన ఇంటి బడ్జెట్ కూడా చెబుతుంది. మిగులుతున్నది ఎంతో చూసుకోకుండా ఖర్చు చేసుకుంటూ పోతే.. అవమానం! మిగుల్చుకున్నాకే ఖర్చులకు పోతే.. రాజ పూజ్యం! రాబడి ఎంతని కాదు.. పోబడి ఎంతుందనే దాన్ని బట్టే మనం ధనవంతులం.. ఘనవంతులం.

- ఫ్యామిలీలో

పదవీ విరమణ @61

ఏప్రిల్ 1వ తేదీ నుంచి అమల్లోకి?

సాక్షి, హైదరాబాద్

రిటైర్మెంట్ వయసును 58 ఏళ్ల నుంచి 61 ఏళ్లకు పెంచాలని నిర్ణయం

తదుపరి కేబినెట్ భేటీలో ఆమోదం!

వచ్చే మూడేళ్లలో రిటైరయ్యే 26,133 మందికి మూడేళ్ల సర్వీసు పొడిగింపు

గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన సీఎం కేసీఆర్

ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయసును 61 ఏళ్లకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం సూత్రప్రాయ నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయాన్ని ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి తీసుకురానున్నట్లు సమాచారం. దీంతో ప్రస్తుతం 58 ఏళ్లుగా ఉన్న విరమణ వయసు 61 ఏళ్లకు పెరగనుంది. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో సీఎం కె.చంద్రశేఖర్‌రావు ఇచ్చిన హామీ మేరకు ఈ నిర్ణయం జరిగింది. దీనికి సంబంధించి తదుపరి మంత్రివర్గ సమావేశం నాటికి ఫైల్‌ను సిద్ధం చేయాలని సీఎం ఆదేశించినట్లు విశ్వసనీయవర్గాలు వెల్లడించాయి. విరమణ వయసును 61 ఏళ్లకు పెంచితే ఈ ఏడాది ఏప్రిల్ నుంచి 2023 మార్చి 31 నాటికి పదవీ విరమణ చేయనున్న 26,133 మంది ఉద్యోగులకు మూడేళ్ల పాటు అదనపు సర్వీసు కలిసొస్తుంది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల మాదిరి రాష్ట్రంలో కూడా పదవీ విరమణ వయసును 60 ఏళ్లకు పెంచడంతో పాటు 33 ఏళ్ల సర్వీసు పూర్తి చేసిన ఉద్యోగులకు ఈ పెంపు వర్తింపచేయకూడదన్న ఉన్నతాధికారుల కమిటీ సిఫారసులను సీఎం పక్కన పెట్టినట్లు తెలిసింది. ఉద్యోగుల సర్వీసు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయసుతో నిమిత్తం లేకుండా ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిన విధంగానే 61 ఏళ్లకు సీఎం మొగ్గు చూపినట్లు సమాచారం.

మూడేళ్ల పాటు నో రిటైర్‌మెంట్..

పదవీ విరమణ వయసు పెంపుదల ఉత్తర్వులు అమల్లోకి వస్తే 2020 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి 31 దాకా రిటైర్‌మెంట్లు ఉండవు. దాదాపు 26,133 మంది ఉద్యోగులకు సంబంధించిన గ్రాట్యుటీ, పదవీ విరమణ సందర్భంగా ఇచ్చే అన్ని రకాల బెనిఫిట్లకు సంబంధించి చెల్లింపులు నిలిచిపోతాయి. ఆర్థిక మాంద్యం నేపథ్యంలో తాత్కాలికంగా ప్రభుత్వానికి ఆర్థికంగా కొంత ఊరట లభిస్తుంది. ప్రస్తుతం ఉన్న 58 ఏళ్ల కొనసాగిస్తే ప్రభుత్వం ప్రతినెలా రూ.250 నుంచి రూ.300 కోట్ల మేర గ్రాట్యుటీ, ఇతర బెనిఫిట్లు చెల్లించాల్సి ఉంటుంది. అంటే ఏడాదికి సగటున రూ.3,500 కోట్లు మూడేళ్ల పాటు ప్రభుత్వానికి కలిసొస్తుంది. పదవీ విరమణ వయసు పెంపుదలతో ప్రభుత్వ ఉద్యోగులందరికీ మూడేళ్ల పాటు సర్వీసు పెరుగుతుంది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు పదవీ విరమణ చేయనున్న 7,040 మందితో పాటు ఆ తర్వాత రెండేళ్లు కలుపుకొని మొత్తం 26,133 మంది ఉద్యోగులకు వెంటనే మూడేళ్ల పాటు అదనంగా ఉద్యోగంలో కొనసాగడానికి వీలు కలుగుతుంది.

వచ్చే మూడేళ్లలో పదవీ విరమణ చేయనున్న ఉద్యోగులు

2020 ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు	7,040
2021లో	9,213
2022లో	8,273
2023లో	1,607
మొత్తం	26,133

వృద్ధి పెరగాలి

- ద్రవ్యలోటు పెరిగినా ఓకే
- భారత్‌ను అసెంబ్లింగ్ కేంద్రంగా చేయాలి
- దాంతో పెద్ద ఎత్తున ఉపాధి
- ప్రభుత్వరంగ బ్యాంకులను పటిష్టం చేయాలి
- మౌలికంపై భారీ పెట్టుబడులు అవసరం
- 2020-21లో 6-6.5 శాతం మధ్య వృద్ధి రేటు
- ప్రస్తావించిన 2019-20 ఆర్థిక సర్వే

న్యూఢిల్లీ: ద్రవ్యలోటు పెరిగిపోతుందన్న భయంతో ప్రభుత్వం వృద్ధి విషయంలో రాజీపడొద్దని ఆర్థిక సర్వే కేంద్రానికి సూచించింది. ద్రవ్యలోటు పెరిగినా పర్వాలేదు కానీ, ముందుగా 11 ఏళ్ల కనిష్ట స్థాయికి చేరిన జీడీపీ వృద్ధి రేటును వేగంగా పట్టాలెక్కించాల్సిన అవసరాన్ని గుర్తు చేసింది. ఆహార సబ్సిడీలను తగ్గించుకుంటే ద్రవ్యలోటు కొంత తగ్గుతుందని పేర్కొంది. ఇలాంటి ఎన్నో అంశాలతో కూడిన 2019-20 ఆర్థిక సర్వేను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శుక్రవారం పార్లమెంటు ముందుంచారు.

సర్వేలో ముఖ్య అంశాలు..

- వివరాలు బిజినెస్‌లో

- 2019-20 సంవత్సరానికి జీడీపీ వృద్ధి రేటు 5 శాతంగా ఉండొచ్చు. ఇది 11 ఏళ్ల కనిష్ట స్థాయి అవుతుంది. వృద్ధి క్షీణత కనిష్ట స్థాయికి చేరడం ముగిసినట్టే.
- సంస్కరణలను వేగంగా అమలు చేసినట్టయితే 2020-21లో జీడీపీ వృద్ధి రేటు బలంగా పుంజుకుంటుంది.
- అంతర్జాతీయంగా వాణిజ్య ఉద్రిక్తతలు, ఇరాన్-అమెరికా మధ్య స్పర్ధలతో చమురు ధరల పెరుగుదల వంటివి వృద్ధికి సమస్యలు. అయితే డౌన్‌సైడ్ రిస్క్‌లను కూడా పరిగణనలోకి తీసుకున్న అనంతరం 2020-21కి వృద్ధి రేటు 6 శాతం నుంచి 6.5 శాతం మధ్య ఉండొచ్చు.
- రూ.1.84 లక్షల కోట్ల మేర ఉన్న ఆహార సబ్సిడీలను తగ్గించుకుంటే ద్రవ్యలోటును కట్టడి చేయవచ్చు.
- ప్రపంచానికి భారత్‌ను అసెంబ్లింగ్ కేంద్రంగా మార్చడం ద్వారా వృద్ధి రేటును పెంచుకోవడంతోపాటు పెద్ద ఎత్తున ఉద్యోగాలను సృష్టించుకోవచ్చు.
- 2024-25 నాటికి సుమారు రూ.350 లక్షల కోట్ల ఆర్థిక వ్యవస్థ స్థాయికి చేరేందుకు మౌలిక రంగంలో కనీసం 1.4 లక్షల కోట్ల డాలర్ల పెట్టుబడులు అవసరం.

కరోనాపై డబ్ల్యూహెచ్‌ఓ యుద్ధం

- అంతర్జాతీయ ఆరోగ్య అత్యవసర పరిస్థితి విధింపు
- 213కి చేరుకున్న మృతుల సంఖ్య భారత్ సహా 20 దేశాలకు వ్యాప్తి

- వివరాలు 8లో

ఇక గాంధీలోనే కరోనా నిర్ధారణ

- వివరాలు 2లో

చతురోక్తి

ఈ నెల కాస్త డబ్బులు సర్దు ప్లీజ్! జీతం సరిపోవడం లేదు!!

పూర్తయితే డిగ్రీ.. మానేస్తే డిప్లొమా!

డిగ్రీ కోర్సుల్లో మల్టిపుల్ ఎంట్రీ, ఎగ్జిట్ విధానం

- ఏడాది చదివితే డిప్లొమా.. రెండేళ్లు చేస్తే అడ్వాన్స్‌డ్ డిప్లొమా
- నాలుగేళ్ల డిగ్రీ చేసిన వారికి నేరుగా పీహెచ్‌డీలో ప్రవేశాలు
- విద్యార్థి ఏదంటే దానిని ఎంచుకునేలా కొత్త విధానం..
- కేంద్రం అంగీకరిస్తే వచ్చే విద్యా సంవత్సరం నుంచే అమలు

సాక్షి, హైదరాబాద్: డిగ్రీలో ఎప్పుడంటే అప్పుడు ఆగిపోవచ్చు. మధ్యలో మరేదైనా కోర్సు చేసి వచ్చి మళ్లీ పూర్తి చేసుకోవచ్చు. అంతేకాదు ఏడాదో, రెండేళ్లో చదివి పాసైన సబ్జెక్టుల క్రెడిట్లను దాచుకోవచ్చు. ఇలా మధ్యలో చదువు ఆపేసినా చదివిన చదువుకు సర్టిఫికెట్లు ఇచ్చేలా నూతన విద్యా విధానం (ఎన్ఈపీ) కీలక సిఫార్సు చేసింది. డిగ్రీ విద్యా విధానంలో సమూల మార్పులకు కసరత్తు చేస్తున్న కేంద్ర ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా డిగ్రీ కోర్సుల్లో మల్టిపుల్ ఎంట్రీ, ఎగ్జిట్ విధానాన్ని తీసుకురావాలని న్యూ ఎడ్యుకేషన్ పాలసీ ఫైనల్ డ్రాఫ్ట్‌లో కస్తూరి రంగన్ కమిటీ పేర్కొంది. డిగ్రీ చదివే విద్యార్థులు ఆ కోర్సును పూర్తి చేస్తే డిగ్రీ పట్టా, ఏడాది తర్వాత మానేస్తే డిప్లొమా, ద్వితీయ సంవత్సరం పూర్తయ్యాక మానేస్తే అడ్వాన్స్‌డ్ డిప్లొమా సర్టిఫికెట్ ఇచ్చేలా చర్యలు చేపట్టాలని పేర్కొంది. కేంద్రం అంగీకరిస్తే డిగ్రీలో వచ్చే

మిగతా 2వ పేజీలో ▶

పంజా విసురుతున్న క్షయ!



గతేడాది టీబీతో 2 వేల మంది మృతి

2018లో 52 వేలు.. 2019లో 70 వేల కేసులు

ముందస్తుగా గుర్తించక పోవడమే ప్రధాన కారణం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంపై క్షయ వ్యాధి పంజా విసురుతోంది. గతేడాది తెలంగాణలో ఏకంగా 2 వేల మంది చనిపోయారని రాష్ట్ర టీబీ నియంత్రణ విభాగం తాజాగా సర్కారుకు పంపిన క్షయ వార్షిక నివేదికలో వెల్లడించింది. రాష్ట్రంలో ఏటికేటికీ క్షయ విస్తరిస్తున్నట్లు నివేదికలో పేర్కొంది. 2018లో 1,800 మంది చనిపోయారని తెలిపింది. కాగా, రాష్ట్రంలో 2017లో 44,644 టీబీ కేసులు గుర్తిస్తే, 2018లో 52,269 మందికి వ్యాధి సోకింది. 2019లో 70,202 మందికి వ్యాపించింది. అంటే ఏడాదిలోనే ఏకంగా 17,933 కేసులు అదనంగా నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. గతంలో కొంత మేర తగ్గిందనుకున్న ఈ వ్యాధి మళ్లీ పంజా విసురుతోంది. రాష్ట్రంలో ఇది ప్రబలంగా పెరుగుతుండటంపై ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. మందులకు బ్యాక్టీరియా లొంగకపోవడం, దీనిపై అధికార యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ చూపకపోవడం తదితర కారణాలతో ఈ వ్యాధి మరింత విస్తరిస్తోందని వైద్య నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

హైదరాబాద్‌లో అత్యధికం..: రాష్ట్రంలో టీబీ కేసులు ఎక్కువగా హైదరాబాద్‌లోనే నమోదవుతున్నాయి. గతేడాది

మిగతా 2వ పేజీలో ▶

డిగ్రీ కాలేజీల్లో కొత్త కోర్సులు

- 60 శాతంపైగా ప్రవేశాలున్న కాలేజీలకే అనుమతి
- ఉన్నత విద్యా మండలి నోటిఫికేషన్ జారీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని డిగ్రీ కాలేజీల్లో వచ్చే విద్యా సంవత్సరంలో కొత్త కోర్సులను ప్రారంభించేందుకు ఉన్నత విద్యా మండలి నోటిఫికేషన్ జారీ చేసింది. యాజమాన్యాల నుంచి వచ్చే నెల 12వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించేందుకు చర్యలు చేపట్టింది. అలాగే అదనపు సీట్లు, సెక్షన్లు కూడా మంజూరు చేసేందుకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొంది. అలాగే పీజీ కాలేజీల్లోనూ కొత్త కోర్సులు, అదనపు సెక్షన్లు మంజూరు చేసేందుకు కూడా నోటిఫికేషన్ జారీ చేసింది. అలాగే కోర్సుల విత్‌డ్రా, మీడియం మార్పు కోసం కూడా దరఖాస్తు చేసుకోవాలని వెల్లడించింది. అయితే గత విద్యా సంవత్సరంలో 60 శాతం ప్రవేశాలున్న కాలేజీల్లోనే కొత్త కోర్సులు, అదనపు సెక్షన్లు ప్రారంభించేందుకు అనుమతి ఇవ్వాలని నిర్ణయించింది. తద్వారా నాణ్యతా ప్రమాణాలు పాటించే కాలేజీల్లోనే సీట్లను పెంచనున్నట్లు మండలి వర్గాలు పేర్కొన్నాయి. గతేడాది 50 నుంచి 60 శాతంలోపు సీట్లు భర్తీ అయిన కాలేజీలు 110 వరకు ఉండగా, 60 నుంచి 70 శాతంలోపు సీట్లు భర్తీ అయిన కాలేజీలు 90 వరకు ఉన్నాయి. 70 నుంచి 80 శాతంలోపు సీట్లు భర్తీ అయిన కాలేజీలు 67 ఉండగా, 80 శాతానికి పైగా సీట్లు భర్తీ అయిన కాలేజీలు 50 వరకు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఒక్కో కాలేజీలో సగటున 100 సీట్లు పెరిగే అవకాశం ఉంటుందని, దాంతో డిగ్రీ కాలేజీల్లో వచ్చే విద్యా సంవత్సరంలో 20 వేల వరకు సీట్లు పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నాయి. అయితే కోర్సులను ఉపసంహరించుకునేవి పరిగణనలోకి తీసుకుంటే 5 వేల వరకు సీట్లు తగ్గే అవకాశం ఉంటుందని వెల్లడించాయి. మరోవైపు మండల పరిధిలో డిగ్రీ కాలేజీలను షిఫ్ట్ చేసుకునేందుకు 40 వరకు కాలేజీలు దరఖాస్తు చేసుకున్నాయి.



పీజీ నీట్ పరీక్షా ఫలితాలు విడుదల

- రాష్ట్రం నుంచి 10వేల మంది రాసినట్లు అంచనా
- తప్పుడు ప్రశ్నకు అభ్యర్థులందరికీ మార్కులు

సాక్షి, హైదరాబాద్: నీట్ పీజీ-2020 ఫలితాలను నేషనల్ బోర్డు ఆఫ్ ఎగ్జామినేషన్ (ఎన్‌బీఈ) శుక్రవారం విడుదల చేసింది. పరీక్ష రాసిన వారిలో 55 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. దేశవ్యాప్తంగా 1,67,102 మంది నీట్ పీజీ రాసేందుకు దరఖాస్తు చేసుకోగా, అందులో 1,60,888 మంది పరీక్షకు హాజరయ్యారు. ఇందులో 89,549 మంది ఉత్తీర్ణులైనట్లు ఎన్‌బీఈ ప్రకటించింది. తెలంగాణ నుంచి దాదాపు 10 వేల మంది వరకు పరీక్ష రాసి ఉంటారని కాళోజీ హెల్త్ యూనివర్సిటీ వర్గాలు తెలిపాయి. అయితే ఎంతమంది తెలంగాణ నుంచి ఉత్తీర్ణులయ్యారన్న విషయం తమకు ఇంకా సమాచారం రాలేదని వెల్లడించాయి. దేశవ్యాప్తంగా 41 పట్టణాల్లో నీట్ పీజీ ప్రవేశ పరీక్షలు జరిగాయి. దేశంలోని మెడికల్ కాలేజీల్లో ఎండీ, ఎంఎస్, పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశం కోసం ఈ పరీక్ష నిర్వహించారు. ఈ నెల 3వ తేదీ నాటికి ప్రతీ విద్యార్థి స్కోర్ కార్డును ఎన్‌బీఈ అప్‌లోడ్ చేస్తుంది. ఈ నెలలోనే ఆలిండియా స్థాయిలో పీజీ వైద్య విద్య ప్రవేశాలకు సంబంధించిన దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైతే, రాష్ట్రంలో మార్చి 15 నుంచి మొదలవుతుందని వర్గాలు పేర్కొన్నాయి. మొత్తం 1,200 మార్కులకు నీట్ పీజీ పరీక్ష నిర్వహించారు. అందులో జనరల్/ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు కట్-ఆఫ్ 366, జనరల్ పీహెచ్ అభ్యర్థులకు 342, ఓబీసీ/ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు కట్ ఆఫ్ 319గా నిర్ధారించారు. అలాగే రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో 1,624 వరకు పీజీ వైద్య విద్య సీట్లున్నాయి. ఒక్క ప్రభుత్వ వైద్య విద్య కాలేజీల్లోనే 760 సీట్ల వరకు ఉన్నాయి. ఇటీవలే నిజామాబాద్ మెడికల్ కాలేజీకి 54 పీజీ సీట్లు వచ్చాయి. వాటిలో కూడా ఈ సంవత్సరం నుంచే ప్రవేశాలుంటాయని అధికారులు వెల్లడించారు. పరీక్షలో అడిగిన ఒక ప్రశ్న తప్పు అని తేలడంతో అభ్యర్థులందరికీ ఆ ప్రశ్నకు పూర్తి మార్కులు లభించాయి. ఆ ప్రశ్నకు సమాధానం రాసినా, రాయకపోయినా అభ్యర్థులందరికీ పూర్తి మార్కులు ఇచ్చినట్లు ఎన్‌బీఈ ప్రకటించింది.

వైద్య కాలేజీల్లో రుసుములపై
హైకోర్టు తీర్పు నిలిపివేత

సాక్షి, న్యూఢిల్లీ: వైద్య కాలేజీల్లో విద్యార్థుల నుంచి రుసుములు నాలుగున్నరేళ్లదే వసూలు చేయాలని, తదుపరి ఆరు నెలల కాలానికి వసూలు చేయరాదని తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సుప్రీంకోర్టు నిలిపివేసింది. హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ తెలంగాణ ప్రైవేట్ వైద్య, దంత కాలేజీల యాజమాన్య సంఘం తరపున రమేశ్ అల్లంకి అండ్ అసోసియేట్స్ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ ఇందిరా బెనర్జీ, జస్టిస్ సంజీవ్ ఖన్నాలతో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారించింది. పిటిషనర్ తరపున న్యాయవాదులు ఆర్.వెంకటరమణి, రమేశ్‌లు వాదనలు వినిపించారు. 'వైద్య విద్య కోర్సు నాలుగున్నరేళ్లే అయినప్పటికీ విద్యార్థులకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు ఆ నాలుగున్నరేళ్ల రుసుమునే ఐదేళ్లకు సర్దుబాటు చేసి వైద్య విద్యాసం స్థలు వసూలు చేస్తాయి. అది కూడా అడ్మిషన్లు, ఫీజుల నియంత్రణ కమిటీ ఖరారు చేసిన ఫీజులనే వసూలు చేస్తాయి. కానీ 2018లో వైద్య విద్యలో ప్రవేశాన్ని ఆకాంక్షించిన విద్యార్థిని దాఖలు చేసిన కేసులో ఎంసీఐని గానీ, ఫీజుల నియంత్రణ కమిటీని గానీ, కాలేజీల యాజమాన్యాలను గానీ ప్రతివాదులను చేయలేదు. హైకోర్టు కూడా ప్రతివాదులుగా చేర్చాలని ఆదేశించలేదు. ప్రతివాదులు లేకుండానే హైకోర్టు.. ప్రభుత్వ జీవోను రద్దు చేస్తూ ఫీజును నాలుగున్నరేళ్లకే వసూలు చేయాలంటూ జనవరి 10న ఆదేశించింది. అంటే ఒక ఏడాది ఫీజులో సగం ఫీజును తగ్గించింది. అడ్మిషన్లు, ఫీజుల నియంత్రణ కమిటీ ఫీజు నిర్ధారించిన తర్వాత ఫీజుల నిర్ధారణలో కోర్టులు జోక్యం చేసుకోజాలవని సుప్రీంకోర్టు గతంలో చెప్పింది'అని వాదనలు వినిపించారు. ఈనే పథ్యంలో ధర్మాసనం తెలంగాణ సర్కారుకు, కాళోజీ నారాయణ రావు హెల్త్ వర్సిటీకి, హైకోర్టులో పిటిషనర్ అయిన విద్యార్థినికి నోటీసులు జారీచేసింది. జీవోను రద్దు చేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై స్టే ఇచ్చింది.

పంజా విసురుతున్న క్షయ!

▶ మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్‌లో అత్యధికంగా 12,658 కేసులు నమోదయ్యాయి. ఆ తర్వాత రంగారెడ్డి జిల్లాలో 4,439 కేసులు నమోదయ్యాయి. మేడ్చల్ జిల్లాలో 4,025 కేసులు నమోదయ్యాయి. ఖమ్మం జిల్లాలో 3,668 కేసులు నమోదయ్యాయి. అత్యంత తక్కువగా ములుగు జిల్లాలో 403 మందికి మాత్రమే టీబీ సోకినట్లు నివేదిక తెలిపింది. కాగా, గతేడాది టీబీ, ఎయిడ్స్ రెండూ సోకినవారు రాష్ట్రంలో 2,196 మంది ఉన్నారని నివేదిక వెల్లడించింది. 25 శాతం హెచ్ఐవీ బాధితుల మరణాలు టీబీ వల్లేనని తెలిపింది.

క్షయ రోగులకు అందని కేంద్ర సాయం..

నేరుగా నగదు బదిలీ పద్ధతిలో క్షయ వ్యాధిగ్రస్తులకు నెలకు రూ.500 కేంద్రం ఇస్తుంది. అయితే రాష్ట్రంలో అనేక మంది క్షయ రోగులకు ఆ ఆర్థిక సహాయం అందట్లేదు. వారికి బలమైన పోషకాహారాన్ని అందించేందుకు ఇస్తున్న ఈ సొమ్ము రాకపోవడంతో అనేకమంది రోగులు ఆందోళన చెందుతున్నారు. కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ నుంచి స్పందన లేకపోవడం వల్లే ఈ పరిస్థితి నెలకొందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ వర్గాలు చెబుతున్నాయి. రాష్ట్రంలో 2017 నవంబర్ నుంచి ఈ ఏడాది 2019 డిసెంబర్ వరకు 1,22,784 మంది క్షయ వ్యాధిగ్రస్తులు కేంద్ర ఆర్థిక సాయానికి అర్హులుగా తేలారు. అందులో 72,216 మందికి (59%) మాత్రమే సొమ్ము అందినట్లు నివేదిక తెలిపింది.

శుక్రవారం పార్టీ ముఖ్యనేతల సమావేశంలో మాట్లాడుతున్న టీపీసీసీ చీఫ్ ఉత్తమ్. చిత్రంలో జగ్గారెడ్డి, నిరంజన్, జీవన్‌రెడ్డి, జానారెడ్డి, కోదండరెడ్డి, వంశీ చంద్, షబ్బీర్ అలీ, శశిధర్‌రెడ్డి, చిన్నారెడ్డి తదితరులు

ఎక్స్ అఫీషియో ఓటుపై కోర్టుకు?

టీపీసీసీ భేటీలోచర్చ • సహకార ఎన్నికల్లో టీఆర్ఎస్‌ను ఓడించాలి: ఉత్తమ్

సాక్షి,హైదరాబాద్

మున్సిపల్ ఎన్నికల్లో అధికార టీఆర్ఎస్ ఎక్స్ అఫీషియో ఓట్లతో ప్రజాతీర్పునకు విఘాతం కలిగించేలా వ్యవహరించిందని, ఈ అంశంపై న్యాయస్థానాన్ని ఆశ్రయించాలని టీపీసీసీ నిర్ణయించింది. తుక్కుగూడ మున్సిపాలిటీలో ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన టీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు కె.కేశవరావు ఓటేయడం, ముందుగా తుక్కుగూడకు టీఆర్ఎస్ ఎక్స్‌అఫీషియోగా కేటాయించిన ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డిని మళ్లీ నేరెడుచర్లకు మార్చడం, మంత్రి సబితా ఇంద్రారెడ్డి తొలుత బడంగ్‌పేటకు ఆప్షన్ ఇచ్చి, ఆ తర్వాత తుక్కుగూడలో ఓటేయడం వంటి ఉదంతాలపై చట్టపరంగా కోర్టును ఆశ్రయించాలని భావిస్తోంది. ఆయా సందర్భం, అవసరాన్ని బట్టి రాజ్యసభ ఎంపీల ఎక్స్ అఫీషియో ఓటు వ్యవహారంపై రాజ్యసభ చైర్మన్‌ను, సెక్రటేరియట్‌ను కోరాలని కొందరు నేతలు ప్రతిపాదించినట్టు సమాచారం. ఈ ఓటు విషయంలో తాము ముందు నుంచి హెచ్చరిస్తున్నా రాష్ట్ర ఎన్నికల కమిషన్ సరిగా స్పందించలేదని, అధికారపక్షానికి అనుకూలంగా వ్యవహరించిన తీరును ఎండగట్టాల్సిన అవసరం ఉందని ఈ సమావేశంలో నేతలు అభిప్రాయపడ్డారు.శుక్రవారం రాత్రి టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నివాసంలో జరిగిన సమావేశంలో ఆయా అంశాలు చర్చకు వచ్చాయి.

ప్రజాతీర్పును కాదని టీఆర్ఎస్ వ్యవహరించింది

మున్సిపల్ ఎన్నికల్లో టీఆర్ఎస్ అక్రమాలు, ఎక్స్ అఫీషియో సభ్యుల విషయంలో రాష్ట్ర ఎన్నికల కమిషన్ వ్యవహరించిన తీరుపై చర్చించారు. న్యాయనిపుణుల సలహాలు, సూచనల మేరకు దీనిపై చట్టపరంగా ముందుకెళ్లాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో పార్టీ సీనియర్‌నేతలతో పాటు, న్యాయవాది జంధ్యాల రవిశంకర్ పాల్గొన్నారు. త్వరలోనే జరగనున్న సహకార సంఘాల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ పక్షాన అనుసరించాల్సిన వ్యూహం పైన చర్చించారు. అనంతరం ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఈ సమావేశంలో అధికార టీఆర్ఎస్ ఎక్స్ అఫీషియో ఓటింగ్ విషయంలో వ్యవహరించిన తీరుపై చర్చించినట్టు తెలిపారు.ప్రజాతీర్పును కాదని పలు మున్సిపాలిటీలను టీఆర్ఎస్ అక్రమంగా కైవసం చేసుకుందని, ఇతర పార్టీల నుంచి గెలిచిన వారిని కూడా భయపెట్టారని ధ్వజమెత్తారు. దీనిపై న్యాయ పోరాటానికి సిద్ధమవుతున్నట్టు వెల్లడించారు. కేసీఆర్ హయాంలో రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఈ భేటీలో సహకార ఎన్నికలపై అనుసరించాల్సిన వ్యూహంపై కూడా చర్చించామన్నారు. టీఆర్ఎస్‌ను సహకార ఎన్నికల్లో ఓడించాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ముఖ్యనేతల సమావేశంలో సీఎల్‌పీ మాజీ నేత కె.జానారెడ్డి, ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే టి.జగ్గారెడ్డి, ఏఐసీసీ కార్యదర్శులు డా.జి.చిన్నారెడ్డి, డా.సీహెచ్ వంశీచంద్‌రెడ్డి, మాజీ మంత్రులు మహ్మద్ అలీ షబ్బీర్, మర్రి శశిధర్‌రెడ్డి, కిసాన్‌సెల్‌నేత ఎం.కోదండరెడ్డి, టీపీసీసీనేత గోపిశెట్టి నిరంజన్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో శానిటేషన్ హబ్

పారిశుద్ధ్యంపై పరిశోధనలకు ఇన్‌క్యుబేటర్: కేటీఆర్

- ఆస్కీ ప్రాంగణంలో ఏర్పాటు
- రూ.25 కోట్లు కేటాయిస్తాం

సాక్షి, హైదరాబాద్: నీరు, పారిశుద్ధ్యం, మురుగు నీటి, ఘన వ్యర్థాల నిర్వహణ, వృథా జలాల రిసైక్లింగ్‌పై పరిశోధనలు నిర్వహించే స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు శానిటేషన్ హబ్ (ఎస్-హబ్) పేరుతో కొత్త ఇన్‌క్యూబేటర్‌ను ఏర్పాటు చేస్తామని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. దీనికోసం తొలుత రూ.25 కోట్లు కేటాయిస్తామన్నారు. నీరు, పారిశుద్ధ్యం, స్వచ్ఛత రంగంలో రాష్ట్రం తో పాటు దేశానికే ఎస్-హబ్ ఒక మార్గదర్శిగా మారనుందన్నారు. నగరం లోని అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో శుక్రవారం పారిశుద్ధ్యంపై జరిగిన ఓ సదస్సులో మంత్రి మాట్లాడారు. ఈ కళాశాల ప్రాంగణంలోనే ఎస్-హబ్‌ను రెండేళ్ల పాటు నిర్వహిస్తామని, ఆ తర్వాత దీనికోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామన్నారు. వాటర్, శానిటేషన్, హైజీన్(వాష్) లను రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత అంశాలుగా తీసుకుందని, వీటికి సంబంధించిన లక్ష్యాలను సాధించేందుకు కట్టుబడి ఉందన్నారు. నీరు, పారిశుద్ధ్యం పరిశోధనల కేంద్రంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతామన్నారు. తెలంగాణ ఇప్పటికే బహిరంగ మల విసర్జన నిర్మూలన(ఓడీఎఫ్)ను సాధించిందని, ఓడీఎఫ్++ స్థాయిని సాధించే దిశగా ప్రయత్నిస్తోందన్నారు. రాష్ట్రంలోని ప్రతి ఇంటికి రక్షిత మంచి నీరు సరఫరా చేస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన మున్సిపల్ చట్టంలో పారిశుద్ధ్యం నిర్వహణకు పెద్ద పీట వేసిందన్నారు.

ఈ చిన్నారి మనసు దోచుకున్నాడు..: మంత్రి కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: 'గత 2 రోజులుగా కొత్తగా ఎన్నికైన మున్సిపల్ చైర్‌పర్సన్లు, వందల మంది కౌన్సిలర్లను కలిసి అభినందనలు తెలియజేస్తున్నాను. కానీ, అన్ని వందల మందిలో ఈ చిన్నారి నా మనసును దోచుకున్నాడు.' అని పేర్కొంటూ మంత్రి, టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ట్విట్టర్‌లో పోస్టు చేసిన ఓ వీడియో వైరల్‌గా మారింది. కొత్తగా ఎన్నికైన ఓ మహిళా కౌన్సిలర్ కేటీఆర్‌ను కలవడానికి చిన్నారిని చంకనెత్తుకుని రాగా, కేటీఆర్ ఆ చిన్నారిని ఎత్తుకుని కొద్దిసేపు ముద్దు చేశారు.

ఇక గాంధీలోనే 'కరోనా' నిర్ధారణ

- హైదరాబాద్‌కు చేరుకున్న వ్యాధి నిర్ధారణ కిట్లు
- గాంధీ ఆస్పత్రిలో ట్రయల్‌రన్ ప్రారంభం
- మరోవైపు పెరుగుతున్న కరోనా అనుమానిత కేసులు
- గాంధీలో నలుగురు.. 'ఫీవర్'లో మరో నలుగురు
- ఉండలేమంటూ ఇంటికెళ్లిపోయిన ఇద్దరు కరోనా అనుమానితులు

హైదరాబాద్

కరోనా వైరస్ వ్యాధి నిర్ధారణ ట్రయల్ రన్ పరీక్షలు గాంధీ ఆస్పత్రిలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఇప్పటికే ప్రభుత్వం పుణేలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ (ఎన్ఐవీ) ల్యాబ్ నుంచి వ్యాధి నిర్ధారణకు అవసరమైన రీఏజెంట్స్ (ద్రావకాలు)ను హైదరాబాద్‌కు తెప్పించింది. గాంధీ ఆస్పత్రి మైక్రోబయాలజీ విభాగాధిపతి డాక్టర్ నాగమణి నేతృత్వంలోని వైద్య బృందం పర్సనల్ ప్రొటెక్షన్ ఎక్విప్‌మెంట్ ధరించి ట్రయల్ రన్‌లో భాగంగా స్క్రీనింగ్ టెస్ట్‌లు నిర్వహించింది. గాంధీలో వచ్చిన రిపోర్టులను, పుణే వైరాలజీ ల్యాబ్ జారీ చేసిన రిపోర్టులతో సరిచూసి, రిపోర్టుల జారీలో ఎలాంటి తేడాలు లేవని నిర్ధారించుకున్న తర్వాత పూర్తిస్థాయిలో నిర్ధారణ పరీక్షలు ఇక్కడే చేయనున్నారు.

మరో 8 అనుమానిత కేసులు..

కరోనా వైరస్ అనుమానిత లక్షణాలతో బాధపడుతూ తాజాగా గాంధీ ఆస్పత్రిలో నలుగురు, ఫీవర్ ఆస్పత్రిలో మరో నలుగురు బాధితులు చేరారు. వీరిలో ఓ మహిళ కూడా ఉంది. ఇటీవలే వీరంతా చైనా నుంచి నగరానికి చేరుకున్నారు. వీరిలో 25 నుంచి 40 ఏళ్ల లోపు వయసు ఉన్నవారే ఎక్కువగా ఉండటం విశేషం. వీరి నుంచి నమూనాలు సేకరించి వ్యాధి నిర్ధారణ పరీక్షల కోసం పంపారు. రిపోర్టులు రావాల్సి ఉంది. ఇదిలా ఉంటే ఇప్పటివరకు 16 మంది అనుమానితుల నుంచి నమూనాలు సేకరించి, నిర్ధారణ పరీక్షలు చేయించగా, వీరిలో 9 మందికి నెగిటివ్ వచ్చింది. దీంతో వారిని ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. మిగిలిన వారి రిపోర్టులు రావాల్సి ఉంది.

కరోనా కాదు.. స్వైన్‌ఫ్లూ..

కరోనా అనుమానంతో 4 రోజుల క్రితం ఫీవర్‌లో చేరి, గురువారం ఆస్పత్రి నుంచి ఇంటికి వెళ్లిపోయిన గోదావరిఖనికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన భర్త(31), భార్య(25), కుమార్తె(5)ల్లో భర్త సహా కుమార్తెకు స్వైన్ ఫూగా నిర్ధారణ అయింది. భార్య రిపోర్టు నెగిటివ్ వచ్చింది. దీంతో వైద్యులు వారి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. సమీపంలో ఉన్న ఆస్పత్రిలో చేరి చికిత్స పొందాల్సిందిగా సూచించారు.

గాంధీ వైరాలజీ ల్యాబ్‌లో కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్న నిపుణులు

వెళ్లిపోయిన కరోనా అనుమానితులు..

చైనా నుంచి ఇటీవలే నగరానికి చేరుకుని జలుబు, దగ్గు, జ్వరంతో బాధపడుతున్న (25), (28), (30), (31) వయసున్న బాధితులను ఫీవర్ ఆస్పత్రి వైద్యులు ఐసోలేషన్ వార్డులో అడ్మిట్ చేశారు. వీరిలో ముగ్గురు నగరానికి చెందిన వారు కాగా, మరొకరు తాండూరుకు చెందిన యువతిగా తెలిసింది. గురువారం చేరిన ఓ వ్యక్తితో పాటు, శుక్రవారం చేరిన నలుగురిలో ఇద్దరు ఇక్కడి వార్డులో ఉండలేమని చెప్పి సాయంత్రం ఇంటికి వెళ్లిపోయినట్లు తెలిసింది. రేబీస్‌వార్డు పక్కనే ఐసోలేషన్ వార్డు ఏర్పాటు చేయడం, మౌలిక సదుపాయాలు లేకపోవడమే రోగుల విముఖతకు కారణ మని తెలిసింది. కాగా ప్రస్తుతం ఐసోలేషన్ వార్డులో ఇద్దరు అనుమానిత కరోనా కేసులు మాత్రమే ఉన్నాయని, వీరి నుంచి శాంపిల్స్ సేకరించి నిర్ధారణ పరీక్షలకు పంపిస్తామని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. కరోనాపై అప్రమత్తంగా ఉన్నామని, ఎటువంటి భయాందోళన చెందాల్సిన అవసరం లేదని గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ శ్రవణ్‌కుమార్ తెలిపారు. కరోనా నోడల్ ఆఫీసర్‌గా ఆర్ఎంవో ప్రభాకర్‌రావును నియమించినట్లు తెలిపారు.

అమాంతం పెరిగిన మాస్క్‌ల ధరలు

కరోనా వైరస్ ప్రభావం గాంధీ ఆస్పత్రిపై పడింది. కరోనా, స్వైన్‌ఫ్లూ వంటి ప్రాణాంతకమైన వైరల్ ఫీవర్లకు నోడల్ కేంద్రమైన ఈ ఆస్పత్రిలో వైద్యులు, వైద్య విద్యార్థులు, సిబ్బంది, రోగులు, రోగి సహాయకులు భయాందోళనకు గురై తప్పనిసరిగా సాధారణ మాస్క్‌లతోపాటు ఎన్90 మాస్క్‌లను వినియోగిస్తున్నారు. దీంతో మాస్క్‌ల ధరలు అమాంతం పెరిగిపోయాయి.

కరోనా వైరస్‌పై వదంతులు నమ్మవద్దు: ఈటల

రాష్ట్రంలో కరోనా వైరస్ ప్రభావం లేదని వైద్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ తెలిపారు. శుక్రవారం ఉస్మానియా వైద్య కళాశాల ఆవరణలో మీడియాతో మాట్లాడుతూ.. చైనా నుంచి భారత్‌కు వచ్చిన 12 మందికి కరోనా వైరస్ నిర్ధారణ పరీక్షలు చేయించామని తెలిపారు. అందులో 9 మం దికి వైరస్ లేదని తెలిందన్నారు. మిగతా వారిని పరీక్షిస్తున్నారన్నారు. సోషల్ మీడియాలో వచ్చే వదంతులను ప్రజలు పట్టించుకోవద్దన్నారు.

పూర్తయితే డిగ్రీ.. మానేస్తే డిప్లొమా!

▶ మొదటి పేజీ తరువాయి

విద్యా సంవత్సరంలో ఈ విధానం అమల్లోకి రానుంది.

పోటీని ఎదుర్కొనేలా..

విద్యార్థుల్లో నైపుణ్యాల పెంపు, పోటీని ఎదుర్కునే సత్తా పెంపొందించడం, ఉపాధి అవకాశాలు మెరుగుపరచడం లక్ష్యంగా నూతన విద్యా విధానంలో పలు కీలక అంశాలను పొందుపరిచారు. దేశంలో ప్రస్తుతం కొనసాగుతున్న డిగ్రీ విద్యా విధానాన్ని సమగ్రంగా పరిశీలించిన పాలసీ కమిటీ అన్ని స్థాయిల్లో హ్యూమానిటీస్, ఆర్ట్స్ జొప్పించడంతోపాటు అభ్యసన సామర్థ్యాల పెంపు, క్రియేటివిటీ, ఇన్నొవేషన్స్, క్రిటికల్ థింకింగ్, ప్రాబ్లం సాల్వింగ్ ఎబిలిటీ, టీమ్ వర్క్, కమ్యూనికేషన్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్ పెంపొందించే విద్యా విధానం తీసుకురావాలని, స్థానిక పరిశ్రమలు, సంస్థల్లో ఇంటర్న్‌షిప్ విధానం అమలు చేయాలని పేర్కొంది. వీటి ద్వారా విద్యార్థుల్లో పరిశోధన, విద్యా సామర్థ్యాలు పెరిగి స్వయం ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెరుగు అవుతాయని తెలిపింది. ఐఐటీల తరహాలో ఇంజనీరింగ్ విద్యా సంస్థలు కూడా ఆర్ట్స్, హ్యూమానిటీస్‌ను ప్రవేశపెట్టాలని స్పష్టం చేసింది. మరోవైపు విద్యార్థులు తమకు నచ్చిన, ఉపాధి అవకాశాలు పొందేందుకు కావాల్సిన కోర్సులు, సబ్జెక్టులను మాత్రమే చదువుకునే విధానాన్ని అందుబాటులోకి (ఫ్లెక్సిబుల్ కరిక్యులమ్) తేవాలని పేర్కొంది.

ఎప్పుడంటే అప్పుడు..

విద్యార్థులు ప్రస్తుతం డిగ్రీలో చేరిన రెండేళ్ల తర్వాత మరో కోర్సు చేయాలంటే ఈ రెండేళ్ల చదువును వదులుకోవాల్సిందే. కానీ ఇకపై అలాంటి విధానాన్ని తొలగించాలని, ఆ రెండేళ్లను చదువును కూడా పరిగణనలోకి తీసుకునేలా, అవసరమైతే తర్వాత ఎప్పుడంటే అప్పుడు కొనసాగించే అవకాశాలను తీసుకురావాలని వెల్లడించింది. చదుకున్న చదువుకు తగిన సర్టిఫికెట్లు ఇవ్వాలని పేర్కొంది. ఇందులో భాగంగా మల్టిపుల్ ఎంట్రీ, ఎగ్జిట్ విధానం తేవాలని స్పష్టం చేసింది. ప్రస్తుతం సంప్రదాయ డిగ్రీలు మూడేళ్లు, ఇంజనీరింగ్ వంటి డిగ్రీలు నాలుగేళ్లు ఉన్నాయి. డిగ్రీ మూడేళ్లు, నాలుగేళ్లు ఉన్నా.. వాటిని చదువుతూ మధ్యలో ఆపినవారికి తగిన సర్టిఫికెట్లు ఇవ్వాల్సిందేనని పేర్కొంది. డిగ్రీలో చేరిన విద్యార్థికి మొదటి ఏడాది పూర్తయితే డిప్లొమా సర్టిఫికెట్, రెండేళ్లు పూర్తయితే అడ్వాన్స్‌డ్ డిప్లొమా సర్టిఫికెట్, మూడేళ్లు పూర్తయితే డిగ్రీ సర్టిఫికెట్ ఇవ్వాలని పేర్కొంది. అదే నాలుగేళ్ల డిగ్రీ చేస్తే పరిశోధన డిగ్రీగా పరిగణించాలని పేర్కొంది. రెగ్యులర్ కోర్సులతోపాటు వొకేషనల్, ప్రొఫెషనల్ కోర్సుల్లోనూ దీనిని అమలు చేయాలని తెలిపింది.

ఎప్పుడైనా.. ఎక్కడైనా..

విద్యార్థులు ఎప్పుడైనా, ఎక్కడైనా చదువుకునే విద్యా విధానం డిగ్రీలో ఉండాలని పేర్కొంది. ఇందుకోసం అకడమిక్ బ్యాంక్ క్రెడిట్స్‌ను (ఏబీసీ) ఏర్పాటు చేయాలని వెల్లడించింది. తద్వారా విద్యార్థి ఒక రాష్ట్రంలో లేదా ఒక యూనివర్సిటీలో డిగ్రీ ప్రథమ సంవత్సరం పూర్తి చేసి, మరో రాష్ట్రంలో లేదా మరో యూనివర్సిటీలో చదువుకునేలా అవకాశం ఇవ్వాలని పేర్కొంది. అయితే ముందుగా చదివిన క్రెడిట్లు నష్టపోకుండా, వాటిని పరిగణనలోకి తీసుకొని డిప్లొమా లేదా డిగ్రీ సర్టిఫికెట్ ఇచ్చేలా చర్యలు చేపట్టాలని స్పష్టం చేసింది. ఇందుకోసం ఏబీసీని ఏర్పాటు చేయాలని వెల్లడించింది. ఇందులో విద్యార్థి తను పాసైన సబ్జెక్టుల క్రెడిట్లను దాచుకోవచ్చు. మిగతా సబ్జెక్టులను అక్కడే చదివినా, ఇతర యూనివర్సిటీల్లో చదివినా వాటికి క్రెడిట్లు ఇవ్వాలి. ఇలా ఒక డిప్లొమా, అడ్వాన్స్‌డ్ డిప్లొమా, డిగ్రీకి అవసరమైన నిర్ణీత క్రెడిట్లను ఆ విద్యార్థి సాధించగానే అతనికి సంబంధిత సర్టిఫికెట్‌ను అందించే విధానం తేవాలని స్పష్టం చేసింది. తద్వారా విద్యార్థులు నచ్చిన సబ్జెక్టులను చదువుకోవడంతోపాటు ఉద్యోగ అవకాశాలు మెరుగవుతాయని వివరించింది.

పీజీ రెండో ఏడాదంతా పరిశోధనే..

మూడేళ్ల డిగ్రీ పూర్తి చేసినవారు పోస్టు గ్రాడ్యుయేషన్‌లో (పీజీ) మొదటి ఏడాది చదువుకుంటే రెండో ఏడాదంతా పరిశోధనపైనే ఉండేలా చర్యలు చేపట్టాలని పేర్కొంది. అదే నాలుగేళ్ల పరిశోధన డిగ్రీ చేసిన వారు ఒక్క ఏడాదే పీజీ చేసేలా చర్యలు చేపట్టాల

రసాయన పరిశ్రమలో విస్ఫోటం!

భారీ శబ్దంతో పేలిన 4,500 టిన్నర్ డ్రమ్ములు

- నాలుగు గ్రామాలకు వ్యాపించిన దట్టమైన పొగలు
- భయంతో పరుగులు తీసిన జనం
- ఊపిరాడక కస్తూర్బా విద్యార్థినుల అస్వస్థత
- రూ.5 కోట్ల విలువైన ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా

రఘునాథపల్లి: ఓ రసాయన పరిశ్రమలో శుక్రవారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. క్షణాల్లో ఉవ్వెత్తున్న మంటలు ఎగిసిపడటం.. నాలుగు గ్రామాలకు దట్టమైన పొగలు వ్యాపించడంతో స్థానికులు భయాందోళన చెందారు. షార్ట్ సర్క్యూటే దీనికి కారణమని చెబుతున్నారు. ఈ ప్రమాదంలో సుమారు రూ. 5 కోట్ల మేర ఆస్తి నష్టం వాటిల్లిందని ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. ఈ సంఘటన జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం ఖిలాషాపూర్‌లోని తారా కెమికల్ ఫ్యాక్టరీ (ఇండస్ట్రీస్ టిన్నర్ పరిశ్రమ)లో చోటుచేసుకుంది. వివరాలు.. శుక్రవారం ఉదయం ఎప్పటిలాగే ఫ్యాక్టరీ సిబ్బంది కత్తి సునిల్, కంబాల సాంబరాజు యంత్రాలు ఆన్ చేశారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా మిషన్‌లకు ఉండే బెల్ట్‌కు మొదట మంటలు అంటుకున్నాయి. టిన్నర్‌కు మండే గుణం ఉండటంతో చూస్తుండగానే అక్కడ అగ్ని విస్ఫోటం సంభవించింది. అయితే సిబ్బంది ప్రాణాలతో బయట పడ్డారు. పరిశ్రమలో ఉన్న 4,500 టిన్నర్ డ్రమ్ములు భారీ శబ్దాలతో పేలాయి. దట్టమైన పొగలు నాలుగు గ్రామాలకు వ్యాపించాయి. అయితే ఘటనా స్థలానికి 100 మీటర్ల దూరంలో ఉన్న కస్తూర్బా గాంధీ విద్యార్థినులు భయంతో మేకలగట్టు రహదారి వెంట పరుగులు పెట్టారు. విషవాయువు పీల్చుకుని సుమారు 28 మంది విద్యార్థినులు ఊపిరాడక అస్వస్థతకు గురయ్యారు. 108 వాహనంలో వారిని జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనలో అండర్ గ్రౌండ్‌లో ఉన్న 240 టన్నుల సామర్థ్యం కలిగిన ఐదు ట్యాంకుల్లోని కెమికల్ కాలిపోయింది. మూడు అగ్నిమాపక వాహనాలు తీవ్రంగా శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చాయి.

ఖిలాషాపూర్‌లోని రసాయన పరిశ్రమలో ఎగిసిపడుతున్న మంటలు

నిర్వాహకులపై చర్యలు: కలెక్టర్ వినయ్

సంఘటన స్థలాన్ని కలెక్టర్ వినయ్‌కృష్ణా రెడ్డి, ఆర్డీఓ మధుమోహన్, తహసీల్దార్ బన్సీలాల్, ఇండస్ట్రీస్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీ జానకీనాథ్ ప్రమాదం తీరును పరిశీలించారు. సుమారు రూ.5 కోట్ల మేర ఆస్తి నష్టం సంభవించినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. అయితే మూడేళ్లుగా గ్రామ పంచాయతీ అనుమతి లేకుండా కస్తూర్బా పాఠశాల సమీపంలో పరిశ్రమ ఏర్పాటు చేసినట్లు తెలిసింది. ఈ విషయమై ఫ్యాక్టరీ నిర్వాహకులపై చర్య తీసుకుంటామని కలెక్టర్ పేర్కొన్నారు.

మహబూబ్‌నగర్‌లో 34 డిగ్రీల ఉష్ణోగ్రత

సాక్షి, హైదరాబాద్: మహబూబ్‌నగర్‌లో శుక్రవారం 34 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఖమ్మంలో 33 డిగ్రీలు, భద్రాచలం, హైదరాబాద్‌లలో 31 డిగ్రీల చొప్పున పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రంలో తూర్పు, ఈశాన్య దిశల నుంచి గాలులు వీస్తున్నాయని వాతావరణ కేంద్రం సీనియర్ అధికారి రాజారావు చెప్పారు. దీంతో రానున్న మూడ్రోజులు పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందన్నారు.

సూర్యాపేట జిల్లాలో స్వల్ప భూప్రకంపనలు

చింతలపాలెం: సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలంలో శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు 26 సార్లు స్వల్ప స్థాయిలో భూప్రకంపనలు వచ్చినట్లు తహసీల్దార్ కమలాకర్ తెలిపారు. ఈ భూప్రకంపనలపై పరిశీలన కోసం జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) నిపుణులు రెండు మూడు రోజుల్లో మండలానికి రానున్నట్లు ఆయన తెలిపారు.

3న బయల్దేరనున్న పగిడిద్దరాజు

- పగడాలతో 70 కిలోమీటర్లు అర్రెం వంశీయుల కాలినడక
- 5న మేడారానికి రాక

గుండాల: ఈ నెల మూడో తేదీన సమ్మక్క భర్త, సారలమ్మ తండ్రి అయిన పగిడిద్దరాజు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలం వేపలగడ్డ నుంచి బయలుదేరనున్నారు. వేపలగడ్డ నుంచి పగడాలతో 70 కి.మీల దూరంలో ఉన్న మేడారానికి అర్రెం వంశీయులు కాలినడకన బయలుదేరి.. ఐదో తేదీన మేడారానికి చేరుకుంటారు. దీంతో జాతర ప్రారంభమవుతోంది.

అర్రెం వంశీయుడిగా ప్రసిద్ధి

పగిడిద్దరాజు వేపలగడ్డ గ్రామానికి చెందిన అర్రెం వంశీయుడని, అనాదిగా కొలుస్తున్నామని ఆ వంశీయులు చెబుతున్నారు. నాటి ఆభరణాలు, ఈటెలు, బల్లెం తదితర వస్తువులు ఇప్పటికీ గుడిలో భద్రపరిచారు. వేపలగడ్డ సమీపంలోని తొట్టివాగు వద్ద పగిడిద్దరాజు, సమ్మక్కల గద్దెలు నిర్మించి ప్రతీ సంవత్సరం జాతర నిర్వహిస్తున్నారు. ప్రతీ రెండేళ్ల కోసారి ఇక్కడి నుంచే మేడారం జాతరకు పగడాలు (జెండాల) రూపంలో కాలినడకన తీసుకెళ్లడం ఆనవాయితీగా వస్తోంది.

కొడవటంచ సమీపంలో నడయాడిన వనదేవతలు కిన్నెరసాని నది ఒడ్డున సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు నడయాడినట్లు ప్రతీతి. సమ్మక్కను వివాహం చేసుకున్న తర్వాత పగిడిద్దరాజు తన కుమారుడు జంపన్న, కుమార్తె సారలమ్మలతో కలసి కొడవటంచ సమీపంలోని బర్లగుట్టపై నివసించినట్లు తెలుస్తోంది. జామరగూడెం సమీపంలోని కిన్నెరసాని–మల్లన్న వాగు కలిసే ప్రదేశంలో వారు స్నానాలు చేసేవారని ప్రచారం. దీంతో ఆ వాగుకు ఆదిమడుగుగా పేరు వచ్చింది. అదే ప్రాంతంలో బొర్రికుంటను కూడా వారే తవ్వి ఉంటారని భావిస్తూ, భక్తులు అక్కడ పసుపు కుంకుమలతో నిత్యం పూజలు చేస్తుంటారు.

30 ఏళ్లుగా తీసుకెళ్తున్నా..

మా ఇలవేల్పు, వన దేవత అయిన మేడారం సమ్మక్క భర్త పగిడిద్దరాజు అర్రెం వంశీయుడు. రెండేళ్లకోసారి మేడారానికి పగిడిద్దరాజును తీసుకెళ్తున్నాం. మాతో పాటు పూనుగొండ్ల గ్రామస్తులు వస్తారు. మేడారం తర్వాత మా దగ్గర జాతర జరుపుతాం. 30 ఏళ్లుగా నేను ఇలా కాలినడకన మేడారం చేరుకుంటున్నాను. –అర్రెం అప్పయ్య, పూజారి



సాక్షి
శనివారం, ఫిబ్రవరి, 1

విద్యార్థులపై తూటా

మహాత్ముడి 72వ వర్ధంతి సందర్భంగా దేశ ప్రజలంతా ఆయనకు నివాళులర్పిస్తున్న వేళ న్యూఢిల్లీలో పౌరసత్వ సవరణ చట్టానికి నిరసనగా ర్యాలీ నిర్వహిస్తున్న జామియా మిలియా ఇస్లామియా విశ్వవిద్యాలయం విద్యార్థులపై ఒక దుండగుడు గురువారం కాల్పులు జరిపిన దృశ్యాలు అందరినీ దిగ్భ్రాంతిపరిచాయి. నడిరోడ్డుపై పట్టపగలు ఇంతక్రితం ఎవరూ కాల్పులకు తెగబడలేదని కాదు. మూడు దశాబ్దాలక్రితం ముంబై మహానగరాన్ని గడగడలాడించిన మాఫియా ముఠాలు ఆధిపత్యం కోసం పరస్పరం తుపాకులతో తలపడిన సందర్భాలున్నాయి. ఒక్కోసారి కిరాయి గూండాలు వ్యాపారిపైనో, పారిశ్రామికవేత్తపైనో గురిపెట్టిన ఉదంతాలున్నాయి. అయితే అవన్నీ పోలీసులు ఘటనా స్థలి దరిదాపుల్లో లేనప్పుడు, వారు అప్రమత్తంగా లేనప్పుడు జరిగినవే. కానీ గురువారం నాటి ఉదంతం తీరు వేరు. అక్కడ పోలీసు బలగాలున్నాయి. రాజ్‌ఘాట్ వైపు వెళ్లే విద్యార్థుల్ని బలప్రయోగం చేసైనా నిరోధించడానికి ఆ బలగాలు సంసిద్ధంగా ఉన్నాయి. ఈలోగా నాటు తుపాకి ధరించిన దుండగుడు శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్న విద్యార్థులను గురి చూస్తూ... 'స్వాతంత్ర్యం కావాలా మీకు, ఇదిగో తీసుకోండి' అంటూ కాల్చి ఒక విద్యార్థిని గాయపరిచాడు. ఇదంతా కెమెరాల సాక్షిగా, పోలీసు బలగాల సాక్షిగా జరిగిపోయింది. ఆరు వారాలక్రితం అదే విశ్వవిద్యాలయం విద్యార్థులు పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఆందోళనకు దిగినప్పుడు ఆ ఆవరణలోకి ప్రవేశించి విద్యార్థులపై లాఠీలు ఝుళిపించిన ఢిల్లీ పోలీసులు... ఆ తర్వాత పలుమార్లు ఆందోళనల్ని అడ్డుకోవడంలో అతిగా ప్రవర్తించిన పోలీసులు ఈసారి ఆ దుండగుడు తుపాకి తీసినా, దాంతో విన్యాసాలు చేసినా, చివరకు కాల్పులు జరిపినా చేష్టలుడిగి చూస్తూ ఉండిపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. న్యూజిలాండ్‌లో నిరుడు మార్చిలో క్రైస్ట్ చర్చి నగరంలో 51మందిని ఊచకోత కోసిన దుండగుడి వైనం ఎవరూ మరిచిపోరు. అతగాడు ఈ దాడినంతటినీ ఫేస్‌బుక్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేశాడు. ఢిల్లీలో కాల్పులకు తెగబడిన దుండగుడు కూడా దాడికి ముందు ఫేస్‌బుక్‌లో లైవ్ ఇచ్చాడని చెబుతున్నారు.

దుండగుడు అప్పటివరకూ ఆ ఆందోళనకారులతోనే ఉన్నాడని, ఉన్నట్టుండి వేగంగా ముందు కొచ్చి కాల్పులు జరిపాడని, ఇది హఠాత్ సంఘటన గనుక తేరుకోవడానికి కొంత సమయం పట్టిందని పోలీసులు ఇస్తున్న సంజాయిషీ ఎవరినీ సంతృప్తిపరచదు. ఊహించని పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనడానికి అవసరమైన శిక్షణ వారికుంటుంది. నిత్యం అలాంటి పరిస్థితులతో వ్యవహరిస్తుంటారు కాబట్టి అందుకు సంబంధించిన నైపుణ్యం మెరుగుపడాలి తప్ప తగ్గకూడదు. పైగా అంతవరకూ ఆందోళనకారుల్లో ఒకడిగా ఉన్నవాడు తమవైపు తుపాకి ధరించి, కేకలు పెడుతూ వస్తుంటే అతన్ని అదుపులోకి తీసుకోవడానికి సిద్ధపడాలి. ఎందుకంటే ఆ క్షణంలో అతగాడెవరో తెలిసే అవకాశం లేదు. ఆందోళనకారులవైపునుంచి వస్తున్నాడు గనుక తమకే హాని తలపెట్టొచ్చునని అనుమానం కలగాలి. కనీసం మతి చలించినవాడేమోనన్న సందేహమైనా రావాలి. కానీ పోలీసుల తీరు చూస్తే ఎంతో భరోసాతో ఉన్నట్టు కనబడింది. కాల్పులు జరుపుతున్నాడని అర్థమయ్యాక ఆందోళనకారులు కూడా ఎదురుదాడికి ప్రయత్నించివుంటే మరెంతమందికి హాని కలిగేదో ఊహించలేం. ఉద్రిక్తతలను ఉపశమింపజేయడానికి, ఆ క్రమంలో అవసరమైతే బలప్రయోగం చేయడానికి అక్కడ సిద్ధంగా వున్న పోలీసులు అంత నిర్లిప్తంగా ఉండిపోవడాన్ని ఎవరూ ఊహించలేరు. ఇందుకు ఏ సంజాయిషీ చెప్పినా అది సాకు మాత్రమే అవుతుంది. ఢిల్లీ పోలీసుల నిర్వాకం వెల్లడికావడం ఇది మొదటిసారి కాదు. ఎంతో ప్రతిష్టాత్మకమైన జేఎన్‌యూపై ముసుగులు ధరించిన దుండగులు దాడి చేసి, లేడీస్ హాస్టల్‌తోసహా పలుచోట్ల దాదాపు మూడు గంటలపాటు బీభత్సం సృష్టించిన రోజున కూడా వారు ప్రేక్షకపాత్రే పోషించారు. విశ్వవిద్యాలయం ఉన్నతాధికారుల నుంచి తమకు అనుమతి అందలేదని తప్పించుకోజూశారు. ఆరోజు నిర్వ్యాపకత్వం సరే... ఆ తర్వాతైనా సమర్థత చాటుకోలేక పోయారు. ఇంతవరకూ ఆ దుండగుల్లో ఒక్కరినీ కూడా అరెస్టు చేయలేకపోయారు. దేశ రాజధాని నగరంలో శాంతిభద్రతల పరిస్థితి ఇంత అధ్వాన్నంగా వుంటే ప్రపంచ దేశాల్లో మన పరువు దెబ్బతినదా? కేంద్ర హోంమంత్రి అమిత్ షా, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ కూడా ఢిల్లీ పోలీస్ కమిషనర్‌తో మాట్లాడారు. కానీ 24 గంటలు గడిచినా ఆ యువకుడు ఏ సంస్థకు చెందిన వాడో, నాటు తుపాకి అతనికెలా వచ్చిందో, ఫేస్‌బుక్‌లో అతను పెట్టిన ఉన్మాద రాతల వెనక ఎవరున్నారో పోలీసులు ఇంకా ఆచూకీ రాబట్టినట్టు లేదు.

ఢిల్లీలో ఒకవైపు పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఆందోళనలతోపాటు అసెంబ్లీ ఎన్నికల ప్రచార పర్వం సాగుతోంది. కనుక ఈ రెండూ పరస్పర ప్రభావితాలవుతున్నాయి. 'మీరు మోదీవైపు ఉంటారా, షహీన్‌బాగ్ వైపా?' అని అమిత్ షా నేరుగానే ప్రచార సభల్లో ప్రజల్ని ప్రశ్నిస్తున్నారు. కేంద్ర ఆర్థిక శాఖ సహాయమంత్రి అనురాగ్ ఠాకూర్ మరో అడుగు ముందుకేసి దేశద్రోహుల్ని కాల్చి చంపాలంటూ సభికులతో నినాదాలు చేయించారు. అటు కాంగ్రెస్ సైతం షహీన్‌బాగ్ ఆందోళనల్ని తనకు అనుకూలంగా మలుచుకోవడానికి ప్రయత్నిస్తోంది. కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) పార్టీ ఈ ఉద్యమానికి దూరంగా తమ ప్రభుత్వం అయిదేళ్లలో సాధించిన విజయాల గురించి చెప్పుకుంటోంది. ఆందోళనపై కేజ్రీవాల్ స్పష్టమైన వైఖరి తీసుకోలేదు. ఎన్నికల్లో గెలుపు సాధించడం కోసం ఉద్రిక్తతలను రెచ్చగొట్టడం, ప్రజానీకంలో ఒకరకమైన అభద్రతా భావాన్ని కలగజేయడం బాధ్యతారాహిత్యమని నాయకులు గుర్తించాలి. ఇప్పుడు ఢిల్లీలో కాల్పులకు తెగబడి అరెస్టయిన యువకుడు ఇలాంటి ఉద్రిక్తతలతో ప్రభావితమయ్యాడని అర్థమవుతోంది. కనుక నేతలు సంయమనం పాటించాలి. ఆచితూచి మాట్లాడాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు మాఘ మాసం, తిథి శు.సప్తమి ప.2.36 వరకు, తదుపరి అష్టమి నక్షత్రం అశ్విని సా.5.54 వరకు, తదుపరి భరణి, వర్జ్యం తె.4.18 నుంచి 6.01 వరకు (తెల్లవారితే ఆదివారం), దుర్ముహూర్తం ఉ.6.35 నుంచి 8.06 వరకు, అమృతఘడియలు... ఉ.10.00 నుంచి 11.46 వరకు, రథసప్తమి.

సూర్యోదయం : 6.35
సూర్యాస్తమయం: 5.52
రాహుకాలం : ఉ.9.00 నుంచి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుంచి 3.00 వరకు

సంపన్నుల సేవ ఇంకెంతకాలం?

ప్రభుత్వరంగ సంస్థల్లో అధిక పెట్టుబడులు పెట్టడానికి బదులుగా తరుగుతున్న రాబడులకు పరిష్కారంగా భారత ప్రభుత్వం పెట్టుబడుల ఉపసంహరణే ఏకైక మార్గం అనే మార్గంలో ప్రయాణిస్తోంది. ఈ ప్రక్రియలో ఉన్న ప్రమాదాలు వెనువెంటనే అవగతం కాకపోవచ్చు కానీ దేశంలో సంపన్నులకు, పేదలకు మధ్య అంతరం మరింత పెరగడం మాత్రం ఖాయం. సమాజంలో అశాంతికి, ఆందోళనలకు సంపదల మధ్య అగాధ పూరితమైన అంతరమే కారణమని కొత్తగా చెప్పాల్సిన అవసరం లేదు. దేశంలోని ఒక శాతం సంపన్న భారతీయులు సమాజంలో అట్టడుగున ఉన్న 95.3 కోట్లమంది లేక మొత్తం జనాభాలో 70 శాతం మంది నిర్భాగ్యుల సంపద కంటే నాలుగు రెట్లు అధిక సంపద పోగేసుకున్నారు. మన దేశంలో 63 మంది బిలియనీర్ల మొత్తం సంపద 2018-19 కేంద్ర బడ్జెట్ కంటే ఎక్కువగా ఉంటోంది. ఈ నేపథ్యంలో అతికొద్దిమంది సంపన్నులకు మాత్రమే కాకుండా ప్రతి భారతీయుడికీ ప్రయోజనం కలిగించే ఆర్థిక వ్యవస్థ రూపకల్పనలో కేంద్ర ప్రభుత్వ చిత్తశుద్ధికి నేటి బడ్జెట్ పరీక్షగా మిగలనుంది.

విశ్లేషణ

అంజెలా తనజా

భారతీయ ఆర్థిక వ్యవస్థకి 2019 కలిసిరాని సంవత్సరం. కానీ ఈ సంవత్సరం కూడా భారతీయ అతి సంపన్నుల సంపద భారీగా పెరగడం విశేషం. దేశంలోని ఒక శాతం సంపన్న భారతీయులు సమాజంలో అట్టడుగున ఉన్న 95.3 కోట్లమంది లేక మొత్తం జనాభాలో 70 శాతం మంది నిర్భాగ్యుల సంపద కంటే నాలుగు రెట్లు అధిక సంపద పోగేసుకున్నారు. ఇంకా ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, మన దేశంలో 63 మంది బిలియనీర్ల మొత్తం సంపద 2018-19 కేంద్ర బడ్జెట్ కంటే ఎక్కువగా ఉంటోంది.

అదే సమయంలో భారతదేశ ఆర్థిక వ్యవస్థ కొట్టుమిట్టులాడుతోందని ప్రతి సూచి కూడా సూచిస్తోంది. కాగా, 2016-17 ఆర్థిక సంవత్సరం నుంచి కేంద్ర ఆర్థిక మంత్రులుగా పనిచేసిన వారు అభివృద్ధిని ప్రోత్సహించడం, ఉద్యోగాలు సృష్టించడం పేరిట కార్పొరేట్ పన్నులను తగ్గిస్తూ వస్తున్నారు. కానీ పన్నుల రాయితీ పొందిన సమయంలో అటు ప్రభుత్వం, ఇటు కార్పొరేట్ రంగం ఇచ్చిన హామీలు ఏవీ అమలు కాకుండా పోయాయి. దేశంలో సులభతర వ్యాపార అనుమతుల విషయంలో ర్యాంకులు పైపైకి వెళుతున్నాయి. కార్మిక చట్టాలు, పర్యావరణ సంబంధ క్రమబద్ధీకరణలు బలహీనపడుతున్నాయి కానీ అభివృద్ధి మాత్రం చోటు చేసుకోవడం లేదు.

దీనికి బదులుగా ఇటీవల విడుదల చేసిన నీతి ఆయోగ్ సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ సూచిక ప్రకారం, దేశంలో 22 రాష్ట్రాలు, కేంద్రపాలితప్రాంతాల్లో దారిద్ర్యం, ఆకలి పెరుగుతున్నాయి. ఈ కీలక సమస్యలను పరిష్కరించడంపై దృష్టి పెట్టి మదుపులు పెంచడానికి బదులుగా మీడియా తాజా వార్తలు సూచించినట్లుగా తగ్గిన ప్రభుత్వ రాబడుల నేపథ్యంలో ఈ సంవత్సరం బడ్జెట్‌లో 2 లక్షల కోట్ల రూపాయల వరకు కోత విధించనున్నారు.

కాబట్టి భారత ఆర్థిక వ్యవస్థ పుంజుకోలేదంటే ఆశ్చర్యం కలిగించదు. వినియోగదారుల్లో డిమాండ్ తగ్గుముఖం పట్టడం, పెరుగుతున్న నిరుద్యోగం, కుంగిపోతున్న ఆర్థిక వ్యవస్థ వంటి తీవ్ర సమస్యలకు పరిష్కారం ఏమిటంటే ప్రభుత్వ వ్యయాన్ని ప్రత్యేకించి కార్మికులు ఎక్కువగా అవసరమయ్యే మౌలిక సౌకర్యాల కల్పన ప్రాజెక్టుల్లో ప్రభుత్వ వ్యయాన్ని పెంచడమేనని కీన్సియన్ ఆర్థిక సిద్ధాంతం నిర్దేశిస్తోంది. ప్రభుత్వవ్యయం పెంచడమన్నది మొత్తం ఆర్థిక వ్యవస్థకు జీవం పోయడమే కాకుండా మరిన్ని ఉద్యోగాల కల్పనకు దోహదం చేస్తుంది.

దేశంలో ఉత్పత్తి అవుతున్న సరకులకు వినియోగదారుల నుంచి డిమాండ్ బలహీనపడినప్పుడు కార్పొరేట్ రంగ పన్నులను తగ్గించడం అనేది ఆర్థిక వ్యవస్థను ముందుకు తీసుకుపోయే ఉత్పత్తిలో మదుపు చేసే విషయంలో కంపెనీలకు ఎలాంటి ప్రోత్సాహకాలనూ అందించలేదు. కార్పొరేట్ పన్నులను తగ్గించిన పక్షంలో కంపెనీలు అపార లాభాలను వెనకేసుకుంటాయి. పైగా దేశంలో పేరుకుపోయిన ఆర్థిక అసమానతలను మరింతగా పెంచుతాయి. అంతే తప్ప ఉద్దీపనలు, కార్పొరేట్ రంగానికి పన్ను రాయితీలు ఆర్థిక పెరుగుదలకు ఎంత మాత్రం దోహదపడవు.

మొత్తంమీద ఆర్థిక వ్యవస్థకు సరైన చికిత్స ప్రభుత్వ ఖర్చును తగ్గించడమే అని భారత్ ఆలోచిస్తున్నట్లు కనబడుతోంది. దీనివల్ల దేశ ఆర్థిక వ్యవస్థకు చెందిన సంస్థాగత బలహీనతలను ఎవరూ పట్టించుకోరు. అవేమిటంటే పేలవమైన మౌలిక సదుపాయాల కల్పన, మానవ సామర్థ్యాలు తగినంతగా లేకపోవడం, సరకుల ఉత్పత్తిని పెంపొందించగలిగే పొందికైన పారిశ్రామిక విధానం లోపించడం. పన్నులను ఎగ్గొట్టడానికి అనుమతించే కేంద్ర పన్నుల వ్యవస్థలోని చిల్లులను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అదే సమయంలో వస్తుసేవల పన్ను (జీఎస్టీ) రూపంలో వస్తున్న కలెక్షన్లను మరింతగా మెరుగుపర్చవలసి ఉంది.

భారతదేశం తన పొరుగుదేశమైన చైనా ఉదాహరణ నుంచి నేర్చుకోవలసిన అవసరముంది. ప్రభుత్వ యాజమాన్యంలోని సంస్థల్లో భారీ పెట్టుబడులు పెట్టడం, పారిశ్రామికీకరణకు సంబంధించి స్వల్ప కాలిక, దీర్ఘకాలిక ప్రయత్నాలను అత్యంత నిర్దిష్టంగా చేపట్టడం, ప్రత్యేకించి విద్యపై మదుపును చైతన్యవంతంగా పెంచుతూ పోవడం అనేవి దశాబ్దాలుగా చైనా ప్రపంచంలోనే అత్యధిక వృద్ధి రేటును సాధిస్తూ రావడానికి ప్రధాన కారణాలు. బలిష్టంగా ఉన్న ప్రభుత్వరంగ సంస్థల్లో అధిక పెట్టుబడులు పెట్టడానికి బదులుగా తరుగుతున్న రాబడులకు పరిష్కారంగా భారత ప్రభుత్వం పెట్టుబడుల ఉపసంహరణే ఏకైక మార్గం అనే మార్గంలో ప్రయాణిస్తోంది. ఈ ప్రక్రియలో ఉన్న ప్రమాదాలు వెనువెంటనే అవగతం కాకపోవచ్చు కానీ దేశంలో సంపన్నులకు, పేదలకు మధ్య అంతరం మరింత పెరగడం మాత్రం ఖాయం. సమాజంలో అశాంతికి, ఆందోళనలకు సంపదల మధ్య అగాధ పూరితమైన అంతరమే కారణమని కొత్తగా చెప్పాల్సిన అవసరం లేదు.

ప్రభుత్వ పంథాను నిశితంగా గమనించినట్లయితే సామాజిక సంక్షేమరంగాలపై మదుపులో భారీ కోతలు ఖాయమని అర్థమవుతుంది. ఉదాహరణకు ఒక్క పాఠశాల విద్యలోనే దాదాపు రూ.3,000 కోట్ల వరకు కోత విధించనున్నారు. హాస్యాస్పదమైన అంశం ఏమిటంటే, ఈ సంవత్సరమే భారతీయ బిలియనీర్ల సంపద రోజుకు రూ. 1,710 కోట్లవరకు పెరుగుతూ పోయింది. ఈ నేపథ్యంలో పాఠశాల విద్యపై ఇంత భారీ కోత వల్ల విద్యారంగంలో ఇప్పటికే తగినన్ని నిధుల కేటాయింపు లేక కునారిల్లుతున్న పథకాలు తీవ్రంగా దెబ్బతిననున్నాయి. పైగా విద్యా బడ్జెట్‌ను రెట్టింపు చేస్తున్నట్లు ప్రకటించి రూపొందించిన నూతన విద్యా విధానం ముసాయిదా కూడా ముందంజ వేయని పరిస్థితి ఏర్పడింది.

దేశంలో 31 కోట్లమంది వయోజనులు నిరక్షరాస్యులుగా ఉంటున్నప్పుడు భారత్ ఒక బలమైన ఆర్థిక శక్తిగా అవుతుందని ఎలా ఊహించగలం? బహుశా భారతీయ ఆర్థిక విధానంలో అసమానత్వం పట్ల అత్యంత నిర్లక్ష్యం ప్రదర్శించిన కారణంగానే మన అభివృద్ధి రేటు తగ్గుముఖం పడుతోంది. ప్రపంచ అసమానత్వంపై 2015 అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ చేసిన విశ్లేషణ చూపుతున్నట్లుగా, 20 శాతం అతి సంపన్నుల ఆదాయ వాటా ప్రతి సంవత్సరం పెరుగుతుండగా, స్థూల దేశీయ ఉత్పత్తి (జీడీపీ) తగ్గుముఖం పడుతోంది. సమాజంలో అట్టడుగున ఉంటున్న 20 శాతం మంది నిరుపేదల ఆదాయం పెరిగినప్పుడే జీడీపీలో పెరుగుదల సాధ్యపడుతుంది.

ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాలతో పరస్పరం ముడిపడి వున్న అభివృద్ధి చట్రంలో పేద, మధ్యతరగతి ప్రజల పాత్ర చాలా ముఖ్యమైనదని ఐఎమ్ఎఫ్ అధ్యయనకారులు చెబుతున్నారు. అందుకే దశాబ్దాలుగా బలపడుతూ వచ్చిన భారతీయ సంపన్న వర్గం పన్నుల రూపంలో తన న్యాయమైన వాటాను చెల్లించవలసిన సమయం ఆసన్నమైంది. భారతీయ అత్యంత సంపన్నవర్గంపై సంపదపన్నును తిరిగి ప్రవేశపెట్టడం, వారసత్వ పన్ను, సంపద పన్ను వంటివాటిని పటిష్టంగా అమలు చేయడం ద్వారా మాత్రమే భారత దేశం సంపన్నదేశంగా మారగలదు.

లాభాలపై డివిడెండ్లను ప్రకటించే రంగాలపై మరింత చురుకైన పన్నుల విధానాన్ని అమలు పర్చడానికి కేంద్రప్రభుత్వం డివిడెండ్ పన్నుపై దృష్టి పెట్టవలసిన అవసరం ఎంతైనా ఉంది. రాబోయే కొన్నేళ్లలో అయిదు లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారాలన్న తన దార్శనికతను కేంద్రప్రభుత్వం ఫలవంతం చేయాలంటే, చైనాను అధిగమించాలనే కలను సాకారం చేసుకోవాలంటే.. దేశ ఆర్థిక వ్యవస్థను వెనక్కు లాగుతున్న సంస్థాగత అవరోధాలను పరిష్కరించాల్సి ఉంది. పైగా దాదాపు వందకోట్లమంది నిరుపేదలు, మధ్యతరగతి, బలహీన వర్గాల సమాధులపై దేశంలోని ఒక్క శాతం సంపన్నులు పునాదులు నిర్మించుకునే క్రమం ఇంకా కొనసాగినట్లయితే భారత ఆర్థిక వ్యవస్థ ముందంజ వేయడం అసాధ్యం. అసంభవం కూడా.

అందుకే అతికొద్దిమంది సంపన్నులకు మాత్రమే కాకుండా ప్రతి భారతీయుడికీ ప్రయోజనం కలిగించే ఆర్థిక వ్యవస్థ రూపకల్పన సమస్యను కేంద్ర ప్రభుత్వం పరిష్కరించగలుగుతుందా అనే విషయానికి వస్తే ఈ ఏడాది బడ్జెట్ ప్రభుత్వ చిత్తశుద్ధికి పరీక్షగా మిగిలిపోనుంది.

(ది వైర్ సౌజన్యంతో)

వ్యాసకర్త కేంపెయిన్ లీడ్, ఇనీక్వాలిటీ, ఆక్స్‌ఫామ్ ఇండియా

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

పారితోషికం

"ఓ డిస్ట్రిబ్యూటర్ నాతో మాట్లాడుతూ తమిళ నటులపై మండిపడ్డాడు. హిందీ నటులు సినిమా చేయడానికి అంగీకరిస్తూ సంతకం చేసేప్పుడు చాలా స్వల్ప మొత్తాన్నే అడ్వాన్స్ గా తీసుకుంటారని, వారి పారితోషికం కూడా మొత్తం సినిమా ఖర్చులో 20శాతానికి మించదని చెప్పాడు. ఒకవేళ సినిమా బాగా ఆడితే లాభాల్లో వాటా తీసుకుంటారనీ, అలాగే సినిమా విడుదలకు కొన్ని రోజుల ముందు మాత్రమే తమ పారితోషికం తీసుకుంటారనీ ఆయన చెప్పారు. ఇక్కడి వాళ్లకి మొత్తం పారితోషికం సొమ్మంతా ముందే చెల్లించేయాలని ఆగ్రహం వ్యక్తం చేశాడు"

– సుమంత్ రామన్, యాంకర్

ఫలితాలు

"న్యూజిలాండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో దేశానికి రెండు అద్భుతమైన ఫలితాలు వచ్చాయి. విభిన్నమైన కొత్త ఆటగాళ్లు వెలుగులోకి వచ్చారు. ఇటువంటి ఒత్తిడి కలిగించే సందర్భంలోనే ఆటగాళ్లలోని నైపుణ్యం వెలికి వస్తుంది. రాహుల్, పాండే, సైని, ఠాకూర్ అందరూ బాగా ఆడారు"

– హర్షా భోగ్లే, విశ్లేషకుడు

మంచి బాలుడు

"జామియా దగ్గర నిరసన తెలుపుతున్న వారిపై కాల్పులు జరిపిన వ్యక్తి తమ పాఠశాల విద్యార్థేనని జేవర్ పబ్లిక్ స్కూల్ నిర్ధారించింది. ఎప్పుడూ నిశ్శబ్దంగా ఉండేవాడనీ, ప్రమాదాలకు దూరంగా ఉండేవాడని ప్రిన్సిపాల్ చెప్పారు. అంత మంచి బాలుడు తీవ్రవాదిగా ఎలా మారాడు?"

– ఉదయ్ సింగ్ రాణా, జర్నలిస్ట్

ఉరి

"దోషుల ఉరితీతపై కోర్టు స్టే ఇచ్చిన అనంతరం.. వాళ్లకు మాత్రం హక్కులుంటాయి. కానీ, నిర్భయకు మాత్రం ఉండవు. వాళ్లని ఎప్పటికీ ఉరి తీయడం జరగదని వాళ్ల లాయర్ నాతో అంటున్నాడని నిర్భయ తల్లి ఆశా దేవి కన్నీరుమున్నీరు కావడం చూస్తే నిజంగా గుండె తరుక్కుపోతోంది. ఈ ఉదంతంలో దోషులకి ఉరి అమలు పలుసార్లు వాయిదా పడటం విచారకరం"

– షేఫాలీ వైద్య, రచయిత్రి

నిరసన

"జనవరి 23న జార్ఖండ్‌లోని లోహర్దగాలో సీఏఏకు అనుకూలంగా జరుగుతున్న ర్యాలీపై మైనారిటీ వర్గానికి చెందిన వారు రాళ్లు రువ్వారు. ఆ దాడిలో నీరజ్ రామ్ ప్రజాపతి అనే వ్యక్తి తీవ్రంగా గాయపడి 27న ఆసుపత్రిలో కన్నుమూశాడు. నాలుగు రోజులు గడిచిపోతున్నా అతని కోసం ఎవ్వరూ నోరు విప్పలేదు"

– అన్షుల్ సక్సేనా, జర్నలిస్ట్

మరుపు

"ఇండియా వర్సెస్ పాకిస్తాన్, సర్జికల్ స్ట్రయిక్స్ వర్సెస్ షహీన్ బాగ్, దేశద్రోహులు వర్సెస్ దేశ భక్తులు, కమ్రూ వర్సెస్ గోస్వామి.. వీటన్నిటి సారాంశం ఒకటే... అభివృద్ధి, ఉద్యోగాలు, ఆర్థిక వ్యవస్థ వగైరాలన్నీ మరిచిపొండనే"

– మిటాలీ శరణ్, కాలమిస్ట్

ఇన్‌బాక్స్

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

రహదారులపై రక్తం పారని రోజులు రావాలి. రోడ్డు ప్రమాదాలు తగ్గించేందుకు అన్ని శాఖల అధికారులు కృషిచేయాలి. మన దేశంలో వాహనాల సంఖ్య తక్కువగా ఉన్నా 11% ప్రమాదాలు నమోదు అవుతున్నాయి. ప్రమాదాల నివారణ కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి సంవత్సరం జనవరి 27 నుండి ఫిబ్రవరి 2 వరకు జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాలను ప్రతి మండల, జిల్లా కేంద్రాలలో అట్టహాసంగా నిర్వహించాలి. రహదారి నిబంధనలు రోడ్డు భద్రతపై వాహన చోదకులకు అవగాహన కల్పించాలి. సురక్షితమైన డ్రైవింగ్, మోటార్ వెహికిల్ శాఖ, ఆర్టీసీ, పోలీస్ అధికారులు వాహన చోదకులకు అవగాహన కల్పించాలి. ఆర్టీసీ డ్రైవర్లు, మెకానిక్‌లకు కూడా అవగాహన కల్పించాలి. కొన్నిసార్లు వాహన చోదకులు అత్యంత వేగంతో వెళ్లి ఇతరుల ప్రాణాలను తీస్తున్నారు. అట్టి వారికి కఠిన శిక్షలు పడటం లేదు. ప్రతి ఏడాది వారంపాటు భద్రతా వారోత్సవాల పేరిట తూతూ మంత్రంగా సమావేశాలు పెట్టి కాలయాపన చేస్తున్నారు. ఆర్టీసీలో ప్రతి సంవత్సరం రోడ్డు ప్రమాదాలు జరిగి ఎంతోమంది జీవితాలు గాల్లో కలిసిపోతున్నాయి. ప్రయాణం ప్రమాదకరం కాకుండా ప్రతి ఒక్కరు నిబంధనలను పాటించాలి.

(జనవరి 27 నుండి ఫిబ్రవరి 2 వరకు రోడ్డు భద్రతా వారోత్సవాలు సందర్భంగా)

– రావుల లావణ్యరాజేశం

క్యాపిటల్ పాంకోళ్ల కథ

శ్రీరమణ

అసలు అప్పుడే మనకి నోరుంటే పొట్టి శ్రీరాములు స్వరాష్ట్రం కోసం ఆత్మార్పణం చేసుకోగానే నెల్లూరే మన క్యాపిటల్ అని ఎలుగెత్తి చాటేవారు. శ్రీరంగనాయకస్వామి అండగా నిలబడేవాడు. పెన్నమ్మ జలసంపదలిచ్చి చల్లగా చూసేది. సన్న బియ్యంతో సహా సమస్త నాజూకులతో ముఖ్య పట్టణం విరాజిల్లేది. ప్రపంచ దేశాల స్థాయిలో నెల్లూరులో ఏ కాన్ఫరెన్స్ పెట్టినా ఆహ్వానితులు ఆవురావురుమని విచ్చేసేవారు. ఆ కూరలు, ఆ పిండి వంటలు, ఆ దోసెలు, ఆ అరిటాకు లేలేత పరిమళాలు క్యాపిటల్ పేరు చెప్పగానే పదండి ముందుకు అంటూ నడిపించేవి. కాయగూరలేనా, కందమూలాలేనా పుణ్య పురుషులకు రుచి భోగాలున్న జలచరాలు, భూచరాలు, ఖేచరాలు కోరినదే తడవుగా విస్తళ్లను అలంకరిస్తాయి. ఇంకా చిత్రాతిచిత్రమైన చిత్రన్నాలు, భక్ష్యాలు, భోజ్యాలు, లేహ్యాలు, చోష్యాలు, మధుర మధురతర పానీయాలు విస్తరిని కిటకిటలాడిస్తాయి. ఇది నెల్లూరు తిండిముచ్చట. ఇక రాజకీయాలంటారా, అచట చిగురు కొమ్మైన చేవ. నెల్లూరు బారసాల కూడా లేకుండానే జారిపోయింది. అకళంక దేశభక్తుడు 'వంగ వోలు' క్యాపిటల్ చెయ్యాలిరా అని రంకెపెడితే ఏమి జరిగేదో?! ఆంధ్రకేసరి గర్జించ లేదు. మూడో మాట లేకుండా తెలుగువారు వడ్డించిన విస్తరి ముందు కూర్చుని తిరిగి వెనక్కి చూడలేదు.

మళ్లీ ఇన్నాళ్లికి విస్తళ్లముందు నుంచి కొంగులు దులుపుకుని లేచిపోవలసి వచ్చింది. వడ్డించిన విస్తళ్లు కాదు కదా కూచోడానికి అనువైన చోటైనా దొరకలేదు. ఆరేళ్ల నుంచి కథ నడుస్తోందిగానీ కంచికి చేరడం లేదు. భూములిచ్చిన రైతులు, వారి కష్టనష్టాలు, మీడియా, రాజకీయ, అరాచకీయ ప్రముఖులు అంతా కలిసి సమస్యని కమ్మేశారు. కుమ్మేశారు. చినికి చినికి గాలివాన అయింది. పనులు ముందుకు కదలడం లేదు. మాక్కావలసింది అదేనని తృప్తిగా నిట్టూరిస్తోంది వీళ్లకి సరిపోని అపోజిషన్.

ఇట్లాంటి పెద్ద సమస్యలుగా ప్రజ్వరిల్లేటప్పుడు, సామాన్యుణ్ణి అడిగి చూడాలి. అదే చేశాను. అతని మారుపేరు 'అడ్డ బుర్ర'. వట్టిపోయిన గోమాతతో నూనెగానుగ తిప్పుతూ ఊర్లో బతికేస్తున్నాడు. ఒకప్పుడు బాగా బతికి చెడ్డవాడు. గానుగ కొయ్య తొట్టె మీద కూచుని, ఓ మూల నుంచి వచ్చే రేడియో సర్వస్వం వింటూ, దొరికిన పేపర్లని అక్షరం వదలకుండా నాకేసేవాడు. 'ఇదిగో నువ్ గోవుతో గానుగ తిప్పుతున్నావని మోదీకి ఫొటోతో సహా ఫిర్యాదు చేస్తా'నని బెదిరిస్తే– అడ్డబుర్ర విలాసంగా నవ్వి 'మరి నా గానుగ ఎట్టా తిరగాల? ఎవరైనా వాళ్ళోళ్లకి పురమాయించమను. లేదంటే పనిచేసే ఆవులకు రిటైర్మెంట్ ప్రకటించి నెలవారీ పింఛనైనా మంజూరు చెయ్యమను. పాపం! అవెట్టా బతకాల' అని జాలిపడేవాడు. ఇవ్వాళ హాయిగా బతకాలంటే లోకజ్ఞానం కాదు మీడియా జ్ఞానం ముఖ్యం అనేవాడు గానుగ కిర్రు చప్పుళ్ల మధ్య. 'నువ్వు కాణి ఖర్చులేకుండా అన్ని పేపర్లు చదివేస్తావు గదా, మరి

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
శనివారం ॥ 1-2-2020

బడ్జెట్ 2019-20

ధనరేఖలు

రాజపూజ్యమింత, అవమానమింత అని
పంచాంగం మాత్రమే చెప్పదు.
మన ఇంటి బడ్జెట్ కూడా చెబుతుంది.
మిగులుతున్నది ఎంతో చూసుకోకుండా
ఖర్చు చేసుకుంటూ పోతే.. అవమానం!
మిగుల్చుకున్నాకే ఖర్చులకు పోతే.. రాజపూజ్యం!
రాబడి ఎంతని కాదు..
పోబడి ఎంతుందనే దాన్ని బట్టే మనం
ధనవంతులం.. ఘనవంతులం.
ఈ రోజు కేంద్రం బడ్జెట్ సమర్పిస్తోంది.
ఆ బడ్జెట్ ఎలా ఉన్నా...
మన లెక్కల్ని మనం తప్పకుండా ఉంటే..
ఇంట్లో అక్షయపాత్ర ఉన్నట్లే.
చేతుల నిండా ధనరేఖలు ఉన్నట్లే.

ఇంటి ఖర్చు తగ్గితే రూపాయి విలువ పెరుగుతుంది

చేతిలో డబ్బు ఉంది కదా అని ఒక వస్తువును అవసరం లేకపోయినా కొంటే మన చేతిలో ఉన్న 'రూపాయి' విలువను పరిరక్షించడం మనకు చేతకాలేదని అర్థం.

● అర్పిత కుటుంబం

''ఒక కుటుంబం సంతోషంగా జీవనం సాగించాలంటే... ఖర్చులకు తగినంత రాబడి ఎంత ముఖ్యమో, రాబడిని బట్టి నెల వారీ బడ్జెట్ వేసుకోవడం కూడా అంతే ముఖ్యం'' అంటారు అర్పిత. ''గత ఏడాది మీ బడ్జెట్ ఎలా ఉంది, మీ బడ్జెట్ మీకు నేర్పిన పాఠాలేమిటి?'' అని 'సాక్షి' అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఆమె తన అనుభవాలను పంచుకున్నారు.

''రాబడి – ఖర్చు' ల మధ్య సమన్వయం కోసం కొంత ఎక్సర్‌సైజ్ తప్పదు. 'మనకు వచ్చే డబ్బు– మన అవసరాల జాబితా'ను సరిపోల్చుకోవాలి. నిత్యావసరాలు, పెద్దవాళ్ల ఆరోగ్యం కోసం రెగ్యులర్ హెల్త్ చెకప్‌లు, మందుల కోసం కొంత కేటాయించాలి. పిల్లల చదువు, మిగిలిన అవసరాల కోసం కేటాయింపు తప్పని సరి. భవిష్యత్తు భద్రత కోసం కొంత మొత్తాన్ని పొదుపు చేసి తీరాలి. ఇక మిగిలిన డబ్బులో నుంచి సినిమాలు, వెకేషన్‌లు, ఇంట్లో ఖరీదైన ఫర్నిచర్, వాహనాల వంటివి వచ్చి చేరుతుంటాయి. నిత్యావసరాల ధరలు ఒక్కసారిగా ఆకాశాన్నంటినప్పుడు ఆ మేరకు ఖర్చు తగ్గించుకోవడానికి మధ్య తరగతి కుటుంబాల్లో సినిమానో, వెకేషన్‌నో మానుకోవాల్సి వస్తుంటుంది. ఆరోగ్య సమస్యల కారణంగా ఊహించని ఖర్చు వచ్చినప్పుడు కూడా కొన్ని సరదాలకు చెక్ పెట్టుకోవాల్సి రావచ్చు.

ఆర్థిక నిపుణులు ఆడవాళ్లే

నిజానికి ఇంటి బడ్జెట్ విషయంలో ఆడవాళ్లను మించిన ఆర్థిక నిపుణులు మరొకరు ఉండరు. వంద రూపాయలు చేతిలో పట్టుకుని వెళ్లి సంచి నిండా కూరగాయలు తీసుకురాగలిగిన నేర్పు మగవాళ్ల కంటే ఆడవాళ్లలోనే ఎక్కువ. ధరల పట్టిక చూసిన తర్వాత ఒక్క నిమిషంలో 'ఏ కూరగాయలను మితంగా తీసుకోవాలి, ఏ కూరగాయలను ఎక్కువగా తీసుకోవాలి' అనే నిర్ణయానికి వచ్చేస్తారు.

– కె. అర్పిత, హైదరాబాద్

ఏది అవసరం?

అవసరాలను అదుపులో పెట్టలేం కానీ, సరదాలను అదుపులో పెట్టుకోవచ్చు. టీవీ ఉండాలనుకోవడం అత్యాశ కాదు. మరెవరింట్లోనో ఉన్నట్లు లక్షల విలువ చేసే టీవీ కొనాలనుకోవడమే పొరపాటు. రోజువారీ రాకపోకల కోసం వాహనం ఉండి తీరాల్సిందే, కానీ కొత్త మోడల్ వచ్చిన వెంటనే బైక్‌లు, కారులు మారుస్తూ పోతే.. ఇక ఆ దుబారాకు అంతూదరీ ఉండదు. ఇప్పుడు తరచు స్మార్ట్ ఫోన్‌లను మార్చడం ఫ్యాషనైంది. మా ఇంట్లో ఇంటికి అవసరమైన ఫర్నిచర్, గృహోపకరణాలన్నీ ఉన్నాయి. అయితే కొత్త మోడల్ కోసం ఉన్న వాటిని మార్చడం ఇంత వరకు జరగలేదు.

ఇంటి ఇండెక్స్

మనం ఖర్చు పెట్టే ప్రతి రూపాయికీ ఒక విలువ ఉంటుంది. అది మార్కెట్ నిర్ణయించిన విలువ కాదు, మనం ఖర్చు పెట్టే తీరును బట్టి ఆ రూపాయి విలువ పెరుగుతుంది. 'ఫేస్ ఈజ్ ఇండెక్స్ ఆఫ్ మైండ్' అనేది ఎంత నిజమో, ఒక ఇంటిని చూస్తే ఆ ఇంటి వాళ్లు బడ్జెట్ విషయంలో తెలివిగా ఉన్నారా, డబ్బు దుబారా చేస్తున్నారా అనేది ఇట్టే తెలిసిపోతుంది'' అన్నారు అర్పిత.

– వాకా మంజులారెడ్డి

జాగ్రత్తగా ఉండడమే మా ప్లాన్

పేరెంట్స్ హెల్త్, వాళ్ల అవసరాలు, మా అబ్బాయి చదువు. ఇంటి ఖర్చులు అన్ని దృష్టిలో పెట్టుకునే ప్లాన్ చేసుకుంటాం. డబ్బు విలువ తెలిసివాళ్లెవరూ అనవసరమైన ఖర్చులు చెయ్యరు.

● వెంకట రమణ కుటుంబం

జాగ్రత్తగా ఉండడమే మా ప్లాన్ అంటాడు వెంకటరమణ మోదుపల్లి. అనంతపురానికి చెందిన అతను బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. భార్య స్వాతి. ఎమ్‌టెక్ చేసింది కాని గృహిణిగానే ఉంటోంది. వాళ్లకు ఒక బాబు జయంత్. నర్సరీ చదువుతున్నాడు.

వెంకటరమణ ఒక్కడే కొడుకు కావడం వల్ల తల్లిదండ్రులకూ అతనే ఆధారం.

'అందుకే ఖర్చుల విషయంలో ఆచి తూచే ఉంటాం. పేరెంట్స్ హెల్త్, వాళ్ల అవసరాలు, మా అబ్బాయి చదువు. ఇంటి ఖర్చులు అన్ని దృష్టిలో పెట్టుకునే ప్లాన్ చేసుకుంటాం నేను, మా వైఫ్. ఇంటి పనంతా తనే చూసుకుంటుంది. మాకు హెల్త్ కాన్సస్ కాస్త ఎక్కువే. కాబట్టి బయట లంచ్, డిన్నర్లకు వెళ్లడం తక్కువే. ఏదైనా ఇంట్లోనే. ఎలక్ట్రానిక్ గూడ్స్, గాడ్జెట్స్ మీద కూడా అంతగా ఖర్చు పెట్టం. స్మార్ట్ ఫోన్స్‌కూడా హై ఎండ్‌వి వాడం. షాపింగ్ వగైరా కూడా పండగలు, పుట్టినరోజులకే. ఇల్లు రెంట్, గ్రాసరీస్, పిల్లాడి స్కూల్ ఫీ, ఇతర ఖర్చులు పోను అమ్మా నాన్న హెల్త్ కోసం కొంత, అనవసరమైన ఖర్చులు ఏమైనా వస్తే కొంత అని పక్కన పెట్టుకుంటాం. ఇది కాక ప్రతినెల పదివేలు సేవింగ్ చేస్తాం. డబ్బు విలువ తెలిసిన వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చాను కాబట్టి.. అత్యంత అవసరమైతే తప్ప ఖర్చు చేయను' అని తన ఫ్యామిలీ బడ్జెట్ గురించి చెప్పుకొచ్చాడు వెంకట రమణ.

లోటుంటే తగ్గిస్తాం.. మిగులు అయితే ఖర్చు చేస్తాం..

'మా పెళ్లయి ఇంకా ఏడాది కాలేదు. కాబట్టి ఖర్చులు, సేవింగ్స్‌కు సంబంధించి మాకు సీరియస్ ప్లాన్స్ అంటూ ఏమీ లేవు.. ఈ వన్ ఇయర్.. ఫుల్ టూ ఫన్ అండ్ బిందాస్ అనే అనుకుంటున్నాం' అంటారు బి. ప్రవీణ్ కుమార్, సామిత దంపతులు. వీళ్ల స్వస్థలం వైఎస్సార్ కడపజిల్లా, జమ్మల మడుగు. ఉద్యోగరీత్యా హైదరాబాద్‌లో ఉంటున్నారు. ప్రవీణ్ కుమార్ స్పైస్‌జెట్‌లో కెప్టెన్. గణిత శాస్త్రంలో మాస్టర్స్ చదివిన సామిత బిజినెస్ చేయాలనే ఆలోచనతో ఉంది. ప్రస్తుతమైతే గృహిణిగా ఇంటిని నిర్వహిస్తోంది.

● సామిత, ప్రవీణ్

'ఇంటి ఖర్చులు తనే చూసుకుంటుంది. నా శాలరీ నుంచి నెలకు ఇంత అని సామితకు ఇచ్చేస్తాను. మిగతా అంతా నా దగ్గరే పెట్టుకుంటా. పర్సనల్ లోన్, కారు లోన్‌కు సంబంధించి రెండు ఈఎమ్‌ఐలు కడ్తాను. పెళ్లికి ముందు మా పేరెంట్స్‌కి డబ్బు పంపేవాడిని కాని ఇప్పుడు కుదరట్లేదు. నెలకు ఇరవై నుంచి ముప్పై శాతం సేవింగ్స్ ఉంటాయి. మిగతా అంతా ఖర్చులే. ఇన్సూరెన్స్ చేశాం ఇద్దరం విడివిడిగా' అంటాడు ప్రణీత్ కుమార్.

ఖర్చులు అంటే?

'ఉండేది ఇద్దరమే అయినా త్రీ బెడ్‌రూమ్ ఫ్లాట్ తీసుకున్నాం. ఇన్‌లాస్, చుట్టాలు వస్తే ఇబ్బంది పడకుండా. ఇల్లు ఊడ్వడానికి, తుడవడానికి పనమ్మాయి. ఇంట్లో సరుకులు అంటే బియ్యం, కారప్పొడి, చింతపండు, పసుపు లాంటివన్నీ ఊరినుంచే వస్తాయి. కాబట్టి వెచ్చాలకు అంతగా ఖర్చు ఉండదు. వారానికి రెండుసార్లు రెస్టారెంట్స్‌కి వెళ్తాం. నెలకు ఒకటి రెండుస్లారు పార్టీలూ ఉంటాయి. ఒక సారి ఫ్రెండ్స్ ఇస్తే ఇంకోసారి మేమిస్తాం' అని ప్రణీత్ భార్య సామిత చెప్తూంటే మధ్యలో ప్రణీత్ అందుకొని 'వారానికి రెండు మూడు సినిమాలూ ఉంటాయి కచ్చితంగా. రిలీజ్ అయిన సినిమా చూడాలి కదా' అన్నాడు. 'ఇవికాక షాపింగ్ ఖర్చులు అదనం' కంటిన్యూ చేశాడు. 'షాపింగ్ తను ఖర్చు చేసేదే ఎక్కువ బ్రాండెడ్ బట్టల మీద. నెలకు ఒక్కసారైనా బట్టలు కొంటారు. నాది బట్టల ఖర్చు తక్కువనే చెప్పొచ్చు. ఎప్పుడైనా ఆన్‌లైన్‌లో కాస్మెటిక్స్, ఆర్ట్‌ఫిషియల్ జ్యుయెలరీ కొంటా అంతే' చెప్పింది సామిత.

గాడ్జెట్స్ వగైరా...

'లేదు. ఒక్కసారి కొంటే అంతే. వాటి అంత మోజు లేదు. కాని టూర్స్ మీద ఖర్చు చేస్తాం. నిజానికి పెళ్లయ్యాక ఒక వన్ ఇయర్ వరకు సేవింగ్స్ జోలికి వెళ్లకుండా లైఫ్ ఎంజాయ్ చేద్దామనుకున్నాం. అలాగే చేస్తున్నాం కూడా. అందుకే మూడు నెలలకు ఒకసారి దేశంలో నచ్చిన ప్లేసెస్‌కి వెళ్లాలని.. ఆర్నెల్లకు ఒకసారి ఇంటర్నేషనల్ ట్రిప్ ప్లాన్ చేసుకోవాలని అనుకున్నాం. అలాగే వెళ్తున్నాం. మొన్ననే మాల్దీవులకు వెళ్లొచ్చాం. నెక్స్ట్ ఇయర్ ప్రమోషన్ ఉంది. అప్పుడు ఇల్లు, పిల్లలు ప్లాన్ చేసుకోవాలనుకుంటున్నాం' అంటూ తన ప్రెజెంట్ బడ్జెట్, ఫ్యూచర్ ప్లాన్ చెప్పాడు ప్రణీత్.

నెలాఖరుకి లోటు తేలుతుందా.. మిగులు కనపడుతుందా?

'ఒక్కో నెల ఒక్కో రకంగా ఉంటుంది. లోటు తేలగానే వచ్చే నెల ఖర్చులను కొంచెం తగ్గిస్తాం. మిగులు కనపడితే.. కొత్త ఖర్చుని ప్లాన్ చేసుకుంటాం' అంటారు నవ్వుతూ ప్రణీత్ అండ్ సామిత.

ఆర్భాటాలకు పోము

పులిని చూసి నక్క వాత పెట్టుకుందేమో కాని, మేం ఆ పని చేయట్లేదు. అసలు ఇరుగుపొరుగులను పట్టించుకునే తీరికే ఉండదు. ఉరుకుల పరుగుల జీవితం.

● పిల్లలతో శివాజి, శ్రీహర్ష దంపతులు

మహాభారతంలో అరణ్యవాసంలో ఉన్న ద్రౌపది దగ్గరకు సత్యభామ వచ్చిన సందర్భంలో, 'ఇంట్లో ఆదాయ ఖర్చుల వ్యవహారాలు ఇల్లాలు జాగ్రత్తగా చూసుకుంటే, ఆ ఇంట్లో ఆర్థిక ఇబ్బందులు ఉండవు' అని బోధిస్తుంది. జంపని శివాజీ హర్షశ్రీ దంపతుల జీవితం ఇందుకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు. వీరిది ప్రేమ వివాహం. మేమిద్దరం మాకిద్దరు అన్నట్లుగా వీరికి ఇద్దరు ఆడపిల్లలు, భవిష్య (తండ్రి చేతిలో) జైస్వి (తల్లి చేతిలో). పెద్ద పాప భవిష్య ఎల్. కెజి చదువుతోంది, చిన్న పాప జైస్వి నర్సరీ చదువుతోంది.

విజయవాడలోని ఒక ప్రముఖ ఆసుపత్రిలో ఇంటర్నల్ ఆడిటింగ్ విభాగంలో పనిచేస్తున్న శివాజీ బి.ఎస్.సి చదువుకున్నారు. హర్షశ్రీ ఇంటర్మీడియట్ (బై.పి.సి) తరవాత జనరల్ నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీ చదువుకున్నారు. తన బడ్జెట్ బ్యాలెన్స్ షీట్ గురించి శివాజీ చెబుతూ, ''నేను పని చేస్తున్న ఆఫీసులోనే, నా భార్య స్టాఫ్ నర్సుగా పనిచేస్తోంది. ఇద్దరి ఆఫీసు టైమింగ్స్ వేరువేరు. నేను నా బైక్ మీద, మా ఆవిడ బస్సులోను ఆఫీసుకి వెళ్తాం. అవసరం మేరకు ఖర్చు చేసి, పిల్లల కోసం కొద్దిగా పొదుపు చేస్తున్నాం. కనీసం వెయ్యి లేదా రెండు వేలు దాచాలని నియమం పెట్టుకున్నాం. శక్తికి మించి ఖర్చు చేయటం ఇద్దరికీ ఇష్టం లేదు. సాధ్యమైనంత వరకు ఇంటి వంటే ఇష్టపడతాం. ఎప్పుడైనా ఇద్దరం ఉదయాన్నే వెళ్లవలసి వస్తే, ఆఫీసు క్యాంటీన్‌లో పొదుపుగా ఖర్చు చేస్తాం. పులిని చూసి నక్క వాత పెట్టుకుందేమో కాని, మేం ఆ పని చేయట్లేదు. అసలు ఇరుగుపొరుగులను పట్టించుకునే తీరికే ఉండదు. ఉరుకుల పరుగుల జీవితం. ఆదివారం పిల్లలతో ఖర్చు చేయనక్కర లేని పార్కులకి వెళ్లటంతోనే రోజులు గడిచిపోతుంటాయి'' అంటారు.

''జీతం రాగానే లెక్కలు వేస్తామని చెప్పను కానీ, వేటివేటికి ఎంత వాడాలన్న విషయం మీద ఒక క్లారిటీ ఉంది. ఇంటి సరుకులు, అద్దె, కూరలు, పిల్లల ఫీజు... అన్ని ఖర్చులు కాగితం మీద రాస్తాను. ఈ నెలకి ఇంత ఖర్చు చేయాలి, తప్పనిసరిగా పొదుపు చేయాలి... అని నియమం పెట్టుకుంటాం. మా వారి నెల జీతం 22 వేల రూపాయలు, నా జీతం 13 వేల రూపాయలు. ఇందులోనే ఖర్చులు, పొదుపులు సాగాలి. ఇంటి అద్దె కోసం ఏడు వేలు, ఇద్దరి దారి ఖర్చుల కోసం మూడు వేలు, సరుకుల కోసం నాలుగు వేలు, పిల్లల జీతాల కోసం మూడు వేలు తప్పని సరిగా పక్కన ఉంచాల్సిందే. అలాగే మా ఇంటి పక్కనే ఉంటున్న మా నాయనమ్మ తాతయ్యలకు మందుల కోసం తప్పనిసరిగా కొంత డబ్బు ఇస్తుంటాను. వాళ్లకు వచ్చే పెన్షన్ వారి పొట్ట నింపుకోవటానికి సరిపోతుంది'' అంటారు

> "ఇంటి అద్దె కోసం ఏడు వేలు, ఇద్దరి దారి ఖర్చుల కోసం మూడు వేలు, సరుకుల కోసం నాలుగు వేలు, పిల్లల జీతాల కోసం మూడు వేలు తప్పనిసరిగా పక్కన ఉంచాల్సిందే. ఉల్లిపాయల రేటు పెరిగినప్పుడు, వాటిని మాడటం మానేశాం. నిత్యావసర సరుకులు పెరగటంతో ఒక రకమే వండుకోవటం ద్వారా ఎకౌంట్ బ్యాలెన్స్ చేసుకున్నాం".

భవిష్య.

పండుగలు, పుట్టినరోజు వంటివి చాలా సింపుల్‌గా జరుపుకుంటారు. అందునా పెద్ద పండుగలకు మాత్రమే పిండి వంటలు, కొత్త బట్టలు. మిగిలిన పండుగలకు భగవంతుని ధ్యానిస్తారు. అంతే. పిల్లలకు బట్టలు కొనటంలో మాత్రం లోటు చేయరు. చిన్న చిన్న శుభకార్యాలకు అందరినీ పిలిచి ఆర్భాటం చేయరు. దగ్గర బంధువులతో ఆనందంగా గడిపేస్తారు. పెరిగిన ధరలతో ఇబ్బందులు పడుతున్నా, జాగ్రత్తగా పొదుపుగా ఉండటం అలవాటు చేసుకున్నారు. ఉల్లిపాయల రేటు పెరిగినప్పుడు, వాటిని మాడటం మానేశారు. నిత్యావసర సరుకులు పెరగటం వల్ల, రెండుమూడు రకాల బదులు ఒక రకమే వండుకోవటం ద్వారా ఎకౌంట్ బ్యాలెన్స్ చేస్తున్నారు.

''మా ఆవిడ సహకరించకపోతే నేను ఇంత జాగ్రత్తగా కుటుంబాన్ని నడపలేను. ఇంటిని మరింత జాగ్రత్తగా నడపటం కోసం ఇంటి బాధ్యత అంతా మా ఆవిడే చూస్తోంది. ఐదేళ్ల క్రితం మా వివాహం అయ్యింది. ఎప్పుడైనా నేను ఏదైనా కొందామంటే కూడా, అనవసరంగా ఖర్చు ఎందుకు అని తను నన్ను అదుపు చేస్తుంది. ప్రస్తుతానికి ఉన్నదానిలో అరమరికలు లేకుండా, సంతృప్తిగా, ఆనందంగా గడుపుతున్నాం' అంటున్నారు శివాజీ.

– వైజయంతి పురాణపండ

సినిమాలూ తగ్గించాం

"బయటి నుంచి తెప్పించుకునే ఆహారపదార్థాలు, సినిమాలకు కూడా కొంత పరిమితి పెట్టుకున్నాం. అందువల్లే పెరిగిన ఖర్చులను తట్టుకోగలుగుతున్నాం.

● శ్రీనివాస్‌రెడ్డి, సుమతి దంపతులు

పిల్లల చదువుకోసం వికారాబాద్ నుంచి వచ్చి హైదరాబాద్‌లో ఉంటున్న శ్రీనివాస్‌రెడ్డి, సుమతి దంపతులను తమ బడ్జెట్ ప్లానింగ్ గురించి అడిగితే ''ఖర్చులు తగ్గించుకోవడమే ప్రధానంగా పెట్టుకున్నాం. పొదుపు విషయంలో కచ్చితంగా ఉన్నాం'' అని చెప్పారు.

''మా అమ్మాయి ఇంజనీరింగ్ ఫస్టియర్, అబ్బాయి ఇంటర్మీడియెట్ ఫస్టియర్ చదువుతున్నారు. మూణ్ణెల్ల క్రితం వరకు పిల్లలను హాస్టల్‌లో పెట్టి చదివించేవాళ్లం. తర్వాత హైదరాబాద్ వచ్చి ఇల్లు అద్దెకు తీసుకున్నాం. మాది వ్యవసాయ కుటుంబం. వరి, పత్తి, మొక్కజొన్న పండిస్తాం. ఊళ్లో ఉన్నప్పుడు నెలసరి ఇంటి ఖర్చు ఐదారువేలతో సరిపోయేది. ఇప్పుడు హైదరాబాద్‌లో ఇరవై వేలకు పైనే అవుతోంది. పంట వల్ల వచ్చే ఆదాయం సరిపోదని బోర్‌వెల్ వ్యాపారం చేస్తున్నాను. అంటే, ఖర్చు పెరుగుతోందని అర్థమయ్యాక ఇతరత్రా రాబడి మార్గాలు చూసుకోవాల్సిన ఆవశ్యకతపైనా దృష్టి పెట్టాలి'' అన్నారు శ్రీనివాసరెడ్డి.

ఇన్సూరెన్స్ తప్పనిసరి

''పిల్లల చదువులు, ఇతర ఖర్చులు ఉన్నప్పటికీ సంవత్సరానికి ఇంత అని కొంత మొత్తాన్ని పొదుపు చేస్తాను. ఏ కారణంగానైనా పిల్లల చదువులు మధ్యలో ఆగిపోతే వాళ్ల భవిష్యత్తు దెబ్బతింటుంది. అందుకని ఇన్సూరెన్స్ పాలసీలు తీసుకున్నాను. వాటిల్లో మెడికల్ ఇన్సూరెన్స్ కూడా ఉంది. పోస్టల్ శాఖలోనూ చిన్నమొత్తమైనా నెలకు కొంత అని రికరింగ్ డిపాజిట్ చేస్తుంటాను'' అన్నారు ఆయన.

''పిల్లలు స్థిరపడేంతవరకు లగ్జరీ వస్తువులేవీ కొనడానికి వీల్లేదని ముందే నియమం పెట్టుకున్నాం..'' అంటూ గృహిణిగా తన బాధ్యతను వివరించింది సుమతి. ''బయటి నుంచి తెప్పించుకునే ఆహారపదార్థాలు, సినిమాలకు కూడా కొంత పరిమితి పెట్టుకున్నాం. అందువల్లే పెరిగిన ఖర్చులను తట్టుకోగలుగుతున్నాం.

కుటుంబం ఒడిదొడుకులకు లోనుకాకుండా ఉండాలంటే ఇంటి యజమానే కాదు ఆ ఇంట్లో అందరి సహకారం అవసరం. అందరూ ఒక్క మాట మీద ఉంటే మన రాబడి ఎంత, ఖర్చు ఎంత, మిగులు ఎంత అనే విషయాల్లోనూ ఒక అవగాహన వస్తుంది. అది ఈ రోజుల్లో చాలా అవసరం కూడా. పెరుగుతున్న పిల్లలకు ఈ విషయాలు తెలియజేస్తే భవిష్యత్తు పట్ల వారికీ ఒక అవగాహన ఉంటుంది. బాధ్యతగా నడుచుకుంటారు' అని వివరించారు శ్రీనివాస్‌రెడ్డి, సుమతి దంపతులు.

– నిర్మలారెడ్డి

epaper.sakshi.com

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
శనివారం ॥ 1-2-2020

రథ రుచులు

రేపు రథ సప్తమి. సూర్యుడి పుట్టినరోజు. రోజూ మనకింత జీవకాంతిని ఇచ్చే దేవుడు ఆదినారాయణుడు. సమస్త ప్రకృతికి అతడే వేల్పు. అతని అశ్వాలు దౌడు తీస్తేనే మనకు ఆహారం అందుతుంది. జీవితం కదలాడుతుంది. అందుకే ఆయన పుట్టినరోజు వేడుకను ఆయనకిష్టమైన పదార్థాలతో జరుపుకోవాలి. అవి ఇక్కడ ఇచ్చాం. చేసి ఒక దండం పెట్టుకుని ఆరగించండి.

పాయసం

ధనుర్మాసంలో ఆవు పేడతో తయారుచేసిన గొబ్బెమ్మలను పిడకలుగా తట్టి, రథసప్తమి కోసం దాస్తారు. ఈ రోజు, ఆ పిడకలను తులసి మాత దగ్గర దాలిగా చేసి, ఎర్ర చందనం పూసిన పాత్రలో ఆవుపాలు, బియ్యం, బెల్లం మిశ్రమంతో పరమాన్నం తయారు చేస్తారు. ఈ ప్రసాదాన్ని చిక్కుడు ఆకులో ఉంచి సూర్యునికి నివేదన చేస్తారు.

కావలసినవి: కొత్త బియ్యం – ఒక కప్పు; ఆవు పాలు – 4 కప్పులు; గట్టి బెల్లం పొడి – ఒక కప్పు; ఆవు పేడతో చేసిన పిడకలు – వంటకు తగినన్ని; ఎర్ర చందనం రాసిన గిన్నె – పాయసం వండటానికి.

తయారీ: ● కుంపటిలో పిడకలు ఉంచి, మంట రాజేసి, ఎర్ర చందనం రాసిన గిన్నెను కుంపటి మీద ఉంచాలి ● ఆవు పాలు పోసి, పాలు పొంగే వరకు మరిగించాలి ● కొత్త బియ్యం జత చేసి మెత్తగా ఉడికించాలి ● గట్టి బెల్లం పొడి జత చేసి బాగా కరిగి, అన్నంలో కలిసేవరకు ఉడికించి దింపేయాలి ● చిక్కుడు కాయలతో చేసిన రథానికి మధ్యలో, చిక్కుడు ఆకులతో చేసిన విస్తరిలో పరమాన్నం ఉంచి, సూర్యుడికి నివేదన చేసి, ప్రసాదంగా స్వీకరించాలి.

చిక్కుడు కాయ కూర

కావలసినవి: చిక్కుడు కాయలు – పావు కేజీ; అల్లం తురుము – ఒక టీ స్పూను; పచ్చి మిర్చి ముద్ద – ఒక టీ స్పూను; ఆవు నెయ్యి – 2 టీ స్పూన్లు; ఆవాలు – ఒక టీ స్పూను; జీలకర్ర – ఒక టీ స్పూను; పచ్చి సెనగ పప్పు – ఒక టీ స్పూను; మినప్పప్పు – ఒక టీ స్పూను; ఉప్పు – తగినంత; పసుపు – కొద్దిగా; ఇంగువ – కొద్దిగా

తయారీ: ● చిక్కుడు కాయలను శుభ్రంగా కడిగి, ఈనెలు తీసి, చేతితో ముక్కలు చేయాలి (చాకు ఉపయోగించకూడదు) ● ఒక గిన్నెలో తగినన్ని నీళ్లు పోసి, అందులో చిక్కుడు కాయ ముక్కలు వేసి, స్టౌ మీద ఉంచి ఉడికించాక, నీరు ఒంపేయాలి ● స్టౌ మీద బాణలిలో ఆవు నెయ్యి వేసి కరిగాక, ఆవాలు, జీలకర్ర, పచ్చిసెనగ పప్పు, మినప్పప్పు, పసుపు, ఇంగువ వేసి దోరగా వేయించాలి ● ఉడికించిన చిక్కుడు కాయ ముక్కలు, ఉప్పు వేసి బాగా కలపాలి ● అల్లం తురుము, పచ్చి మిర్చి ముద్ద జత చేసి మరో మారు కలిపి, కొద్దిసేపు ఉడికించి, దింపేయాలి.

రేగు పళ్ల హల్వా

కావలసినవి: రేగు పండ్లు – పావు కేజీ; ఎండు మిర్చి – 10; జీలకర్ర – ఒక టేబుల్ స్పూను; సోంపు – ఒక టీ స్పూను; ధనియాలు – ఒక టేబుల్ స్పూను; బెల్లం పొడి – ఒక కప్పు; ఉప్పు – తగినంత.

తయారీ: ● స్టౌ మీద బాణలిలో నీళ్లు పోసి మరిగించి దింపేయాలి ● కడిగి ఉంచుకున్న రేగు పళ్లను మరిగించిన నీళ్లలో వేసి బాగా కలిపి పక్కన ఉంచాలి ● స్టౌ మీద బాణలి వేడయ్యాక ఎండు మిర్చి వేసి (నూనె లేకుండా) వేయించి తీసేయాలి ● అదే బాణలిలో కొద్దిగా జీలకర్ర వేసి వేయించి తీసి పక్కన ఉంచాలి ● సోంపు వేసి వేయించి తీసి పక్కన ఉంచాలి ● ధనియాలు వేసి వేయించి పక్కన ఉంచాలి ● అన్నీ చల్లారాక, ఒక్కొక్కటి మిక్సీలో వేసి, పొడి చేసి పక్కన ఉంచాలి ● రేగు పళ్లను వేడి నీళ్లలో నుంచి వేరు చేస్తూ గింజలు తీసేయాలి ● స్టౌ మీద బాణలిలో కొద్దిగా నీళ్లు పోసి మరిగించి, బెల్లం పొడి వేసి కరిగించాలి ● బాగా పొంగులు వస్తుండగా, రేగు పండ్లు, ఉప్పు వేసి కలియబెట్టి, బాగా ఉడికించాలి ● మిశ్రమం బాగా చిక్కబడేవరకు కలుపుతుండాలి ● దంచి ఉంచుకున్న మిరప కారం, సోంపు పొడి, ధనియాల పొడి ఒకదాని తరవాత ఒకటి వేస్తూ కలియబెట్టాలి ● మెత్తగా అయ్యేలా గరిటెతో మెదిపి, ఒక గిన్నెలోకి తీసుకోవాలి ● వేడివేడిగా స్నాక్‌లా తింటే రుచిగా ఉంటుంది.

రేగు పండ్ల పచ్చడి

కావలసినవి: రేగు పండ్లు – ఒక కప్పు (దోరగా ఉన్నవి); ఉప్పు – తగినంత; మినప్పప్పు – ఒక టీ స్పూను; ఎండు మిర్చి – 4; జీలకర్ర – ఒక టీ స్పూను; పచ్చి మిర్చి 3; వెల్లుల్లి – రెండు రెబ్బలు; కరివేపాకు – రెండు రెమ్మలు; చింతపండు – కొద్దిగా

పోపు కోసం: ఎండు మిర్చి – 3; ఆవాలు – ఒక టీ స్పూను; జీలకర్ర – ఒక టీ స్పూను; మినప్పప్పు – ఒక టీ స్పూను; పచ్చి సెనగ పప్పు – ఒక టీ స్పూను; ఇంగువ – పావు టీ స్పూను; పసుపు – తగినంత.

తయారీ: ● రేగు పండ్ల నుంచి గింజలు వేరు చేయాలి ● స్టౌ మీద బాణలిలో మినప్పప్పు, జీలకర్ర, పచ్చి మిర్చి, ఎండు మిర్చి వేసి దోరగా వేయించి, ఒక పాత్రలోకి తీసుకోవాలి ● అదే బాణలిలో కొద్దిగా నూనె వేసి రేగి పండ్లను (నూనె లేకుండా) దోరగా వేయించి, పాత్రలోకి తీసుకోవాలి ● వేయించి ఉంచుకున్న ఈ పదార్థాలను మిక్సీ జార్‌లోకి తీసుకోవాలి ● కొద్దిగా చింత పండు, వెల్లుల్లి రెబ్బలు, తగినంత ఉప్పు జత చేసి, కచ్చా పచ్చాగా మిక్సీ పట్టాలి ● స్టౌ మీద బాణలిలో నూనె కాగాక ఎండు మిర్చి, పోపు దినుసులు వేసి దోరగా వేయించాలి ● పసుపు, ఇంగువ, కరివేపాకు జత చేసి వేయించాక, సిద్ధంగా ఉన్న పచ్చడిని ఇందులో వేసి బాగా కలియబెట్టి, ఒక పాత్రలోకి తీసుకోవాలి ● అన్నం, దోసెలు, ఇడ్లీలు, దిబ్బరొట్టెలలోకి రుచిగా ఉంటుంది.

నిర్వహణ
డా. వైజయంతి పురాణపండ

రేగు వడియాలు

కావలసినవి: రేగు పండ్లు – ఒక కేజీ (గింజలు తీసేయాలి); బెల్లం– పావు కేజీ; పచ్చి మిర్చి – 100 గ్రా.; జీలకర్ర – ఒక టేబుల్ స్పూను; ఉప్పు – తగినంత.

తయారీ: ● జీలకర్రను మిక్సీలో వేసి మెత్తగా పొడి చేయాలి ● పచ్చి మిర్చి జత చేసి, బాగా మెత్తగా అయ్యాక రేగి పళ్ల జత చేసి మరోమారు మిక్సీ పట్టాలి (మరీ గుజ్జులా అవ్వకూడదు) ● బెల్లం పొడి జత చేసి మరో మారు మిక్సీ పట్టి, గిన్నెలోకి తీసుకోవాలి ● ప్లాస్టిక్ కాగితం మీద వడియాలు మాదిరిగా పల్చగా పెట్టుకోవాలి (ఇష్టమైన వారు కొద్దిగా చింతపండు జత చేసుకోవచ్చు) ఒక రోజు బాగా ఎండిన తరవాత తీసేసి డబ్బాలో నిల్వ చేసుకోవాలి (వారం రోజుల కంటె నిల్వ ఉండవు)

ఆచారం

దక్షిణ దిశగా ఉన్న తన ప్రయాణాన్ని ఉత్తరాయణం రాగానే ఉత్తరాభిముఖంగా మార్చుకుంటాడు సూర్యుడు. ఆ రథం మారే రోజును రథ సప్తమి అంటారు. అలా మారే సప్తమి తిథిని సప్తమి మాతగా పిలవటం ప్రసిద్ధి. ఏడు రంగుల సమ్మేళనం కాంతి కిరణం అని తెలిసిందే. అంటే ఏడు రంగులు ఒకే ఒక్క రంగుగా మారతాయని అర్థం. ఈ రోజు చేసే స్నానం కొంచెం విలక్షణంగా, ప్రత్యేకంగా ఉంటుంది. ఏడు జిల్లేడు ఆకులను శిరస్సు, భుజాలు మొదలుగా శరీరంలోని ఏడు భాగాలమీద ధరిస్తారు. వాటి మీద రేగు పళ్లు ఉంచి స్నానం చేయడం, సూర్య నమస్కారం చేయడం చూస్తాం. సూర్యుడు నమస్కార ప్రియుడు. అందుకే సూర్య నమస్కారాలు చేయటం ద్వారా పరిపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని యోగశాస్త్రం చెబుతోంది.

సూర్య స్నానం

అర్క పత్రం - బదరీఫలం

జిల్లేడులో.. సూర్యుని నుండి శక్తిని నేరుగా గ్రహించే లక్షణం ఉంది. అతి భయంకరమైన వ్యాధుల నుండి తప్పించుకోవడానికి జిల్లేడు ఉపయోగపడుతుంది. 'ఎన్నటికీ తగ్గదు' అనుకునే కుష్ఠ వ్యాధి కూడా జిల్లేడు వల్ల తగ్గుతుందని ఆయుర్వేదం చెబుతోంది. సూర్యభగవానుడిని ఎర్రని పూలతో పూజిస్తారు. ఎర్ర చందనం, ఎర్రని వస్త్రాలు అలంకరిస్తారు. ఎర్రని అక్షతలతో పూజిస్తారు. రథ సప్తమి నాడు స్త్రీలు కూడా అర్ఘ్యం ఇచ్చి, పరమాన్నం నివేదన చేయాలని శాస్త్రం చెబుతోంది.

తరగని కూరలు తినాలి

దక్షయజ్ఞం సమయంలో వీరభద్రుడి విజృంభణ మూలంగా సూర్యుడికి పళ్లు ఊడిపోయాయట. మెత్తటి పదార్థం పెడితే గుటుకు గుటుకుమని తినగలుగుతాడనే ఉద్దేశంతో, మెత్తగా ఉండే పదార్థాలను వండుతారు. అందుకే రథ సప్తమి నాడు తరగని కూరలను మాత్రమే తినాలంటారు. కాయలను తరగకుండా ఎలా వండుతాం అనుకోవచ్చు. చిక్కుడు కాయ వంటి వాటిని చాకుతో కాకుండా, చేత్తో ముక్కలు చేస్తారని తెలుసు కదా. అందుకే ఈ రోజు ఎక్కువ మంది చిక్కుడు కాయ కూరను తప్పనిసరిగా వండుతారు. వాటితోనే సూర్యుడికి రథం కూడా తయారు చేస్తారు. అలాగే కవ్వంతో చిలికిన పెరుగును కూడా తినకూడదని చెబుతారు. గడ్డ పెరుగు తినలేమనుకున్నవారు, అన్నంలో పెరుగు వేసుకుని, నీళ్ల జత చేసి తినవచ్చు. ఇలా తినటాన్ని కొందరు వ్రతంగా కూడా ఆచరిస్తారు.

ఆయుర్వేదం

రేగు పండ్ల విశిష్టత

ఆయుర్వేదం ఒక జీవన విధానం. వైద్యశాస్త్రం కూడా దాంట్లో అంతర్లీనమైన ఒక విభాగం. అందు వల్లనే ప్రకృతిలోని ఓషధులకు, ఖగోళ శాస్త్రానికి, పంచ మహాభూతాల ప్రభావానికి, ఆరు ఋతువుల వాతావరణానికి అవినాభావ సంబంధం ఏర్పడింది. అంతేగాక భారతీయ ఆచారవ్యవహారాలతో పెనవేసుకున్న పోకడలు కూడా అనేకం ఉన్నాయి. వినాయక పూజకు వాడే రకరకాల పత్రులు, దీపావళి నాడు సేవించే మినప రొట్టె, శివరాత్రి నాడు తినే తియ్య దుంపలు ఇందుకు కొన్ని ఉదాహరణలు. భోగిపండుగ నాడు పిల్లలకు పోసే భోగి పళ్లు (రేగు పళ్లు), రథసప్తమి రోజున 'జిల్లేడు ఆకుల (అర్కపత్రం)పై రేగు పళ్ల (బదరీ)ను ఉంచి తలపై పెట్టుకుని చేసే అభ్యంగ స్నానం కూడా ఆ కోవలోనివే.

రేగు

ఈ చెట్లలో అనేక రకాలున్నాయి. ఇవి శీతాకాలం రెండు నెలల్లోనూ ఫలాలను అందిస్తాయి. ఈ చెట్టుకి చిన్న ముండ్లు, చిన్నపాటి గుండ్రని ఆకులు ఉంటాయి. పండ్లు ఆయా జాతులను బట్టి చిన్నవిగా, పెద్దవిగా, గుండ్రంగా, కోలగా రకరకాల ఆకారాలలో ఉంటాయి. ఇవన్నీ ఆధునిక వృక్ష శాస్త్రంలో జిజీఫస్ జాతికి చెందినవి.

గుణధర్మాలు

పక్వమై, తియ్యగా ఉండే పెద్ద రేగు పండుకు 'సౌవీర' అని పేరు. ఇది బల కరం, శుక్రకరం, చలువ చేస్తుంది. విరేచనకారి, రక్త దోషాన్ని పోగొడుతుంది.

బాగా పండి తియ్యగా ఉన్న చిన్న సీమ రేగు పండును 'కోల' అంటారు. ఇది వేడి చేస్తుంది. రుచిగా ఉంటుంది. త్రిదోషాలను కొద్దిగా ప్రేరేపిస్తుంది.

చిన్న రేగు పండును బదరము అంటారు. ఇది పులుపు, వగరు కలసిన రుచిలో ఉంటుంది. (అమ్ల, కషాయ రసాలు). కొద్దిపాటి చేదు కలసిన తీపి కూడా ఉంటుంది. కఫకరం. జిగురుగా ఉంటుంది. విరేచనం చేస్తుంది. దాదాపు అన్ని రకాల రేగు పండ్లు అగ్నిదీప్తిని చేసి ఆకలి కలిగిస్తాయి. దప్పికను, బడలికను, రక్త దోషాలను పోగొడతాయి.

విశేష ఔషధ గుణాలు

- రేగు చెట్టు వేరుని శుభ్రంగా కడిగి దంచి ముద్ద చేసి కొంచెం తేనె కలిపి సేవిస్తే, అన్నిరకాల నీళ్ల విరేచనాలు తగ్గుతాయి.
- పై ముద్దకు నువ్వులు చేర్చితే రక్త విరేచనాలు కూడా తగ్గుతాయి.
- బొంగురు గొంతు, దగ్గు తగ్గాలంటే రేగు ఆకుల ముద్దను కొద్దిగా నేతితో కలిపి వేడి చేసి సైంధవ లవణంలో కలిపి సేవించాలి.
- పుల్లగా ఉండే రేగు కాయల్ని ఎండబెట్టి పొడి చేసి, తేనెతో కలిపి సేవిస్తే, వాంతులు తగ్గుతాయి.
- తలనొప్పి తగ్గటానికి రేగు ఆకుల్ని పిప్పళ్లతో కలిపి ముద్ద చేసి పైపూతగా పట్టు వేయాలి.

అధిక బరువు తగ్గటానికి: బదరీ మూలం, కాండం, ఫలం, పత్రం (వేళ్లు, బెరడు లేక పండ్లు, ఆకులు).. వీటిలో దేనితోనైనా కషాయం కాచుకుని, దానిని బార్లీ జావతో కలిపి తాగితే (పదిచెంచాలు – అంటే 50. మి.లీ రోజుకోసారి) శరీరంలోని కొవ్వు కరుగుతుంది.

రక్తప్రదర

స్త్రీలలోని అధిక రుతు రక్తస్రావం తగ్గటానికి రేగు ఆకుల చూర్ణాన్ని బెల్లంతో గాని అరటిపండుతో గాని సేవించి అనంతరం మేకపాలు తాగాలి.

చిన్న రేగు పళ్లను ఎండించి, వాటిని కషాయంగా కాచి, 30 మి.లీ. రోజూ రెండు పూటలా తాగితే దురదలకు అమోఘంగా పనిచేస్తుంది.

ఆధునిక శాస్త్రం రీత్యా పోషక విలువలు

100 గ్రా. తాజా రేగుపండ్లలో...

17 గ్రా. పిండి పదార్థాలు, 5.4 నుండి 10. 5 గ్రా. వరకు శర్కర, 0.07 గ్రా. కొవ్వులు, 0.6 గ్రా. పీచు, 0.8 గ్రా. మాంసకృత్తులు, 82 గ్రా. నీరు, అన్నిరకాల బి విటమిన్లు, 25.6 మి.గ్రా. (5 శాతం) కాల్షియం, 0.76 నుంచి 1.8 మి.గ్రా. ఐరన్, 26.8 గ్రా. ఫాస్ఫరస్ ఉంటాయి.

గమనిక...

రేగు కాయ అయినా, పండు అయినా వాటి రుచిని బట్టి (అంటే మధుర, అమ్ల, తిక్త, కషాయ రసాలు) ఔషధ గుణాలు మారుతుంటాయి. వగరు, పులుపు ఉన్న కాయల్ని తింటే సుమారు ఐదు గంటల పాటు నాలుక బెరడు కట్టి, నాలుక ఏ ఇతర రుచులను కూడా గ్రహించలేకపోతుంది.

- డా. వృద్ధుల లక్ష్మీనరసింహశాస్త్రి ప్రముఖ ఆయుర్వేద వైద్య నిపుణులు, హైదరాబాద్, ఫోన్: 9963634484

అఖిల్

వేసవిలో వస్తున్నాం!

వేసవిలో ప్రేక్షకులకు వినోదాన్ని అందించడానికి సిద్ధమయ్యారు హీరో అఖిల్, దర్శకుడు 'బొమ్మరిల్లు' భాస్కర్. అందుకే చిత్రీకరణను వేగంగా పూర్తి చేస్తున్నారని సమాచారం. అఖిల్, పూజా హెగ్డే జంటగా దర్శకుడు 'బొమ్మరిల్లు' భాస్కర్ ఓ రొమాంటిక్ కామెడి చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. అల్లు అరవింద్ సమర్పణలో 'బన్నీ' వాస్, వాసు వర్మ నిర్మిస్తున్నారు. అఖిల్, పూజా కెమిస్ట్రీ ఈ ప్రేమ కథలో హైలెట్‌గా ఉంటుందట. ఇప్పటివరకూ జరిపిన షెడ్యూల్స్‌తో సినిమా ప్రథమార్ధం పూర్తయిందని తెలిసింది. ఈ నెల మొదటి వారం నుంచి తాజా షెడ్యూల్ హైదరాబాద్‌లో ప్రారంభం కానుంది. మార్చి చివరి వారంలోగా షూటింగ్ పూర్తి చేసి, ఏప్రిల్‌లో ఈ సినిమాను విడుదల చేయాలనుకుంటున్నారు. ఈ సినిమాకు గోపీ సుందర్ సంగీత దర్శకుడు. ఫేమస్ లవర్' కథ చెప్పారు. బాగా నచ్చింది. నటనకు ఆస్కారం ఉన్న పాత్ర. నాకు తెలిసి గత పదేళ్లలో సువర్ణలాంటి పాత్రను ప్రేక్షకులు చూసి ఉండరు. ఈ సినిమాలో నాతో పాటు ముగ్గురు హీరోయిన్లు నటించారు. కానీ కథ రీత్యా ఎవరి ప్రాముఖ్యత వారికి ఉంటుంది.

''నటనకు ఆస్కారం ఉన్న పాత్రలనే ఎక్కువగా చేయాలనుకుంటున్నాను. కమర్షియల్ సినిమాలు తక్కువగా చేయడం నా కెరీర్ ఎదుగుదలకు మైనస్ అవుతుందని అనుకోవడం లేదు. నాకు మంచి అవకాశాలే వస్తున్నాయి. బాగానే సంపాదిస్తున్నా'' అన్నారు ఐశ్వర్యా రాజేష్.

- విజయ్ దేవరకొండ నటించిన 'అర్జున్‌రెడ్డి, గీత గోవిందం' సినిమాలు చూశాను. ఆ సినిమాల్లో హీరోయిన్స్‌కు మంచి పాత్రలు దక్కాయని పించింది. 'వరల్డ్ ఫేమస్ లవర్'లో నా పాత్ర బాగానే ఉంటుంది. క్రాంతిమాధవ్‌గారు చాలా సెన్సిబుల్ డైరెక్టర్. సహజత్వానికి చాలా దగ్గరగా సినిమాలు తీస్తుంటారు. కేయస్ రామారావుగారు మంచి నిర్మాత.
- కథ డిమాండ్ చేస్తే లిప్‌లాక్ సన్నివేశాలు తప్పవు. అనవసరంగా లిప్ లాక్ సన్నివేశాలు ఉండకూడదు. నేను నటించిన 'వడచెన్నై' చిత్రంలో నాలుగు లిప్‌లాక్ సీన్స్ ఉన్నాయి. ఈ తరంలో దాదాపు అందరూ ఓపెన్‌గానే ఉంటున్నారు. ఒక పెద్ద కమర్షియల్ సినిమా ఫ్లాప్ అయితే హీరోయిన్ అన్‌లక్కీ అని కొందరు అంటుంటారు. ఆ లాజిక్ నాకు అర్థం కాదు.
- ప్రస్తుతం బయోపిక్స్ ట్రెండ్ నడుస్తోంది. జయలలితగారి బయోపిక్‌లో నటించాలనుకున్నాను. ఇప్పుడు జయలలితగారి బయోపిక్స్ వస్తున్నాయి. నా ఫేవరెట్ యాక్ట్రస్ సౌందర్యగారి బయోపిక్‌లో నటించాలని ఉంది. కాకపోతే కాస్త నా కలర్ తక్కువగా ఉంటుందేమో (నవ్వుతూ). తమిళంలో నేను నటించిన 'వానమ్ కొట్టటుమ్' సినిమా ఈ నెల 7న విడుదలవుతుంది. విజయ్ సేతుపతిగారితో ఓ సినిమా చేస్తున్నాను. తెలుగులో నాని 'టక్ జగదీష్'లో కీలక పాత్ర చేస్తున్నాను.

ఐశ్వర్యా రాజేష్

కథ డిమాండ్ చేస్తే లిప్‌లాక్ తప్పదు

నా చిన్నప్పుడే మా నాన్నగారు (రాజేష్) మరణించారు. 'కాక్కముట్టై' (2014) సినిమాకు ముందు నా పేరు స్క్రీన్‌పై ఐశ్వర్య అని ఉండేది. ఆ తర్వాత ఐశ్వర్యా అయ్యర్, ఐశ్వర్యా లక్ష్మీ ఇలా కొంతమంది ఐశ్వర్య పేరుతో ఇండస్ట్రీకి వచ్చారు. అప్పుడు నా పేరు మార్చుకోవాలనుకున్నాను. 'కాకముట్టై'తో నా పేరును ఐశ్వర్యా రాజేష్‌గా మార్చుకున్నాను. ఆ సినిమాతో నాకు పెద్ద బ్రేక్ వచ్చింది. మా నాన్నగారి పేరు నాకు కలిసొచ్చింది. అలాగే మా నాన్న నాతోనే ఉన్నారనే ఫీలింగ్ కలిగింది.

క్రాంతిమాధవ్ దర్శకత్వంలో విజయ్ దేవరకొండ హీరోగా కేయస్ రామారావు నిర్మించిన చిత్రం 'వరల్డ్ ఫేమస్ లవర్'. కథానాయికలుగా రాశీఖన్నా, కేథరీన్, ఐశ్వర్యా రాజేష్, ఇజబెల్లా నటించారు. ఈ నెల 14న చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఐశ్వర్యా రాజేష్ చెప్పిన విశేషాలు.

- 2018లో ఓ అవార్డు ఫంక్షన్ కోసం నేను హైదరాబాద్ వచ్చినప్పుడు క్రాంతిమాధవ్‌గారు 'వరల్డ్

నయన్ ఇన్

రజనీకాంత్

నయనతార

'చంద్రముఖి' (2005), 'దర్బార్' (2020) చిత్రాల్లో రజనీకాంత్, నయనతార జంటగా నటించారు. రజనీ శివాజీ (2007), 'కుశేలన్' (2008) (తెలుగులో 'కథానాయకుడు') చిత్రాలలో ఆయనతో కాలు కదిపారు నయనతార. ఇప్పుడు రజనీ, నయనతార మరోసారి స్క్రీన్ షేర్ చేసుకోనున్నారు. రజనీకాంత్ హీరోగా శివ దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. సన్ పిక్చర్స్ సంస్థ ఈ సినిమాను నిర్మిస్తోంది. ఖుష్బూ, మీనా, కీర్తీ సురేష్, ప్రకాష్ రాజ్ ఈ చిత్రంలో ముఖ్య పాత్రలు చేస్తున్నారు. తాజాగా ఈ సినిమాలోకి నయనతారను తీసుకున్నారు. అయితే నయనతార రజనీకాంత్‌కు జోడిగా నటించనున్నారా? లేక ఏదైనా కీలక పాత్ర చేయబోతున్నారా? అనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది. ఈ సినిమా తొలి షెడ్యూల్ హైదరాబాద్‌లో ముగిసింది. తర్వాతి షెడ్యూల్ చెన్నైలో ఈ నెల ప్రారంభం కానుందట. ఈ చిత్రాన్ని ఈ ఏడాదిలోనే విడుదల చేయాలనుకుంటున్నారు.

రామచరణ్

కొత్త కాంబినేషన్

'ఆర్ఆర్ఆర్' తర్వాత రామ్‌చరణ్ ఏ దర్శకుడితో సినిమా చేయబోతున్నారు అనే విషయంపై ఎప్పటికప్పుడు పలు వార్తలు వినిపిస్తున్నాయి. కొరటాల శివ దర్శకత్వంలో సినిమా చేయబోతున్నారని, అనిల్ రావిపూడితో సినిమా ఉండొచ్చని ఆ మధ్య ప్రచారం జరిగింది. తాజాగా 'సాహో' ఫేమ్ సుజీత్‌తో రామ్‌చరణ్ సినిమా చేసే అవకాశం ఉందని వార్తలు వినిపిస్తున్నాయి. ఈ సినిమాను యువీ క్రియేషన్ బ్యానర్ నిర్మించడానికి సన్నాహాలు చేస్తోందని సమాచారం. యువీ క్రియేషన్స్ సంస్థ అధినేతలు వంశీ, ప్రమోద్, విక్కీ అటు దర్శకుడు సుజీత్‌కి ఇటు రామ్‌చరణ్‌కి సన్నిహితులు. 'ఆర్ఆర్ఆర్' తర్వాత చరణ్–సుజీత్ సినిమా ప్రారంభం అవుతుందట.

చిన్మయి వర్సెస్ రాధా రవి

'మీటూ' ఉద్యమం మన దేశంలోనూ ఊపందుకున్నప్పుడు సౌత్ ఇండస్ట్రీల్లో ఎక్కువగా వినిపించిన పేరు చిన్మయి. గాయనిగా, డబ్బింగ్ ఆర్టిస్ట్‌గా చిన్మయి పాపులర్. సాధారణంగా సినిమాల్లో హీరోయిన్లకు గొంతుగా ఉండే చిన్మయి, ఈ ఉద్యమంలో ఎందరో బాధితులకు గొంతుగా నిలిచారు. ధైర్యంగా నిలబడ్డారు. 'మీటూ' ఉద్యమంలో ఆమె ఎదుర్కొన్న లైంగిక వేధింపులను నిర్భయంగా బయటకు చెప్పడమే కాకుండా దాని వెనుక ఉన్నది ప్రముఖ గేయ రచయిత వైరముత్తు అని ఆయన పేరుని బయటపెట్టారు. తమిళ పరిశ్రమలో అది సంచలనం సృష్టించింది. ఆ తర్వాత తన ట్వీటర్ వేదికగా వైరముత్తు, నటుడు, నిర్మాత రాధారవిపై ఆరోపణలు చేసిన స్త్రీల వివరాలను గోప్యంగా ఉంచి వాళ్ల చేదు సంఘటనలు షేర్ చేస్తూ ఉన్నారు. ఇది జరిగిన కొన్ని రోజులకే చిన్మయి డబ్బింగ్ యూనియన్ సభ్యత్వం రద్దయింది. సభ్యత్వం కొనసాగించకపోవడానికి వార్షికరుసుము చెల్లించకపోవడమే కారణం అని, అందుకే సభ్యత్వాన్ని రద్దు చేశామని యూనియన్ పేర్కొంది. అప్పుడు డబ్బింగ్ యూనియన్ ప్రెసిడెంట్ పదవిలో రాధారవి ఉన్నారు. సభ్యత్వం రద్దు విషయమై చిన్మయి కోర్టుని ఆశ్రయించగా, కోర్టు చిన్మయి వాదనకు అనువుగా ఇంటర్న్ ఆర్డర్ (ఈ కేసు పరిశీలనలో ఉన్నంత కాలం ఆమె డబ్బింగ్ యూనియన్ సభ్యురాలిగానే పరిగణించాలి) మంజూరు చేసింది. ఆ తర్వాత తమిళంలో చిన్మయి డబ్బింగ్ కెరీర్ మందకొడిగా సాగుతోంది. తాజాగా ఈ నెల డబ్బింగ్ యూనియన్ ఎన్నికలు జరగనున్నాయనే ప్రకటన విడుదలైంది. మరోసారి ప్రెసిడెంట్ పదవికి పోటీ చేయడానికి రెడీ అయ్యారు రాధారవి. ఆయనకు ప్రత్యర్థిగా, రామరాజ్యం పార్టీ తరపున ప్రెసిడెంట్ పదవికి నామినేషన్ వేశారు చిన్మయి. విశేషం ఏంటంటే సభ్యత్వం రద్దు చేసినప్పుడే డబ్బింగ్ యూనియన్ ఓటర్ల జాబితాలో నుంచి చిన్మయి పేరును తొలగించారు. 'సభ్యులు కానివారు ఎన్నికల్లో ఎలా పోటీ చేస్తారు?' అని ఒక వర్గం వారు చిన్మయిని విమర్శించారు. ''కోర్టు మంజూరు చేసిన ఆర్డర్‌లో ఎన్నికల్లో పోటీ చేసే హక్కు నాకుంది'' అని పేర్కొన్నారు చిన్మయి. ప్రస్తుతం చిన్మయి నామినేషన్ పత్రాలు పరిశీలనలో ఉన్నాయి. ఫిబ్రవరి 15న ఎన్నికలు జరగనున్నాయి. మరి ఎలాంటి నాటకీయత చోటు చేసుకుంటుంది? చిన్మయి వర్సెస్ రాధారవి.. గెలుపు ఎవరిది? అని తమిళ పరిశ్రమ ఆసక్తిగా ఎదురు చూస్తోంది.

చిన్మయి

రాధారవి

వెండితెరకు కాళోజీ జీవితం

ప్రజాకవి, ప్రముఖ రచయిత, పద్మవిభూషణ్ అవార్డు గ్రహీత స్వర్గీయ కాళోజీ నారాయణ రావు జీవితం వెండితెరపై ఆవిష్కృతం కానుంది. ప్రభాకర్ జైనీ దర్శకత్వంలో జైనీ క్రియేషన్స్ పతాకంపై శ్రీమతి విజయలక్ష్మి జైనీ 'ప్రజాకవి–కాళోజీ' పేరుతో ఈ బయోపిక్‌ను నిర్మిస్తున్నారు. తెలంగాణ సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్, తెలంగాణ ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి చేతుల మీదుగా ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభమైంది. ''కాళోజీగారి జీవితమంతా పోరాటమే. ఆ పోరాటాన్ని 'ప్రజాకవి– కాళోజీ'గా తెరకెక్కిస్తున్నాం. కాళోజీ పాత్రలో శ్రీ మూలవిరాట్, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు గారి పాత్రను వారి తమ్ముడు మనోహర రావుగారు పోషిస్తున్నారు. కాళోజీ భార్యగా విజయలక్ష్మి జైనీ కనిపిస్తారు. ఈ సినిమాకు ఎస్ఎస్. ఆత్రేయ సంగీతదర్శకుడు'' అని చిత్రబృందం తెలిపింది. కాళోజీ ఫౌండేషన్ సభ్యులు అంపశయ్య నవీన్, నాగిళ్ళ రామశాస్త్రి, వీఆర్ విద్యార్థి, పొట్టపల్లి శ్రీనివాసరావు, కవి అన్వర్ పాల్గొన్నారు.

ప్రభాకర్, మూల విరాట్

వాస్తవ ప్రేమకథ

దివ్యారావు

వరుణ్, దివ్యారావు జంటగా '1940లో ఒక గ్రామం, కమలతో నా ప్రయాణం' చిత్రాల ఫేమ్ నరసింహ నంది స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించిన చిత్రం 'డిగ్రీ కాలేజ్'. ఈ నెల 7న ఈ చిత్రం విడుదల కానుంది. ''నా గత చిత్రాల మాదిరిగా కాకుండా కమర్షియల్ అంశాలతో ఈ సినిమా తీశాను. ఇద్దరు డిగ్రీ కాలేజ్ స్టూడెంట్స్ మధ్య క్లాస్‌రూమ్‌లోనూ బయట అంకురించిన వాస్తవ ప్రేమకథ ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కించాం'' అన్నారు నరసింహ నంది. ''ఈ సినిమాలో భావోద్వేగభరితమైన అంశాలు కూడా ఉన్నాయి. అందుకే ఈ చిత్రాన్ని నా ఆధ్వర్యంలో విడుదల చేయాలనుకున్నాను'' అన్నారు పంపిణీదారుడు బాపిరాజు.

బడ్జెట్ సమావేశం సందర్భంగా రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవిందన్‌ను పార్లమెంటుకు తీసుకువస్తున్న ప్రధాని మోదీ. చిత్రంలో లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా, ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు

సీఏఏ చరిత్రాత్మకం

- నిరసనల పేరుతో హింస తగదు
- పార్లమెంట్ సంయుక్త సమావేశంలో రాష్ట్రపతి కోవింద్

న్యూఢిల్లీ: జాతిపిత మహాత్ముని ఆశయ సాధనకు కేంద్రం తీసుకువచ్చిన పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ) చారిత్రకమైందని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ కొనియాడారు. నిరసనల పేరుతో కొందరు హింసకు పాల్పడటం దేశాన్ని, సమాజాన్ని బలహీనపరుస్తుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా శుక్రవారం రాష్ట్రపతి పార్లమెంట్ ఉభయసభల సంయుక్త సమావేశంలో ప్రసంగించారు. పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రభుత్వం సాధించిన విజయాలను ఆయన వివరించారు. రాష్ట్రపతి ప్రసంగానికి అధికార పక్షం నేతలు బల్లలు చరుస్తూ మద్దతు ప్రకటించగా ప్రతిపక్షం నిరసన ప్రకటించింది. సుమారు 70 నిమిషాల పాటు జరిగిన రాష్ట్రపతి కోవింద్ ప్రసంగం ఆయన మాటల్లోనే...

నెరవేరిన గాంధీజీ ఆశయం..

సీఏఏకు వ్యతిరేకంగా దేశంలో నిరసనల పేరుతో హింస చెలరేగడం సరికాదు. సర్వమత సమానత్వం భారత్ చిరకాలంగా నమ్ముతున్న సూత్రం. దేశ విభజన సమయంలో ఈ నమ్మకంపై తీవ్రమైన దాడి జరిగింది. పాకిస్తాన్‌లో నివసించేందుకు ఇష్టపడని హిందువులు, సిక్కులు భారత్‌కు తిరిగి రావచ్చు. అలా వచ్చిన వారు ఇక్కడ సాధారణ జీవితం గడిపేలా చేయడం ప్రభుత్వ బాధ్యతని మహాత్మాగాంధీ ఎప్పుడో చెప్పారు. ఆయన ఆకాంక్షలను గౌరవించడం అందరి బాధ్యత. ఉభయసభలు ఆ బాధ్యతను నెరవేర్చడం సంతోషకరమైన విషయం. గాంధీజీ 150వ జయంత్యుత్సవాల సందర్భంగా సీఏఏ అమల్లోకి రావడం సంతోషకరం. పాకిస్తాన్‌లో జరుగుతున్న నాన్‌కానా సాహెబ్ గురుద్వారాపై దాడి వంటి ఘటనలను అంతర్జాతీయ సమాజం దృష్టికి తీసుకు రావాల్సిన బాధ్యత మనపై ఉంది. అంతర్జాతీయ సమాజం కూడా ఇలాంటి ఘటనలను ఖండించడంతోపాటు తగిన చర్యలు తీసుకోవాలి.

దేశీయ ఉత్పత్తులనే కొనండి...

దేశ ఆర్థిక వ్యవస్థ పునాదులు బలంగా ఉన్నాయి. విదేశీ మారక ద్రవ్యం నిల్వలు రికార్డు స్థాయిలో అందుబాటులో ఉన్నాయి. మెరుగైన భవిష్యత్తు కోసం ప్రజలు స్థానికంగా తయారైన ఉత్పత్తులనే కొనుగోలు చేయాలి. ఆర్థిక వ్యవస్థను ఐదు లక్షల డాలర్ల స్థాయికి తీసుకు వెళ్లేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉంది. రామజన్మభూమి అంశంలో సుప్రీంకోర్టు తీర్పు ప్రజలు ప్రజాస్వామ్య వ్యవస్థలపై ఉంచిన నమ్మకాన్ని బలపరిచేదిగా ఉంది. ఈ తీర్పుపై దేశ ప్రజలు స్పందించిన తీరు ప్రశంసార్హమైంది. దేశంలోని ఇతర ప్రాంతాలతో సమానమైన హక్కులు సాధించుకోవడం ద్వారా జమ్మూ కశ్మీర్, లడాఖ్ ప్రజలూ ఇప్పుడు ఎంతో సంతోషంగా ఉన్నారు. కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370 రద్దు ఓ చారిత్రక ఘట్టం. జాతి ప్రయోజనాల కోసం ప్రతి వ్యక్తి తన బాధ్యతలు గుర్తెరిగి నడుచుకునేలా చేయాలి. అందరం కలిసికట్టుగా ఈ దశాబ్దాన్ని తమ బాధ్యతలను నెరవేర్చేందుకు అంకితం చేద్దాం. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడు నెలల్లోనే ఎన్నో రికార్డులు సృష్టించింది. చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ నియామకం త్రివిధ దళాల మధ్య సమన్వయం సాధించేందుకు దోహదపడుతుంది. ఉగ్రవాదాన్ని నియంత్రించేందుకు ప్రభుత్వం భద్రతా దళాలకు పూర్తి స్వేచ్ఛనిచ్చింది. మహిళల భద్రత కోసం 1,000 ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. మహిళలకు సంబంధించిన కేసుల సత్వర విచారణకు ఇవి దోహదపడతాయి.

సభలో తొలిరోజు..

- సమావేశానికి ముందుగా రాష్ట్రపతి కోవింద్‌ను ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, ప్రధాని మోదీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా పార్లమెంట్ సెంట్రల్ హాల్‌కు తోడ్కొని వచ్చారు.
- మొదటి వరుసలో ప్రధాని మోదీతోపాటు మంత్రులు ఠాపర్ చంద్ గహ్లోత్, ఎస్.జైశంకర్, రాజ్‌నాథ్‌సింగ్, అమిత్ షా, నిర్మలా సీతారామన్, తదితరులతోపాటు ప్రతిపక్షం నుంచి మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మాత్రమే ఆసీనులయ్యారు.
- కాంగ్రెస్ చీఫ్ సోనియా గాంధీ, రాహుల్ గాంధీ మొదటి వరసకు బదులుగా శశి థరూర్, మనీష్ తివారీ తదితరులతో కలిసి ఐదో వరుసలో కూర్చున్నారు.
- రాష్ట్రపతి ప్రసంగానికి ప్రతిపక్ష సభ్యులు తెలుపుతున్న నిరసనలను టీఎంసీ సభ్యుడు డెరెక్ ఒబ్రియాన్ తన సెల్‌ఫోన్‌లో చిత్రీకరిస్తూ కనిపించారు.
- బహుజన్ సమాజ్ పార్టీ(బీఎస్‌పీ)కి చెందిన అతుల్ రాయ్ లోక్‌సభ సభ్యునిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని ఘోసి నియోజకవర్గం నుంచి ఎన్నికైన రాయ్.. రేప్ కేసులో అరెస్టై జైలులో ఉన్నారు. కోర్టు పెరోల్ ఇవ్వడంతో ప్రమాణం చేశారు.

పార్లమెంట్‌లో ప్రతిపక్షాల నిరసన

సీఏఏ, ఎన్నార్సీలకు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న ప్రతిపక్షనేతలు. చిత్రంలో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ: పౌరసత్వ సవరణ చట్టంతోపాటు, ఎన్‌పీఆర్, ఎన్నార్సీలకు సంబంధించి రాష్ట్రపతి ప్రసంగిస్తుండగా 14 ప్రతిపక్ష పార్టీల నేతలు చేతులకు నల్లటి పట్టీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. సీఏఏను ఓ విజయంగా ప్రభుత్వం పేర్కొనడం సిగ్గుచేటని విమర్శించాయి. కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీతోపాటు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత గులాం నబీ ఆజాద్‌లు తమకు కేటాయించి స్థానాల్లో కూర్చోకుండా సెంట్రల్ హాల్‌లో ఇతర ప్రతిపక్ష పార్టీల నేతలతోపాటుగా కూర్చున్నారు. రాష్ట్రపతి సీఏఏ ప్రస్తావన తెచ్చినప్పుడు ప్రతిపక్ష నేతలు కొందరు బ్యానర్లు ప్రదర్శించడంతోపాటు సిగ్గు సిగ్గు అని నినాదాలు చేశారు. అంతకుముందు ప్రతిపక్ష నేతలు గాంధీజీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. సీఏఏపై రాష్ట్రపతి తన ప్రసంగంలో చేసిన వ్యాఖ్యలను తీసేయాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష పార్టీలు సవరణ తీర్మానాలు ప్రవేశపెట్టవచ్చునని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

సీఏఏను గట్టిగా సమర్థించండి

న్యూఢిల్లీ: పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ)పై పార్లమెంట్లో విపక్షాలను సమర్థంగా ఎదుర్కోవాలని ఎన్డీయే పక్ష సభ్యులకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దిశానిర్దేశం చేశారు. సీఏఏ విషయంలో ప్రభుత్వం తప్పేం చేయలేదని, చట్టాన్ని సమర్థిస్తూ గట్టిగా వాదనను విన్పించాలని సూచించారు. బడ్జెట్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై ఎన్డీయే పక్షాలు శుక్రవారం సమావేశమయ్యాయి. సమావేశంలో మోదీ పేర్కొన్న అంశాలను పేరు చెప్పడానికి ఇష్టపడని బీజేపీ మిత్రపక్ష నేత ఒకరు వెల్లడించారు. 'సీఏఏ ముస్లింలపై వివక్ష చూపుతుందన్న ప్రతిపక్షాల వాదనను గట్టిగా తిప్పికొట్టండి. ముస్లింలతో పాటు పొరులంతా మనకు సమానమేనని స్పష్టం చేయండి' అని ప్రధాని చెప్పారన్నారు. జాతీయ జనాభా పట్టిక(ఎన్పీఆర్)కు సంబంధించిన ప్రశ్నావళి నుంచి కొన్ని ప్రశ్నలను తొలగించాలని సమావేశంలో మిత్రపక్షం జేడీయూ ప్రభుత్వాన్ని కోరింది. ఎన్పీఆర్ నుంచి తల్లిదండ్రుల వివరాలను కోరే ప్రశ్నలను తొలగించాలని కోరామని, దానికి హోంమంత్రి అమిత్ షా సానుకూలంగా స్పందించారని జేడీయూ ఎంపీ లలన్ సింగ్ వెల్లడించారు. శిరోమణి అకాలీదళ్ కూడా తమ సూచనను సమర్థించిందన్నారు. తల్లిదండ్రుల వివరాలకు సంబంధించిన ప్రశ్నలకు జవాబివ్వడం ఐచ్ఛికమేనని ఇప్పటికే కేంద్రమంత్రి జవదేకర్ వివరణ ఇచ్చిన విషయం తెలిసిందే.

ఎన్డీయే సభ్యులకు పీఎం సూచన

మీడియాకు అభివాదం చేస్తున్న ప్రధాని మోదీ

చర్చలు ఫలవంతమవుతాయని ఆశిస్తున్నా

శనివారం నుంచి ప్రారంభం కానున్న బడ్జెట్ సమావేశాలు ఫలవంతమవుతాయని, సభ్యులు నాణ్యత కలిగిన చర్చను జరుపుతారని ఆశిస్తున్నట్లు ప్రధాని మోదీ శుక్రవారం అన్నారు. పార్లమెంట్ సమావేశాల సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఇరు సభలూ ఆర్థిక సమస్యల గురించి, ప్రపంచ ఆర్థిక మందగమన నేపథ్యంలో భారత్ ఎలా ముందుకు సాగాలో వంటి వాటిపై విస్తృతంగా చర్చించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ దశాబ్దానికి గట్టి పునాదులు ఈ బడ్జెట్‌తోనే ప్రారంభమవ్వాలని చెప్పారు. ఈ సెషన్‌లో ఆర్థిక సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టనున్నట్లు చెప్పారు. దళితులు, మధ్యతరగతివారు, అణచివేతకు గురైన వారు, మహిళల సాధికారత కోసం ఈ దశాబ్దంలో కూడా తాము కష్టపడతామని చెప్పారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. మొదటి విడత బడ్జెట్ సమావేశాలు శనివారం నుంచి ఫిబ్రవరి 11 వరకూ, రెండో దశ సమావేశాలు మార్చి 2 నుంచి ఏప్రిల్ 3 వరకూ జరగనున్న సంగతి తెలిసిందే.

విపక్షాల చర్య అప్రజాస్వామికం: జీవీఎల్

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రపతి ప్రసంగానికి అడ్డుతగిలే ప్రయత్నం చేసిన విపక్షాల చర్య అప్రజాస్వామికమని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి జీవీఎల్ నరసింహారావు అన్నారు. ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. 'ఆర్టికల్ 370 రద్దు, జమ్మూకశ్మీర్ పునర్ వ్యవస్థీకరణ, అక్కడి అభివృద్ధి కార్యక్రమాలు, 2022 నాటికి కొత్త భారత నిర్మాణానికి మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను రాష్ట్రపతి వివరించారు. దీనిపై సభ్యులంతా హర్షధ్వానాలతో స్వాగతించగా, కొందరు ప్రతిపక్ష నాయకులు నలుగురు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేయాలని ప్రయత్నం చేశారు. ఇది అప్రజాస్వామికం. వారంతా క్షమాపణలు చెప్పాలి' అంటూ డిమాండ్ చేశారు.

సభ సజావుగా సాగేందుకు తోడ్పడండి

అఖిలపక్షం భేటీలో రాజ్యసభ చైర్మన్ ఎం.వెంకయ్యనాయుడు

సాక్షి, న్యూఢిల్లీ: రాజ్యసభ 251వ సమావేశాలను ఫలప్రదంగా నిర్వహించడంలో అన్ని పార్టీలూ సహకరించాలని రాజ్యసభ చైర్మన్ ముప్పవరపు వెంకయ్య నాయుడు కోరారు. ఏడాది పొడవునా దేశ ఆర్థిక ప్రగతిని నిర్దేశించే బడ్జెట్ సమావేశాల సందర్భంగా పద్దుపై సరైన చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు. శుక్రవారం ఉపరాష్ట్రపతి నివాసంలోని సర్దార్ పటేల్ సభాప్రాంగణంలో రాజ్యసభ అఖిలపక్ష నేతలకు ఆయన తేనీటి విందు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనవసర వివాదాల్లేకుండా సభను రాజ్యాంగబద్ధంగా నిర్వహించుకోవాల్సిన అవసరాన్ని అందరూ గుర్తించాలన్నారు. 'ప్రతి సమావేశమూ కీలకమే కానీ.. కొత్త సమస్యలు సవాల్ విసురుతున్న బడ్జెట్ నేపథ్యంలో ఈసారి బడ్జెట్ సమావేశాలు మరింత కీలకం కానున్నాయి. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలపడంతో పాటు 2020-21 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌పైనా విస్తృతంగా చర్చ జరుగుతున్నందున సభలు సజావుగా జరగాల్సిన అవసరం ఉంది'అని రాజ్యసభ చైర్మన్ అన్నారు. వారం రోజులపాటు జరగనున్న చర్చల్లో రాజ్యసభలోని అన్ని పార్టీలకు తమ ఆలోచనలు వెల్లడించేందుకు అవకాశం లభిస్తుందని.. ప్రజల సమస్యలను పార్లమెంటు దృష్టికి తీసుకొచ్చేందుకు వీలుంటుందని రాజ్యసభ చైర్మన్ అన్నారు. చాలాకాలం తర్వాత రాజ్యసభ 249వ, 250వ సమావేశాలు వందశాతం ఫలప్రదమైన విషయాన్ని గుర్తు చేస్తూ ఆయన..ఇదే ఒరవడి కొనసాగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో అధికార పక్ష నేత ఠావర్‌చంద్ గెహ్లోట్, విపక్ష నేత గులాంనబీ ఆజాద్, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి పాల్గొన్నారు.

క్లుప్తంగా...

జేడీఎస్‌కు ప్రశాంత్ కిశోర్ సహకారం?

సాక్షి బెంగళూరు: రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ కర్ణాటక రాజకీయాల్లోకి రానున్నారనే ప్రచారం సాగుతోంది. జేడీఎస్ క్యాడర్‌ను తిరిగి గాడిలో పెట్టేందుకు, 2023 కర్ణాటక శాసనసభ ఎన్నికల్లో విజయదుందుభి మోగించేందుకు ప్రశాంత్ కిశోర్ లాంటి వ్యూహకర్త అవసరమని ఆ పార్టీ అధినేతలు భావించినట్లు సమాచారం. ఇప్పటికే పార్టీ అగ్రనాయకత్వం ప్రశాంత్ కిశోర్‌తో మాట్లాడినట్లు సమాచారం. వచ్చే ఏడాది పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికలు ఉన్నందున తొలుత ఆ పార్టీకి పనిచేసే అవకాశం ఉందని తెలుస్తోంది.

ఢిల్లీ ఎన్నికల్లో పాక్ జోక్యాన్ని సహించబోం: కేజ్రీవాల్

న్యూఢిల్లీ: ఢిల్లీ ఎన్నికలు భారతదేశానికి సంబంధించిన అంతర్గత అంశమని, దీనిపై పాకిస్తాన్ జోక్యాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ సహించబోమని ఢిల్లీ ముఖ్యమంత్రి అర్వింద్ కేజ్రీవాల్ స్పష్టం చేశారు. 'నరేంద్ర మోదీ భారత ప్రధానమంత్రి. నాకూ ఆయనే పీఎం. ఢిల్లీ ఎన్నికలు భారత అంతర్గత అంశం. ఉగ్రవాదానికి మద్దతిస్తున్న పాకిస్తాన్ జోక్యాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ ఒప్పుకోం. పాక్ ఎంత ప్రయత్నించినా.. భారతదేశ ఐకమత్యాన్ని ఏం చేయలేదు' అంటూ పాకిస్తాన్ మంత్రి ఫవాద్ హుస్సేన్ చేసిన ట్వీట్‌కు కేజ్రీవాల్ ట్వీట్ రూపంలో సమాధానమిచ్చారు.

సర్వైకల్ కేన్సర్ వందేళ్లలో నిర్మూలన

టొరంటో: గర్భాశయ కేన్సర్(సర్వైకల్ కేన్సర్)ను మరో వందేళ్లలో పూర్తిగా నిర్మూలించే అవకాశముందని లాన్సెట్ పత్రికలో ప్రచురితమైన రెండు అధ్యయనాలు తేల్చాయి. అల్పాదాయ వర్గాల మహిళల్లో ఎక్కువగా వచ్చే కేన్సర్లలో ఇది రెండోదని కెనడాలోని లావల్ వర్సిటీ పరిశోధకులు తేల్చారు. ఈ కేన్సర్ నిర్మూలన విషయంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ వ్యూహ ముసాయిదాను పరిశోధకులు పరిగణనలోకి తీసుకున్నారు. 2030 లోగా 90% బాలికలకు ఈ వ్యాక్సిన్ ఇవ్వాలని, 70% మహిళలకు వారి జీవితం కాలంలో కనీసం రెండు సార్లు నిర్ధారణ పరీక్షలు చేయాలని పేర్కొన్నారు. డబ్ల్యూహెచ్‌ఓ ప్రణాళిక ఆధారంగా అధికాదాయ దేశాల్లో 2040 నాటికి, మిగతా దేశాల్లో వచ్చే శతాబ్దం నాటికి సర్వైకల్ కేన్సర్‌ను నిర్మూలించవచ్చన్నారు.

'నిర్భయ' దోషుల ఉరి మళ్లీ వాయిదా

తదుపరి ఉత్తర్వులిచ్చే వరకు ఆపాలని ఢిల్లీ కోర్టు ఉత్తర్వులు

న్యూఢిల్లీ: 'నిర్భయ'దోషుల ఉరిశిక్ష అమలు మరోసారి వాయిదా పడింది. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు శిక్షను అమలు చేయరాదంటూ ఢిల్లీ కోర్టు శుక్రవారం ఆదేశించింది. చట్టపరంగా తమలో కొందరికి మిగిలి ఉన్న అవకాశాలను వినియోగించుకోవాల్సి ఉన్నందున శిక్ష అమలును నిరవధికంగా వాయిదా వేయాలంటూ దోషులు పెట్టుకున్న పిటిషన్‌పై అడిషనల్ సెషన్స్ జడ్జి ధర్మేందర్ రాణా ఈ మేరకు ఆదేశాలిచ్చారు. నిర్భయ కేసులో దోషులైన పవన్ గుప్తా, వినయ్ కుమార్ శర్మ, అక్షయ్ కుమార్, ముకేశ్ కుమార్ సింగ్‌లను ఫిబ్రవరి ఒకటో తేదీ ఉదయం 6 గంటలకు ఉరి తీయాలంటూ కోర్టు జనవరి 17వ తేదీన ఆదేశించిన విషయం తెలిసిందే. వినయ్ క్షమాభిక్ష పిటిషన్ రాష్ట్రపతి కోవింద్ వద్ద పెండింగ్‌లో ఉండగా, మిగతా ఇద్దరు చట్టపరమైన అవకాశాలను ఉపయోగించుకునేందుకు వీలుగా ఉరి శిక్ష అమలును వాయిదా వేయాలంటూ దోషులు పవన్, వినయ్, అక్షయ్‌ల తరఫున లాయర్ ఏపీ సింగ్ గురువారం పిటిషన్ వేసిన విషయం తెలిసిందే. దీనిపై శుక్రవారం జడ్జి ధర్మేందర్ రాణా విచారణ చేపట్టారు. నలుగురిలో ఏ ఒక్కరి పిటిషన్ పెండింగ్‌లో ఉన్నా మిగతా వారిని ఉరి తీయడం నిబంధనలకు విరుద్ధమని దోషుల తరఫు న్యాయవాది వాదించారు. ఏకీభవించిన న్యాయమూర్తి డెత్ వారెంట్లను వాయిదా వేస్తూ ఆదేశాలిచ్చారు.

పవన్ పిటిషన్ కొట్టివేత

మరోవైపు, నిర్భయ కేసులో మరో దోషి పవన్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. నేరానికి పాల్పడిన సమయానికి మైనర్ అయినందున తనకు విధించిన ఉరిశిక్షపై సమీక్ష జరపాలంటూ అతడు పెట్టుకున్న పిటిషన్‌ను కొట్టివేసింది. దీంతో ఆఖరి అవకాశంగా సుప్రీంకోర్టులో క్యూరేటివ్ పిటిషన్ వేసే అవకాశం ఉంది. ఇలా ఉండగా, న్యాయం దక్కే దాకా పోరాటం కొనసాగిస్తామని నిర్భయ తల్లి ఆశాదేవి మీడియాతో అన్నారు. ఉరి శిక్ష వాయిదా పడేలా దోషులు వ్యవహరిస్తున్న తీరుపై చర్చ జరగాల్సి ఉందని హోంశాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. మరోవైపు, హేయమైన నేరాలకు విధించిన ఉరిశిక్ష అమలుపై బాధితుల కోణంలో నిబంధనలను రూపొందించాల్సిన అవసరం ఉందంటూ కేంద్రం వేసిన పిటిషన్‌ను విచారించేందుకు సుప్రీంకోర్టు అంగీకరించింది.

పోలీసుల చేతిలో భర్త.. గ్రామస్తుల దాడిలో భార్య!

ఫరూఖాబాద్(యూపీ): పుట్టినరోజు అంటూ 23 మంది చిన్నారులను పిలిచి బంధించిన వ్యక్తిని పోలీసులు గురువారం అర్ధరాత్రి హతమార్చగా, తప్పించుకునేందుకు ప్రయత్నించిన అతని భార్య.. గ్రామస్తుల చేతిలో చనిపోయింది. ఉత్తరప్రదేశ్‌లోని ఫరూఖాబాద్ జిల్లా కసారియా గ్రామంలో జరిగిందీ ఘటన. చిన్నారులను బందీగా చేపట్టి, వారిని చంపేస్తామని బెదిరిస్తూ.. ప్రభుత్వ యంత్రాంగాన్ని పరుగులు పెట్టించిన సంచలన ఘటన చివరకు సుఖాంతమైంది. సుభాష్ బాథమ్(40)పై గతంలో హత్య కేసు ఉంది. బెయిల్‌పై బయటకు వచ్చాడు. కూతురి పుట్టిన రోజు వేడుకలకు రావాలంటూ గురువారం గ్రామంలోని చిన్నారులను తన ఇంటికి పిలవగా 23 మంది పిల్లలొచ్చారు. అందర్నీ ఇంటి బేస్‌మెంట్‌లో బంధించాడు. హత్య కేసును వెనక్కి తీసుకుంటామని, ప్రభుత్వ ఇల్లు ఇస్తామని నచ్చజెప్పేందుకు యత్నించినా సుభాష్ వినలేదని డీజీపీ ఓపీ సింగ్ చెప్పారు. సుభాష్ జరిపిన కాల్పుల్లో 8 మంది పోలీసులకు, ఒక గ్రామస్తుడికి గాయాలయ్యాయన్నారు. ఇంటి వెనుకవైపు నుంచి తలుపు బద్దలు కొట్టి పోలీసులు లోపలికి వెళ్లారు. వారిపై సుభాష్ కాల్పులు జరపగా ఎదురుకాల్పుల్లో చనిపోయాడు. తర్వాత పిల్లలందరినీ పోలీసులు రక్షించారు. తప్పించుకోవడానికి ప్రయత్నించిన సుభాష్ భార్య రూబీను గ్రామస్తులు తీవ్రంగా కొట్టారు. గాయాలతో ఆమె ఆసుపత్రిలో మరణించింది. సుభాష్ ఇంటి నుంచి పోలీసులు తుపాకిని, రైఫిల్‌ను, రెండు డజన్ల కాట్రిడ్జ్‌లను, 25 నాటు బాంబులను స్వాధీనం చేసుకున్నారు. ఇవన్నీ చూస్తుంటే పిల్లలను బందీలుగా ఉంచుకునే ఆలోచనలో ఆ దంపతులు ఉన్నట్లు అర్థమవుతుందని పోలీసులు చెప్పారు.

రూ.2కే కిలో గోధుమపిండి

న్యూఢిల్లీ: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో తమను ఎన్నికల్లో గెలిపిస్తే పేదలకు మంచి నాణ్యతతో కూడిన కిలో గోధుమపిండి రూ.2కే ఇస్తామని, ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేస్తామని బీజేపీ హామీ ఇచ్చింది. 'ఢిల్లీ సంకల్ప్ పాత్ర'పేరుతో బీజేపీ శుక్రవారం మేనిఫెస్టో విడుదల చేసింది. కేంద్రమంత్రులు నితిన్ గడ్కరీ, ప్రకాశ్ జావడేకర్, హర్షవర్ధన్, ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడు మనోజ్ తివారీ, పలువురు ఎంపీల సమక్షంలో బీజేపీ మేనిఫెస్టోను విడుదల చేసింది. దేశ రాజధానిలో 'బుల్లెట్ రైలు'మాదిరిగా అభివృద్ధి పరుగులు తీసేలా పరిపాలన అందిస్తామని గడ్కరీ పేర్కొన్నారు. తమ ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్యుత్, నీటి సరఫరా వంటి సదుపాయాలను ఆపేలా బీజేపీ మేనిఫెస్టో ఉందని ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ పేర్కొన్నారు. 'బీజేపీకి ఓటేస్తే ఉచిత విద్యుత్, ఉచిత నీటి సరఫరా అన్నీ ఆగిపోతాయి.. ఆలోచించి ఓటేయండి'అని కేజ్రీవాల్ హెచ్చరించారు.

2 వేల కోట్ల విలువైన హెరాయిన్ పట్టివేత

అమృత్‌సర్/చండీగఢ్: పంజాబ్ పోలీసులు భారీ మత్తుపదార్థాల రవాణా ముఠాను పట్టుకున్నారు. రూ. 2 వేల కోట్లు విలువ చేసే 200 కేజీల హెరాయిన్‌ను అమృత్‌సర్ జిల్లాలోని సుల్తాన్‌విండ్ గ్రామంలో శుక్రవారం పట్టుకున్నారు. అరెస్టైన ఆరుగురిలో ఒక అఫ్గాన్ దేశస్తుడు కూడా ఉన్నాడని పోలీసులు తెలిపారు. గురువారం రాత్రి జరిగిన ఈ రైడ్‌లో హెరాయిన్‌తో పాటు 38కేజీల డెక్సోమితోర్ఫాన్, 25 కేజీల కెఫీన్‌ను పట్టుకున్నారు. వీటిని నాణ్యమైన హెరాయిన్‌ను తయారు చేసేందుకు ఉపయోగిస్తారన్నారు. హెరాయిన్ పట్టుకున్న ఇంట్లో అక్రమ ల్యాబ్ కూడా గుర్తించారు. ఈ కేసులో ఎవరు ఉన్నా వదిలేది లేదని పంజాబ్ సీఎం అమరీందర్‌సింగ్ చెప్పారు. హెరాయిన్ దొరికిన ఇల్లు గత బీజేపీ ప్రభుత్వంలో పదవి పొందిన ఓ వ్యక్తికి చెందినదని చెప్పారు. నిందితులకు డ్రగ్ డీలర్ సిమ్రాన్‌జిత్ సింగ్ సంధుకు సంబంధాలు ఉన్నట్లు తేలిందని తెలిపారు. ప్రస్తుతం సిమ్రాన్‌జిత్ సింగ్ ఇటలీ పోలీసుల అదుపులో ఉన్నాడని చెప్పారు.

ముగ్గురు జైషే ఉగ్రవాదులు హతం

జమ్మూ: పాకిస్తాన్ నుంచి సరిహద్దు దాటి వచ్చిన ఉగ్రవాదులను పోలీసులు మట్టుబెట్టారు. శుక్రవారం ముగ్గురు ఉగ్రవాదులను ఓ ట్రక్కులో తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం రావడంతో జమ్మూ నగరానికి 30కి.మీ దూరంలోని బాన్ టోల్ ప్లాజా వద్ద ట్రక్కును ఆపారు. ట్రక్కులో ఉన్న ఉగ్రవాదులు కాల్పులు ప్రారంభించడంతో పోలీసులు ఎదురుకాల్పులు జరిపారు. ఈ క్రమంలో ఓ ఉగ్రవాది మరణించగా, మరో ఇద్దరు అడవిలోకి పారిపోయారు. పోలీసులు వెంటపడి వారిని సైతం మట్టుబెట్టారు. ట్రక్కు డ్రైవర్‌ను, క్లీనర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ట్రక్కు డ్రైవర్‌ను సమీర్ దార్‌గా గుర్తించారు. గతేడాది 40 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లను పేలుడు పదార్థాలున్న ఎస్‌వీయూతో ఢీకొట్టి చంపిన జైషే మొహమ్మద్ సంస్థకు చెందిన అదిల్‌దార్‌కు సమీర్ సోదరుడు. ట్రక్కులో భారీగా పేలుడు పదార్థాలు, రైఫిల్స్ ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

కరోనాపై డబ్ల్యూహెచ్‌ఓ యుద్ధం

- అంతర్జాతీయ ఆరోగ్య అత్యవసర పరిస్థితి విధింపు
- 213కి చేరుకున్న మృతుల సంఖ్య భారత్ సహా 20 దేశాలకు వ్యాప్తి

చైనాలోని వుహాన్‌లో ముఖానికి మాస్కు ధరించిన వ్యక్తి చనిపోగా, కరోనా కారణంగా అతని వద్దకు వెళ్లేందుకు ప్రజలు భయపడ్డారు. అనంతరం వైద్య బృందం మృతదేహాన్ని తరలించింది.

బీజింగ్: చైనాలో వెలుగులోకి వచ్చి ప్రపంచ దేశాలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోన్న మహమ్మారి నావల్ కరోనా వైరస్‌పై ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌ఓ) యుద్ధం ప్రకటించింది. అంతర్జాతీయ ఆరోగ్య అత్యవసర పరిస్థితిని విధించింది. భారత్ సహా ఇప్పటికే 20 దేశాలకు ఈ వ్యాధి త్వరితగతిన విస్తరిస్తోంది. తాజాగా బ్రిటన్‌లో కూడా రెండు కేసులు నమోదయ్యాయి. ఇప్పటివరకు 213 మంది ప్రాణాలు కోల్పోయారు. దాదాపు 10 వేల మంది ఈ వైరస్ బారిన పడి చికిత్స పొందుతున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతినిధులు జెనీవాలో అత్యవసరంగా సమావేశమై గ్లోబల్ హెల్త్ ఎమర్జెన్సీని విధిస్తున్నట్టుగా ప్రకటించింది. కాగా, ఈ వైరస్ సోకిన కేరళకు చెందిన వైద్య విద్యార్థిని ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని త్రిశూర్ వైద్యులు తెలిపారు.

అంతర్జాతీయ ఆరోగ్య ఎమర్జెన్సీ అంటే..

'సూపర్' సీక్వెల్

మనం ఇన్నాళ్లు సీక్వెల్ సినిమా లెన్నో చూశాం. కానీ ఇప్పుడే సీక్వెల్‌గా ఉత్కం'టై'న మ్యాచ్‌లు చూస్తున్నాం. మొన్న షమీ చెలరేగితే... రోహిత్ అదరగొట్టేశాడు. కానీ ఆ 'టైబ్రేక్'లో వీళ్లిద్దరు సీనియర్లు. ఇప్పుడైతే శార్దుల్‌కు అంతగా అనుభవమే లేదు. పైగా భారత్‌కు మ్యాచ్‌పై పట్టులేదు. ఎవరికీ గెలుపుపై ఆశే లేదు. ఇలాంటి సమయంలో సంచలన బౌలింగ్‌తో శార్దుల్ కివీస్‌ను కట్టడి చేయడంతో స్కోర్లు సమమైంది. అంతే ఆట సూపర్‌కెళ్లింది. భారత్ చితగ్గొట్టింది. అలా రెండో సీక్వెల్ 'టైబ్రేక్'లోనూ టీమిండియానే పైచేయి సాధించింది. క్లీన్‌స్వీప్ దారిలో నాలుగో అడుగు పడింది. ఇక మిగిలిందొక్కటే!

న్యూజిలాండ్‌పై 20వ ఓవర్‌ను చూస్తే... వారెవ్వా శార్దుల్ అనే అంటాం. చివరకు 'సూపర్' ఫలితాన్ని చూస్తే మాత్రం ఏ కాస్త కనికరమున్నా... అయ్యో పాపం కివీస్ అనిపిస్తుంది. ఎందుకంటే వరుసగా ఆఖరిదాకా వచ్చి ఓడిపోయిందని జాలనిపిస్తుంది. ఇలా సూపర్ ఓవర్లో పదేపదే ఓడితే మాత్రం కచ్చితంగా ఎవరైన పాపమనే అంటారు. గత పదేళ్లుగా ఆరు మ్యాచ్‌ల్లో (ఒక వన్డే కలుపుకొని) సూపర్‌దాకా వెళ్లిన న్యూజిలాండ్ గెలుపును మాత్రం సాకారం చేసుకోలేకపోయింది. చివరి ఓవర్లో 7 పరుగులు చేయాల్సి ఉండగా...ఏకంగా 4 వికెట్లు కోల్పోయి 6 పరుగులే చేయడంతో స్కోర్లు సమమయ్యాయి.

- నాలుగో టి20లో స్కోర్లు సమం
- మళ్లీ సూపర్ ఓవర్లో భారత్ గెలుపు
- శార్దుల్ సంచలన బౌలింగ్
- మనీశ్ పాండే అర్ధసెంచరీ
- అయ్యోపాపం కివీస్!

వెల్లింగ్టన్: గత మ్యాచ్ టై... ఈ మ్యాచ్ టై... అప్పుడు సూపర్, ఇప్పుడు సూపర్... అయినా విన్నర్ మారలేదు. కివీస్ తలరాత కూడా మారలేదు. మూడో మ్యాచ్‌లో ఆఖరి బంతులు భారత్‌కు అనూహ్య గెలుపునివ్వగా... ఈ మ్యాచ్‌లో శార్దుల్ అద్భుత బౌలింగ్ ప్రదర్శన భారత్ గెలిచేందుకు ఊపిరి పోసింది. శుక్రవారం కూడా ఉత్కంఠరేపిన ఈ మ్యాచ్‌లో భారత్ సూపర్ ఓవర్‌లో గెలిచింది. మొదట భారత్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 165 పరుగులు చేసింది. మనీశ్ పాండే (36 బంతుల్లో 50 నాటౌట్; 3 ఫోర్లు) ఆదుకున్నాడు. సోధి 3, బెన్నెట్ 2 వికెట్లు తీశారు. తర్వాత లక్ష్యఛేదనకు దిగిన న్యూజిలాండ్ కూడా 20 ఓవర్లలో 7 వికెట్లకు సరిగ్గా 165 పరుగులే చేసింది. దీంతో మ్యాచ్ టై కావడంతో సూపర్ ఓవర్ తప్పలేదు. మన్రో (47 బంతుల్లో 64; 6 ఫోర్లు, 3 సిక్సర్లు), సీఫెర్ట్ (39 బంతుల్లో 57; 4 ఫోర్లు, 3 సిక్సర్లు) రాణించారు. శార్దుల్‌కు 2 వికెట్లు దక్కాయి.

ఆదుకున్న పాండే

మళ్లీ టాస్ గెలిచిన న్యూజిలాండ్ ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో మొదట బ్యాటింగ్‌కు దిగిన భారత ఇన్నింగ్స్ రాహుల్ (26 బంతుల్లో 39; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరిపించాడు. అతనితో ఇన్నింగ్స్ ఆరంభించిన సంజూ సామ్సన్ (8) సహా కెప్టెన్ కోహ్లి (11), శ్రేయస్ అయ్యర్ (1), శివమ్ దూబే (12) అంతా విఫలం కాగా... టీమిండియా 12 ఓవర్లు ముగియక ముందే 88 పరుగులకే 6 వికెట్లను కోల్పోయింది. ఈ దశలో మనీశ్ పాండే చేసిన ఫిఫ్టీనే 'శతక'మంత సాయం చేసింది. టెయిలెండర్లు శార్దుల్ (15 బంతుల్లో 20; 2ఫోర్లు), సైనీ (11 నాటౌట్) అండతో జట్టుకు గౌరవప్రదమైన స్కోరు అందించాడు.

మన్రో, సీఫెర్ట్... ఫిఫ్టీ-ఫిఫ్టీ

ఏమంత కష్టం కానీ లక్ష్యఛేదనకు దిగిన న్యూజిలాండ్ 'పవర్ ప్లే'లో గప్టిల్ (4) వికెట్ కోల్పోయింది. మన్రో, సీఫెర్ట్‌ల రెండో వికెట్ భాగస్వామ్యం 74 పరుగులకు చేరడం, జట్టు స్కోరు వందకు సమీపించడంతో భారత్ ఆశలు ఆవిరయ్యాయి. ఎట్టకేలకు రనౌట్ రూపంలో మన్రో, పరుగు వ్యవధిలో బ్రూస్ (0) ఔట్ కావడంతో చిగురించిన ఆశలపై సీఫెర్ట్, టేలర్ (18 బంతుల్లో 24; 2 ఫోర్లు) నీళ్లుచల్లారు. 19 ఓవర్లలో కివీస్ స్కోరు 159/3. అప్పటికే సీఫెర్ట్ అర్ధసెంచరీ పూర్తయ్యింది.

మనీశ్ పాండే షాట్

టేలర్ ఔట్ - సీఫెర్ట్ రనౌట్

ఇంకా చేతిలో 7 వికెట్లుండటం... 6 బంతుల్లో విజయానికి 7 పరుగులు అవసరముండటంతో కివీస్ విజయం దాదాపు ఖాయమైంది. కానీ చివరి ఓవర్ తొలి బంతి నుంచే గెలుపు మలుపు తీసుకుంది. శార్దుల్ వేసిన ఫుల్‌లెంత్ డెలివరీని లాఫ్టెడ్ షాట్ ఆడగా అది మిడ్ వికెట్‌లో అయ్యర్ చేతికి చిక్కింది. క్రీజ్‌లోకి వచ్చిన మిచెల్ వస్తూనే బౌండరీ కొట్టాడు. ఇక మిగిలింది 3 పరుగులైతే 4 బంతులున్నాయి. మూడో బంతి మిచెల్‌ను బీట్ అయి కీపర్ చేతుల్లోకి వెళ్లగా పరుగందుకున్న సీఫెర్ట్ వచ్చే లోపే రాహుల్ వికెట్లకు గిరాటేయడంతో అతను రనౌటయ్యాడు. ఉత్కంఠ ఉన్నపళంగా పెరిగింది. నాలుగో బంతికి ఓ పరుగుతీశాడు. ఐదో బంతిని మిచెల్ (4) గాల్లోకి లేపాడు. మిడాఫ్‌లో ఉన్న దూబే క్యాచ్ పట్టడంతో అవుటయ్యాడు. ఇక ఆఖరి బంతికి 2 పరుగులు చేయాల్సి వుండగా సాన్‌ట్నర్ ఒక పరుగు మాత్రమే పూర్తి చేశాడు. రెండో పరుగు తీసేందుకు ప్రయత్నించగా డీప్ పాయింట్‌లో ఉన్న సామ్సన్ ఎలాంటి పొరపాటు చేయకుండా బంతిని కీపర్‌కు అందించాడు. రెప్పపాటు వ్యవధిలోనే రాహుల్ వికెట్లను కూల్చేయడంతో సాన్‌ట్నర్ (2) రనౌట్. మ్యాచ్ టై అయ్యింది. ఇప్పటికే సిరీస్‌ను గెలుచుకున్న భారత్ ఈ మ్యాచ్‌లో రోహిత్, జడేజా, షమీలకు విశ్రాంతినిచ్చి సంజూ సామ్సన్, వాషింగ్టన్ సుందర్, సైనీలకు అవకాశమిచ్చింది. కానీ ఈ ముగ్గుర్లో ఎవరూ రాణించలేదు. కివీస్ కెప్టెన్ విలియమ్సన్ కూడా గాయంతో మ్యాచ్‌కు దూరమయ్యాడు.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: రాహుల్ (సి)సాన్‌ట్నర్ (బి) సోధి 39; సామ్సన్ (సి) సాన్‌ట్నర్ (బి) కుగ్‌లీన్ 8; కోహ్లి (సి) సాన్‌ట్నర్ (బి) బెన్నెట్ 11; అయ్యర్ (సి) సీఫెర్ట్ (బి) సోధి 1; దూబే (సి) బ్రూస్ (బి) సోధి 12; పాండే నాటౌట్ 50; సుందర్ (బి) సాన్‌ట్నర్ 0; శార్దుల్ (సి) సౌతీ (బి) బెన్నెట్ 20; చహల్ (సి) సీఫెర్ట్ (బి) సౌతీ 1; సైనీ నాటౌట్ 11; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 165. వికెట్ల పతనం:** 1-14, 2-48, 3-52, 4-75, 5-84, 6-88, 7-131, 8-143. **బౌలింగ్:** సౌతీ 4-0-28-1, కుగ్‌లీన్ 4-0-39-1, సాన్‌ట్నర్ 4-0-26-1, బెన్నెట్ 4-0-41-2, సోధి 4-0-26-3.

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: గప్టిల్ (సి) రాహుల్ (బి) బుమ్రా 4; మన్రో రనౌట్ 64; సీఫెర్ట్ రనౌట్ 57; బ్రూస్ (బి) చహల్ 0; టేలర్ (సి) అయ్యర్ (బి) ఠాకూర్ 24; మిచెల్ (సి) దూబే (బి) ఠాకూర్ 4; సాన్‌ట్నర్ రనౌట్ 2; కుగ్‌లీన్ నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 165. వికెట్ల పతనం:** 1-22, 2-96, 3-97, 4-159, 5-163, 6-164, 7-165. **బౌలింగ్:** శార్దుల్ 4-0-33-2, సైనీ 4-0-29-0, బుమ్రా 4-0-20-1, చహల్ 4-0-38-1, సుందర్ 2-0-24-0, దూబే 2-0-14-0.

'ప్రత్యర్థి ఎంత బాగా ఆడుతున్నా చివరి వరకు ప్రశాంతంగా ఉండి పోరాడాలని ఈ రెండు మ్యాచ్‌లు నాకు నేర్పించాయి. ఇంతకంటే అద్భుతమైన మ్యాచ్‌లను ఆశించలేం. గతంలో ఎప్పుడూ సూపర్ ఓవర్ ఆడని మేం ఇప్పుడు వరుసగా రెండు గెలిచాం. సూపర్ ఓవర్లో సామ్సన్‌తో ఓపెనింగ్ చేయించాలనుకున్నా నా అనుభవం పనికొస్తుందని రాహుల్ చెప్పడంతో నేనే బ్యాటింగ్‌కు వచ్చాను. మా ప్రదర్శన పట్ల గర్వపడుతున్నా'

-విరాట్ కోహ్లి, భారత కెప్టెన్

సూపర్ ఓవర్ సాగిందిలా...

న్యూజిలాండ్: 13/1

భారత బౌలర్: బుమ్రా

బంతి	బ్యాట్స్‌మన్	పరుగులు
0.1	సీఫెర్ట్	2
0.2	సీఫెర్ట్	4
0.3	సీఫెర్ట్	2
0.4	సీఫెర్ట్	అవుట్
0.5	మన్రో	4
0.6	మన్రో	1

భారత్: 16/1

న్యూజిలాండ్ బౌలర్: సౌతీ

బంతి	బ్యాట్స్‌మన్	పరుగులు
0.1	రాహుల్	6
0.2	రాహుల్	4
0.3	రాహుల్	అవుట్
0.4	కోహ్లి	2
0.5	కోహ్లి	4

మళ్లీ ఓడిన సింధు

- హంటర్స్ ప్లేయర్‌పై తై జు యింగ్ గెలుపు
- ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్

సాక్షి, హైదరాబాద్: సొంత గడ్డపై హైదరాబాద్ హంటర్స్ ప్లేయర్ పీవీ సింధు మరోసారి నిరాశ పరిచింది. మహిళల సింగిల్స్‌లో సింధు 15-11, 13-15, 9-15తో తై జు యింగ్ (బెంగళూరు రాప్టర్స్) చేతిలో ఓడింది. ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్ (పీబీఎల్) సీజన్-5లో భాగంగా శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ హంటర్స్ 0-3తో బెంగళూరు రాప్టర్స్ చేతిలో ఓడింది. తొలి గేమ్‌లో సత్తా చాటిన సింధు... తర్వాతి రెండు గేమ్‌ల్లో విఫలమై పరాజయం పాలైంది. తొలుత జరిగిన పురుషుల డబుల్స్‌లో బెన్ లేన్-వ్లాదిమిర్ ఇవనోవ్ (హైదరాబాద్) ద్వయం 13-15, 15-9, 12-15తో పెంగ్ సూన్ చాన్-రియాన్ అగుంగ్ సపుర్తో (బెంగళూరు) జోడీ చేతిలో ఓడింది. అనంతరం జరిగిన పురుషుల తొలి సింగిల్స్‌లో 'ట్రంప్ కార్డు'తో ఆడిన హైదరాబాద్ ప్లేయర్ సౌరభ్ వర్మ 12-15, 15-10, 6-15తో బ్రైస్ లెవెర్డెజ్ (బెంగళూరు) చేతిలో ఓడాడు. పీబీఎల్ నిబంధనల ప్రకారం 'ట్రంప్ కార్డు' వాడిన ఆటగాడు ఓడితే... అతని జట్టుకు ఒక పాయింట్‌ను పెనాల్టీగా విధిస్తారు. దాంతో హైదరాబాద్ (-1)-2తో వెనుకబడింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో 'ట్రంప్ కార్డు'తో బరిలో దిగిన పెంగ్ సూన్ చాన్-యోమ్ హే వోన్ (బెంగళూరు) జోడీ 13-15, 11-15తో వ్లాదిమిర్ ఇవనోవ్-సిక్కిరెడ్డి (హైదరాబాద్) ద్వయం చేతిలో ఓడింది. చివరగా జరిగిన పురుషుల రెండో సింగిల్స్‌లో డారెన్ లియూ (హైదరాబాద్) 11-15, 6-15 తో సాయి ప్రణీత్ (బెంగళూరు)చేతిలో ఓడాడు.

వారెవ్వా థీమ్

థీమ్

ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్లో ప్రవేశం ● ఈ ఘనత సాధించిన తొలి ఆస్ట్రియా ఆటగాడు
సెమీస్‌లో జ్వెరెవ్‌పై గెలుపు ● ఆదివారం జరిగే తుది పోరులో జొకోవిచ్‌తో 'ఢీ'

పెద్దగా అంచనాలు లేవు... గ్రాండ్ స్లామ్ హార్డ్ కోర్టులపై గత రికార్డు చూసుకున్నా క్వార్టర్స్ దాటని ఆటతీరు... ఆస్ట్రేలియన్ ఓపెన్ రెండో రౌండ్‌లో అన్‌సీడెడ్ ఆటగాడు అలెక్స్ బోల్ట్‌పై ఐదు సెట్ల పాటు పోరాడి అతికష్టం మీద గెలుపు ఇలా చెమటోడుస్తూ సాగిన డొమినిక్ థీమ్ ఏ దశలోనూ టైటిల్ ఫేవరెట్‌గా కనబడలేదు. అయితే క్వార్టర్స్‌లో ప్రపంచ నంబర్ వన్ రాఫెల్ నాదల్‌ను ఓడించి అందరి కళ్లను తన వైపు తిప్పుకున్న అతను... తాజాగా సెమీస్ పోరులో జర్మనీ స్టార్ అలెగ్జాండర్ జ్వెరెవ్‌పై నాలుగు సెట్లలో విజయం సాధించి తొలి గ్రాండ్ స్లామ్ టైటిల్‌కు అడుగు దూరంలో నిలిచి వారెవ్వా అనిపించాడు. ఆదివారం జరిగే పురుషుల ఫైనల్‌లో నొవాక్ జొకోవిచ్‌తో అమీతుమీకి థీమ్ సిద్ధమయ్యాడు.

జ్వెరెవ్

మెల్‌బోర్న్: రాడ్ లేవర్ ఎరీనాలో కిక్కిరిసిన జనం మధ్య మరోసారి మూడు గంటలకు పైగా సాగిన పోరులో ఐదో సీడ్ డొమినిక్ థీమ్ మరో అద్భుత విజయం సాధించాడు. శుక్రవారం జరిగిన ఆస్ట్రేలియన్ ఓపెన్ పురుషుల రెండో సెమీఫైనల్ మ్యాచ్‌లో థీమ్ 3-6, 6-4, 7-6 (7/3), 7-6 (7/4)తో అలెగ్జాండర్ జ్వెరెవ్(జర్మనీ)ను చిత్తు చేశాడు. దాంతో తొలిసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్‌కు అర్హత సాధించాడు. ఈ ఘనత సాధించిన తొలి ఆస్ట్రియా ఆటగాడిగా నిలిచాడు. ఓవరాల్‌గా థీమ్‌కు ఇది మూడో గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఫైనల్ ఎంట్రీ కావడం విశేషం. 2018, 2019లలో ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్‌కు చేరి నాదల్ చేతిలో ఓడాడు. ఆదివారం జరిగే ఫైనల్ పోరులో 17వ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌పై కన్నేసిన జొకోవిచ్‌తో ఫైట్‌కు థీమ్ సిద్ధమయ్యాడు.

నేడు మహిళల సింగిల్స్ ఫైనల్
గార్బిన్ ముగురుజా (స్పెయిన్)
X
సోఫియా కెనిన్ (అమెరికా)
మధ్యాహ్నం 2 గంటల నుంచి సోనీ సిక్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

తొలి సెట్‌ను కోల్పోయినా...

3 గంటల 42 నిమిషాల పాటు సాగిన ఈ పోరును థీమ్ తడబడుతూ ఆరంభించాడు. తొలి సెట్ మొదటి గేమ్‌లోనే తన సర్వీస్‌ను కోల్పోయాడు. అయితే ఆ మరుసటి గేమ్‌లో ప్రత్యర్థి జ్వెరెవ్ సర్వీస్‌ను బ్రేక్ చేసి స్కోరును 1-1తో సమం చేశాడు. అయితే ఎనిమిదో గేమ్‌లో థీమ్ సర్వీస్‌ను బ్రేక్ చేసిన జ్వెరెవ్... అనంతరం తన గేమ్‌ను కాపాడుకోవడంతో 6-3తో తొలి సెట్‌ను గెల్చుకున్నాడు. ఇక రెండో సెట్‌లో దూకుడు కనబర్చిన 26 ఏళ్ల థీమ్ గ్రౌండ్ స్ట్రోక్ షాట్లతో జ్వెరెవ్‌ను ముప్పతిప్పలు పెట్టాడు. అంతేకాకుండా అతడి సర్వీస్‌ను రెండు సార్లు బ్రేక్ చేసిన థీమ్ 6-4తో సెట్‌ను సొంతం చేసుకోవడంతో... రెండు సెట్‌లు ముగిసే సరికి ఇరు ఆటగాళ్లు 1-1తో సమంగా నిలిచారు. కీలకమైన మూడో సెట్ టైబ్రేక్‌కు దారితీయగా... అక్కడ క్రాస్ కోర్టు, బ్యాక్ హ్యాండ్ షాట్లతో హోరెత్తించిన థీమ్... టై బ్రేక్‌ను సొంతం చేసుకొని తొలిసారి మ్యాచ్‌లో 2-1తో ఆధిక్యంలో నిలిచాడు. నాలుగో సెట్‌లో ఇద్దరు కూడా తమ సర్వీస్‌లను 12 గేమ్‌ల పాటు నిలుపుకోవడంతో... సెట్ మరోసారి టై బ్రేక్‌కు దారితీసింది. ఇక్కడ వరుసగా మూడు అనవసర తప్పిదాలు చేసిన జ్వెరెవ్ మూడు పాయింట్లను ప్రత్యర్థికి కోల్పోయాడు. ఈ ఆధిక్యాన్ని తనకు అనుకూలంగా మార్చుకున్న థీమ్ ఫోర్ హ్యాండ్ విన్నర్‌తో టై బ్రేక్‌ను గెలుచుకోవడంతో పాటు తుది పోరుకు అర్హత సాధించాడు. థీమ్ ఈ మ్యాచ్‌లో 10 ఏస్‌లు సంధించి... నాలుగు డబుల్ ఫాల్ట్స్ చేయగా... జ్వెరెవ్ 16 ఏస్‌లు కొట్టి మూడు డబుల్ ఫాల్ట్స్ చేశాడు. మ్యాచ్ ఆసాంతం జ్వెరెవ్ 200 కి.మీ పైబడిన వేగంతో సర్వీస్ చేసినా... కీలక సమయంలో చేసిన అనవసర తప్పిదాలతో మ్యాచ్‌ను దూరం చేసుకున్నాడు.

మహిళల డబుల్స్ విజేత మ్లదెనోవిచ్-బబోస్ జోడీ

మహిళల డబుల్స్ విభాగంలో చాంపియన్స్‌గా రెండో సీడ్ క్రిస్టినా మ్లదెనోవిచ్ (ఫ్రాన్స్)- టిమియా బబోస్ (హంగేరీ) జోడీ నిలిచింది. శుక్రవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో మ్లదెనోవిచ్-బబోస్ జంట 6-2, 6-1తో టాప్ సీడ్ సు వి హెయ్ (చైనీస్ తైపీ)-బార్బోరా స్ట్రికోవా (చెక్ రిపబ్లిక్) ద్వయంపై వరుస సెట్లలో విజయం సాధించింది. మ్లదెనోవిచ్-బబోస్ ద్వయానికి ఇది మూడో గ్రాండ్ స్లామ్ టైటిల్ కావడం విశేషం.

న్యూజిలాండ్ 'ఎ'కు భారీ ఆధిక్యం

క్రైస్ట్‌చర్చ్: భారత్ 'ఎ'తో జరుగుతున్న తొలి అనధికారిక టెస్టులో న్యూజిలాండ్ 'ఎ' బ్యాట్స్‌మెన్ చెలరేగారు. రెండో రోజు శుక్రవారం ఆట ముగిసే సమయానికి కివీస్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 5 వికెట్ల నష్టానికి 385 పరుగులు చేసింది. డేన్ క్లీవర్ (194 బంతుల్లో 111; 16 ఫోర్లు) సెంచరీ సాధించగా, విల్ యంగ్ (54), రచిన్ రవీంద్ర (47) రాణించారు. న్యూజిలాండ్‌కు ఇప్పటికే 169 పరుగుల ఆధిక్యం లభించింది.

రవీందర్‌పై నాలుగేళ్ల నిషేధం

న్యూఢిల్లీ: భారత రెజ్లింగ్‌కు మరో డోపింగ్ మచ్చ అంటుకుంది. రెజ్లర్ రవీందర్ కుమార్ డోప్ టెస్టులో దొరికిపోయాడు. గతేడాది అండర్-23 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో రజతం నెగ్గిన అతనిపై జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) 4 ఏళ్ల నిషేధం విధించింది. నమూనాలను పరీక్షించగా నిషేధిత నొరండ్రోస్టెరాన్ తీసుకున్నట్లు తేలింది. గత ఏడాది మే 14 నుంచి ఈ నిషేధం అమల్లోకి వస్తుందని 'నాడా' వర్గాలు తెలిపాయి.

భారత్ సెమీస్ ప్రత్యర్థి పాకిస్తాన్

- అండర్-19 జట్ల మధ్య మంగళవారం పోరు
- క్వార్టర్స్‌లో అఫ్గాన్‌పై పాక్ గెలుపు

బెనోని: అండర్-19 ప్రపంచకప్ సెమీఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ భారత్ ప్రత్యర్థి ఖరారైంది. ఈ నెల 4న జరిగే తొలి సెమీస్‌లో టీమిండియాతో పాకిస్తాన్ తలపడుతుంది. శుక్రవారం జరిగిన చివరి క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో పాక్ 6 వికెట్ల తేడాతో అఫ్గానిస్తాన్‌పై ఘన విజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన అఫ్గాన్ 49.1 ఓవర్లలో 189 పరుగులకు ఆలౌటైంది. ఫర్హాన్ జఖీల్ (40) టాప్ స్కోరర్‌గా నిలవగా ఆమిర్ ఖాన్‌కు 3 వికెట్లు దక్కాయి. అనంతరం పాక్ 41.1 ఓవర్లలో 4 వికెట్లకు 190 పరుగులు చేసి విజయాన్నందుకుంది. ఈ మ్యాచ్‌తోనే అరంగేట్రం చేసిన మొహమ్మద్ హురైరా (76 బంతుల్లో 64; 8 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీ సాధించి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు. హురైరాను అఫ్గాన్ బౌలర్ నూర్ అహ్మద్ 'మన్కడింగ్' ద్వారా రనౌట్ చేయడం ఈ మ్యాచ్‌లో వివాదం రేపింది.

భారత మహిళల శుభారంభం

ఇంగ్లండ్‌పై 5 వికెట్లతో విజయం

హర్మన్

కాన్‌బెర్రా: ముక్కోణపు టి20 టోర్నీలో భారత మహిళల జట్టు విజయంతో బోణీ చేసింది. శుక్రవారం ఇక్కడ జరిగిన తొలి పోరులో భారత్ 5 వికెట్ల తేడాతో ఇంగ్లండ్‌పై విజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 147 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్', కెప్టెన్ హీతర్ నైట్ (44 బంతుల్లో 67; 8 ఫోర్లు, 2 సిక్సర్లు) అర్ధ సెంచరీతో చెలరేగగా, ట్యామీ బీమాంట్ (27 బంతుల్లో 37; 4 ఫోర్లు, 1 సిక్స్) రాణించింది. భారత బౌలర్లలో రాజేశ్వరి గైక్వాడ్, దీప్తి శర్మ, శిఖా పాండే తలా 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం భారత్ 19.3 ఓవర్లలో 5 వికెట్లకు 150 పరుగులు చేసి నెగ్గింది. ఓపెనర్ షఫాలీ వర్మ (25 బంతుల్లో 30; 4 ఫోర్లు), జెమీమా రోడ్రిగ్స్ (20 బంతుల్లో 26; 4 ఫోర్లు) ఫర్వాలేదనిపించగా... కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (34 బంతుల్లో 42 నాటౌట్; 5 ఫోర్లు, 1 సిక్స్) చివరి వరకు నిలిచి గెలిపించింది. ఆఖరి 4 బంతుల్లో విజయానికి 4 పరుగులు కావాల్సి ఉండగా భారీ సిక్సర్‌తో హర్మన్ మ్యాచ్ ముగించింది.

జింబాబ్వే, శ్రీలంక టెస్టు 'డ్రా'

హరారే: జింబాబ్వే, శ్రీలంక జట్ల మధ్య జరిగిన రెండో టెస్టు 'డ్రా'గా ముగిసింది. 361 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన లంక ఆట ముగిసే సమయానికి తమ రెండో ఇన్నింగ్స్‌లో 3 వికెట్లు కోల్పోయి 204 పరుగులు చేసింది. కుశాల్ మెండిస్ (233 బంతుల్లో 116 నాటౌట్; 13 ఫోర్లు, 1 సిక్స్) శతకంతో లంకను ఆదుకున్నాడు. రోజంతా శ్రమించినా జింబాబ్వే 3 వికెట్లు మాత్రమే తీయగలిగింది. తొలి టెస్టు నెగ్గిన లంక 1-0తో సిరీస్‌ను సొంతం చేసుకుంది.

సీఏసీలో ఆర్పీ సింగ్

ముంబై: బీసీసీఐ నియమించిన క్రికెట్ సలహా కమిటీ (సీఏసీ)లో మూడో సభ్యుడిగా మాజీ పేసర్ రుద్ర ప్రతాప్ (ఆర్పీ) సింగ్‌ను ఎంపిక చేశారు. ఈ కమిటీలో ఇప్పటికే మాజీ ఆటగాళ్లు మదన్ లాల్, సులక్షణా నాయక్ సభ్యులుగా ఉన్నారు. మూడో సభ్యుడిగా గతంలో గౌతమ్ గంభీర్‌ను ఎంపిక చేయాలని అనుకున్నా...అతను పార్లమెంట్ సభ్యుడిగా కొనసాగుతుండటంతో నిబంధనల ప్రకారం అనర్హుడని బోర్డు అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ ప్రకటించాడు. భారత సెలక్షన్ కమిటీలో ఇద్దరు సభ్యులను ఎంపిక చేసేందుకు ఈ సీఏసీ త్వరలోనే ఇంటర్వ్యూలు నిర్వహిస్తుంది. భారత్ తరపున 14 టెస్టులు, 58 వన్డేలు, 10 టి20లు ఆడిన లెఫ్టార్మ్ పేసర్ ఆర్పీ సింగ్ 2007లో టీమిండియా టి20 ప్రపంచకప్ గెలిచిన జట్టులో కీలక సభ్యుడు.

సాక్షి బిజినెస్

శనివారం
1-2-2020

WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
190 ▼	74 ▼
40,723	11,962

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (శ్రీలంక రెండు రాత్రి 11.30కి)

నాస్‌డాక్	9,174	▼ 124
డోజోన్స్	28,375	▼ 485
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,286	▼ 96
డాక్స్	12,982	▼ 175
షాంఘై (23న ముగింపు)	2,977	▼ 84
నికాయ్	23,205	▲ 227

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	71.06	72.05
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	92.52	94.93
€	యూరో	ఎస్‌బీఐ	77.81	79.98
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	64.69	66.53
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	47.25	48.96
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	51.89	53.21
SAR	సౌదీ రియాల్	ఫామ్‌కుక్	18.24	19.84
UAE D	యూఏఈ దిర్హామ్	ఫామ్‌కుక్	18.96	19.96
¥	చైనా యువాన్	ఫామ్‌కుక్	9.66	11.07

'లోటు' పెరిగినా.. వృద్ధికే ఓటు!

ఆర్థిక సర్వే: 2019-20 చెబుతోంది ఇదే...

ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడమే ప్రథమ కర్తవ్యం

భారత్‌ను తయారీ కేంద్రంగా చేయాలి • దాంతో పెద్ద ఎత్తున ఉపాధి
ప్రభుత్వరంగ బ్యాంకులను పటిష్టం చేయాలి • ఆహార సబ్సిడీలను తగ్గించుకోవాలి
మౌలికంపై భారీ పెట్టుబడులు అవసరం • వృద్ధి క్షీణత ముగిసినట్టే...
2020-21లో వృద్ధి రేటు 6-6.5 శాతం మధ్య ఉండొచ్చని అంచనా

న్యూఢిల్లీ: దేశ జీడీపీ వృద్ధి రేటు వచ్చే ఆర్థిక సంవత్సరం 2020-21లో 6-6.5 శాతానికి పుంజుకోవచ్చని 2019-20 ఆర్థిక సర్వే అంచనా వేసింది. ఇందుకోసం ద్రవ్యలోటు లక్ష్యాల విషయంలో పట్టువిడుపుగా వెళ్లాలని.. ప్రజలు ఓటుతో ఇచ్చిన బలమైన తీర్పును సంస్కరణలను వేగంగా అమలు చేసేందుకు వినియోగించుకోవాలని.. భారత్‌ను ప్రపంచానికి తయారీ కేంద్రంగా (అసెంబుల్ ఇన్ ఇండియా ఫర్ వరల్డ్) మార్చాలని.. ఆహార సబ్సిడీలను తగ్గించుకోవాలని.. నాణ్యమైన మౌలిక సదుపాయాలకు భారీగా పెట్టుబడులు అవసరమని.. సంపద, ఉద్యోగ సృష్టికర్తలు అయిన వ్యాపారస్తులను గౌరవంగా చూడాలనే సూచనలు కేంద్ర ప్రభుత్వానికి చేసింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2020-21 ఆర్థిక బడ్జెట్‌ను శనివారం పార్లమెంట్‌చు సమర్పించనున్న విషయం తెలిసిందే. దీనికి ఒక రోజు ముందు శుక్రవారం ఆర్థిక సర్వే నివేదికను ఆమె పార్లమెంటు ముందుంచారు.

ద్రవ్యలోటు పరంగా..

2019-20 ఆర్థిక సంవత్సరానికి జీడీపీలో ద్రవ్యలోటు 3.3 శాతానికి పరిమితం చేస్తామని గత బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి సీతారామన్ పేర్కొన్నారు. కానీ, కార్పొరేట్ పన్ను కోత, ఇతర పన్నుల వసూళ్లు తక్కువగా ఉండడం వంటి పరిస్థితుల నేపథ్యంలో ద్రవ్యలోటు 3.8 శాతానికి చేరుతుందన్నది నిపుణుల అంచనాగా ఉంది. అయితే, ఇప్పుడున్న పరిస్థితుల్లో వృద్ధి రేటును బలంగా పైకి తీసుకురావడమే ప్రాధాన్యమైన అంశంగా ఆర్థిక సర్వే అభిప్రాయపడింది. ఇందుకోసం ద్రవ్యలోటు లక్ష్య సవరణను పరిశీలించొచ్చని సూచించింది. రూ.1.84 లక్షల కోట్ల మేర ఉన్న ఆహార సబ్సిడీలను తగ్గించుకోగలిగితే ద్రవ్యలోటు విషయంలో ప్రభుత్వానికి ఎంతో వెసులుబాటు లభిస్తుందని పేర్కొంది. ఆర్థిక వ్యవస్థ పుంజుకున్నాక ప్రభుత్వం తన ఖర్చులను స్థిరీకరించుకోవచ్చని, పలు దేశాలు గతంలో ఇదే మార్గాన్ని అనుసరించాయని పేర్కొంది.

బడ్జెట్‌కు తుదిరూపు అనంతరం ఉన్నతాధికారులతో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

మౌలిక సదుపాయాలపై భారీ పెట్టుబడులు..

రెవెన్యూ వ్యయాలను తగ్గించుకోవడంతోపాటు మూలధన వ్యయాలను పెంచుకోవడం ద్వారా ఆస్తులను సృష్టించుకోవాలని ఆర్థిక సర్వే సూచించింది. పెద్ద ఎత్తున పెట్టుబడుల ద్వారా ఆర్థిక వృద్ధి సాధ్యమవుతుందని పేర్కొంది. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థల పునరుద్ధరణకు సాయంగా నిలవడం ద్వారా పెట్టుబడుల ఆధారిత వృద్ధి సాధ్యపడుతుందని అంచనా వేసింది. వ్యాపార నిర్వహణను సులభంగా చేసేందుకు వీలుగా.. పోర్టుల్లో ఎగుమతులు పెంచేందుకు రెడ్ టేపిజం (అధిక నియంత్రణలతో కూడిన విధానాలు)ను తొలగించాలని సూచించింది. 2024-25 నాటికి 5 ట్రిలియన్ డాలర్ల (సుమారు రూ.350 లక్షల కోట్లు) ఆర్థిక వ్యవస్థ స్థాయికి చేరేందుకు మౌలిక రంగంలో కనీసం 1.4 లక్షల కోట్ల డాలర్ల పెట్టుబడులు అవసరమని తెలిపింది. ''మౌలిక రంగంలో పెట్టుబడులు ఆర్థిక వ్యవస్థకు ఎంతో అవసరం. విద్యుత్ కోతలు, చాలీ చాలని రవాణా సదుపాయాలు అధిక వృద్ధి సాధన దిశగ అవరోధంగా నిలుస్తాయి. సాఫీగా, వేగవంతమైన వృద్ధి కోసం భారత్ నాణ్యమైన సదుపాయాల కల్పనకు సకాలంలో తగినన్ని పెట్టుబడులు పెట్టాలి'' అని ఆర్థిక సర్వే తెలియజేసింది.

బలమైన సంస్కరణలు కావాలి

2019-20లో జీడీపీ అంచనా వృద్ధి రేటు 5 శాతం నుంచి 2020-21లో 6-6.5 శాతానికి బలంగా పుంజుకుంటుందని తాజా ఆర్థిక సర్వే అంచనా వేసింది. సరైన మోతాదులో సంస్కరణలు, ప్రభుత్వ పెట్టుబడులతో ఈ లక్ష్యం సాధించతగినదే. ఆర్థిక సర్వే అన్నది యూనియన్‌బడ్జెట్‌కు ముందస్తు సూచిక. కనుక బలమైన సంస్కరణల చర్యలను ఈసారి బడ్జెట్‌లో అంచనా వేస్తున్నాం.

– చంద్రజిత్ బెనర్జీ, సీఐఐ డైరెక్టర్ జనరల్

6-6.5 శాతం వృద్ధి రేటు సవాలే...

డిమాండ్ సైకిల్ ఇంకా పుంజుకోవాల్సి ఉంది. కరోనా వైరస్ ప్రభావం భారత్ సహా అంతర్జాతీయ వృద్ధిపై ప్రభావం చూపిస్తుంది. ఇందుకు గతంలో సార్స్ వైరస్ ప్రభావాలను పరిగణనలోకి తీసుకుని చూడాలి.

– రణేన్ బెనర్జీ, పీడబ్ల్యూసీ ఇండియా

రికవరీ ఆవశ్యకతను చెప్పింది..

బలమైన ఆర్థిక మందగమనం నుంచి వ్యవస్థ రికవరీ అయ్యేందుకు బలమైన సంస్కరణలను ప్రభుత్వం చేపట్టాల్సిన అవసరాన్ని సర్వే ప్రస్తావించింది.

–నిరంజన్ హిరనందాని, అసోచామ్ ప్రెసిడెంట్

ప్రభుత్వరంగ బ్యాంకులు పటిష్టం కావాలి..

అధిక మార్కెట్ వాటా కలిగిన ప్రభుత్వరంగ బ్యాంకులు (పీఎస్‌బీలు) దేశ ఆర్థిక వ్యవస్థలో పరిణామ పరంగా చిన్నగా ఉండడాన్ని సర్వే ప్రస్తావించింది. దేశ ఆర్థిక వ్యవస్థ స్థాయికి వాటిని పటిష్టం చేయాల్సిన అవసరాన్ని ప్రస్తావించింది. పీఎస్‌బీలు మరింత సమర్థవంతంగా మారడం ద్వారా ఆర్థిక వృద్ధికి చేయూతగా నిలవాల్సిన అవసరాన్ని తెలియజేసింది. ప్రభుత్వరంగ బ్యాంకులు సమర్థంగా లేకపోతే అది ఆర్థిక వ్యవస్థను వినూత్నమైన అవకాశాలను అందుకోలేని వైకల్యంగా మార్చేస్తుందని హెచ్చరించింది. బ్యాంకుల్లో అన్ని కార్యకలాపాలకు ఫైనాన్షియల్ టెక్నాలజీని వినియోగించుకోవాలని సూచించింది. అన్ని స్థాయిల్లోనూ ఉద్యోగులకు ఎంప్లాయీ స్టాక్ ఆప్షన్లు (ఈసాప్) ఇవ్వడం ద్వారా సమర్థతను పెంచొచ్చని అభిప్రాయపడింది. ''రుణాలకు సంబంధించి నిర్ణయాల్లో, ముఖ్యంగా పెద్ద రుణాల జారీలో బిగ్ డేటా, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లర్నింగ్‌ను వినియోగించుకునేందుకు జీఎస్‌టీఎన్ తరహా సంస్థను ఏర్పాటు చేయాలి. రుణ గ్రహీతలను సమగ్రంగా తెలుసుకునేందుకు పీఎస్‌బీ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయాలి'' అని సర్వే సిఫారసు చేసింది.

ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణతో మెరుగైన ఫలితాలు..

కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల్లో (సీపీఎస్ ఈలు) పెట్టుబడుల ఉపసంహరణను పెద్ద ఎత్తున చేపట్టాల్సిన అవసరాన్ని కూడా ఆర్థిక సర్వే ప్రస్తావించింది. గతంలో ప్రైవేటీకరించిన సీపీఎస్‌ఈల పనితీరు ఆదాయం, లాభాలు, నికర విలువ పరంగా ఎంతో అభివృద్ధి చెందిన విషయాన్ని గుర్తు చేసింది. గతంలో ప్రైవేటీకరించిన సీపీఎస్‌ఈల్లో వ్యూహాత్మక పెట్టుబడుల ఉపసంహరణకు ముందు పదేళ్లు, ఆ తర్వాత పదేళ్ల కాలంలో వాటి పనితీరును సర్వే అధ్యయనం చేసింది. హిందుస్తాన్ టెలీ ప్రింటర్స్, ఎంఎఫ్ఐఎల్, టాటా కమ్యూనికేషన్స్ వంటి కొన్ని కంపెనీలు మినహా మిగిలిన వాటి నికర విలువ, స్థూల ఆదాయం, నికర లాభాల మార్జిన్, ఆదాయాల వృద్ధి అన్నది ప్రైవేటీకరణకు ముందు నాటి కాలంలో పోలిస్తే ప్రైవేటీకరణ అనంతరం కాలంలో ఎంతో మెరుగుపడినట్టు సర్వే వెల్లడించింది. పెట్టుబడుల ఉపసంహరణ అన్నది మొత్తానికి వాటి పనితీరు, ఉత్పాదకతను గణనీయంగా మార్చేసినట్టు తెలిపింది. అధిక లాభదాయకత, సమర్థత పెంపు, మరింత పోటీతత్వం కోసం వేగంగా వ్యూహాత్మక పెట్టుబడుల ఉపసంరహరణను చేపట్టాలని సూచించింది.

పన్ను కోతతో లాభం పెద్ద కంపెనీలకే..

కార్పొరేట్ పన్నులో గణనీయమైన తగ్గింపుతో ఎక్కువ ప్రయోజనం పెద్ద కంపెనీలకేనని, చిన్న కంపెనీలు అప్పటికే తక్కువ పన్ను రేటు చెల్లిస్తున్న విషయాన్ని ఆర్థిక సర్వే పేర్కొంది. కార్పొరేట్ పన్నును 30 శాతం నుంచి 22 శాతానికి తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం గతేడాది సెప్టెంబర్‌లో నిర్ణయం తీసుకున్న విషయం గమనార్హం. ఈ నిర్ణయం తీసుకునే నాటికే రూ.400 కోట్ల వరకు టర్నోవర్ ఉన్న కంపెనీలు (దేశంలో 99.1 శాతం ఈ పరిధిలోనివే) 25 శాతం కార్పొరేట్ పన్ను పరిధిలో ఉన్న విషయాన్ని సర్వే ప్రస్తావించింది. అంటే కేవలం 0.9 శాతం కంపెనీలు (4,698 కంపెనీలు) రూ.400 కోట్ల టర్నోవర్ పైగా ఉన్నవి. ఇవి చెల్లించే రేటు 30.9 నుంచి 34.61 శాతం మధ్య (సెస్సులు కూడా కలుపుకుని) ఉంది. దీంతో కార్పొరేట్ పన్ను తగ్గింపు చిన్న కంపెనీలకు 3.2 శాతం నుంచి 13.5 శాతం మేర ప్రయోజనం కలిగిస్తే, పెద్ద కంపెనీలకు 18.5 శాతం నుంచి 27.3 శాతం మధ్య లాభం చేకూర్చినట్టు ఆర్థిక సర్వే వివరించింది.

ఇళ్ల ధరలను తగ్గించడం పరిష్కారం!

అమ్ముడుపోని ఇళ్లు అధిక సంఖ్యలో ఉండడంతో వీటిని తగ్గించుకునేందుకు నిర్మాణదారులు కొంత మేర ధరలను తగ్గించాల్సిన అవసరాన్ని ఆర్థిక సర్వే సూచించింది. రియల్‌ఎస్టేట్ డెవలపర్లు కొంత మేర హేర్‌కట్ (నష్టం) భరించి ధరలను తగ్గిస్తే త్వరగా అమ్ముడుపోతాయని పేర్కొంది. బిల్డర్లు ఈ విధంగా చేసినట్టయితే బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీల బ్యాలెన్స్ షీట్లు సానుకూలంగా మారతాయని తెలిపింది. 2015-16 నుంచి వృద్ధి నిలిచిపోయినప్పటికీ, ఇళ్ల ధరలు అధిక స్థాయిల్లోనే ఉన్నట్లు పేర్కొంది.

సంపద సృష్టి ద్వారానే..

సంపదను సృష్టించినప్పుడే దాన్ని పంచడం సాధ్యపడుతుందని ఆర్థిక సర్వే రూపకల్పన బృందానికి నేతృత్వం వహించిన కేంద్ర ప్రభుత్వ ముఖ్య ఆర్థిక సలహాదారు కృష్ణమూర్తి సుబ్రమణియన్ అన్నారు. అనుమానంగా చూడడం, సంపద సృష్టికర్తలను (వ్యాపారవేత్తలు) అమర్యాదగా చూడడం మంచిది కాదన్నారు. జీడీపీ వృద్ధి నిదానించడాన్ని వృద్ధి సైకిల్‌లో భాగంగానే చూడాలన్నారు. 2011 తర్వాత జీడీపీ రేటును 2.7 శాతం అధికం చేసి చూపిస్తున్నారన్న మాజీ ముఖ్య ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణియన్ ఆరోపణలు అవాస్తవమని స్పష్టం చేశారు.

'అరవింద్' సమేత..

ఆంధ్రుడికే ఐబీఎం పగ్గాలు..



సీఈవోగా అరవింద్ కృష్ణ నియామకం • బోర్డులోనూ చోటు ; ఏప్రిల్ 6 నుంచి అమల్లోకి

న్యూయార్క్: మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల తరవాత... మరో అమెరికన్ ఐటీ దిగ్గజానికి సారథ్యం వహించే అవకాశం ఇంకో తెలుగు వ్యక్తికి దక్కింది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అరవింద్ కృష్ణ (57)... ఐటీ దిగ్గజం ఐబీఎం చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా (సీఈవో) నియమితులయ్యారు. 200 బిలియన్ డాలర్ల సంస్థ డైరెక్టర్ల బోర్డులోనూ ఆయనకు చోటు దక్కింది. ఏప్రిల్ 6 నుంచి ఈ నియామకం అమల్లోకి వస్తుంది. ఏపీలోని పశ్చిమ గోదావరి జిల్లాలో పుట్టిన అరవింద్ కృష్ణ... 1990లో ఐబీఎంలో చేరారు. అప్పటి నుంచి అంచెలంచెలుగా ఎదుగుతూ... ప్రస్తుతం సంస్థ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (క్లౌడ్, కాగ్నిటివ్ సాఫ్ట్‌వేర్) స్థాయికి చేరారు. 'సీఈవోగా ఎంపికైనందుకు సంతోషంగా ఉంది. ప్రస్తుత సీఈవో వర్జీనియా రొమెటీ, బోర్డ్ నా మీద ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు. ఐటీ పరిశ్రమ శరవేగంగా మారిపోతున్న ఈ తరుణంలో ప్రపంచవ్యాప్తంగా ఐబీఎం సిబ్బంది, క్లయింట్లతో కలిసి పనిచేయడం చాలా బాగుంటుంది. వ్యాపారాలను మరింతగా మెరుగుపర్చుకునేలా క్లయింట్లకు తోడ్పడటానికి ఇదో అద్భుతమైన అవకాశం' అని కృష్ణ పేర్కొన్నారు. ఆయనతో పాటు రెడ్ హ్యాట్ సీఈవో, ఐబీఎం సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ జేమ్స్ వైట్‌హర్స్ట్.. ఐబీఎం ప్రెసిడెంట్‌గా నియమితులయ్యారు.

సిలికాన్ వ్యాలీలో భారతీయ జెండా..

అరవింద్ కృష్ణ నియామకంతో టెక్నాలజీ రంగంలో భారతీయుల సత్తా మరోసారి చాటినట్టయింది. అమెరికా సిలికాన్ వ్యాలీలోని నాలుగు అతిపెద్ద బహుళజాతి కంపెనీలకు ఇప్పుడు భారతీయులే సీఈఓలు. ప్రధానంగా గూగుల్ సుందర్ పిచాయ్, మైక్రోసాఫ్ట్ సత్య నాదెళ్ల ప్రపంచ టాప్ టెక్నాలజీ కంపెనీలకు అధిపతులుగా ఉన్నారు. ఇతర ఎంఎన్‌సీల విషయానికొస్తే... మాస్టర్‌కార్డ్ సీఈఓ అజయ్ బంగాతో పాటు పెప్సికో మాజీ సీఈఓ ఇంద్రా నూయి కూడా అత్యంత సుపరిచితులే. వారినొకసారి చూస్తే...

సుందర్ పిచాయ్: తమిళనాడుకు చెందిన పిచాయ్ 2015లో గూగుల్ సీఈఓగా నియమితులయ్యారు. 47 ఏళ్ల పిచాయ్‌కు తాజాగా గూగుల్ మాతృసంస్థ ఆల్ఫాబెట్ సీఈఓ బాధ్యతలు కూడా అప్పగించి కంపెనీ ప్రమోటర్లు వైదొలగడం ఆయనపై ఉన్న నమ్మకానికి నిదర్శనం.

సత్య నాదెళ్ల: 1992లో మైక్రోసాఫ్ట్‌లో ఉద్యోగిగా ప్రస్థానాన్ని ప్రారంభించిన నాదెళ్ల స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం. హైదరాబాద్‌లో హైస్కూల్ విద్యను అభ్యసించారు. 2014లో స్టీవ్‌బామర్ నుంచి మైక్రోసాఫ్ట్ సీఈఓగా బాధ్యతలు చేపట్టారు.

శంతను నారాయణ్: యాపిల్‌లో కెరీర్‌ను ప్రారంభించిన నారాయణ్ 1998లో అడోబ్ సిస్టమ్స్‌లో వైస్-ప్రెసిడెంట్‌గా జాయిన్ అయ్యారు. 2007లో ఏకంగా ఆ కంపెనీ సీఈఓగా నియమితులయ్యారు. హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఇంజనీరింగ్ చేశారు.

జార్జ్ కురియన్: కేరళలోని కొట్టాయంకు చెందిన కురియన్... అమెరికా దిగ్గజం సిస్కో సిస్టమ్స్‌లో వైస్ ప్రెసిడెంట్‌గా పనిచేశారు. స్టోరేజ్ అండ్ డేటా మేనేజ్‌మెంట్ కంపెనీ 'నెట్‌యాప్'కు 2015లో ప్రెసిడెంట్, సీఈఓగా నియమితులయ్యారు.

కొత్త శకానికి.. సరైన సారథి

'ఐబీఎం తదుపరి శకానికి కృష్ణ సరైన సారథి. క్లౌడ్, కాగ్నిటివ్ శకంలో కంపెనీని ముందుకు తీసుకెళ్లేందుకు ఆయన సరైన వ్యక్తి. ఐబీఎం చరిత్రలోనే అత్యంత భారీ కొనుగోలు అయిన 'రెడ్ హ్యాట్' డీల్‌కు ఆయనే సూత్రధారి. అరవింద్ కృష్ణ అద్భుతమైన టెక్నాలజిస్టు. ఐబీఎంకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్లౌడ్ వంటి కీలక టెక్నాలజీలను రూపొందించడంలో ముఖ్యపాత్ర పోషించారు. విలువలకు ప్రాధాన్యమిచ్చే నాయకుడు' అని వర్జీనియా రొమెటీ (62) వ్యాఖ్యానించారు. 40 ఏళ్లుగా ఐబీఎంలో వివిధ హోదాల్లో పనిచేసిన రొమెటీ ఇక ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా కొనసాగుతారు. ఈ ఏడాది ఆఖర్లో రిటైరవుతారు. సీఈవోగా బాధ్యతలు అప్పగించేందుకు సరైన వ్యక్తి కోసం సాగిన అన్వేషణలో.. అరవింద్ కృష్ణ ఎంపికయ్యారని ఐబీఎం లీడ్ డైరెక్టర్ మైఖేల్ ఎస్క్యూ పేర్కొన్నారు.

జయశ్రీ ఉల్లాల్: అమెరికా క్లౌడ్ నెట్‌వర్కింగ్ దిగ్గజం అరిస్టా నెట్‌వర్క్ సీఈఓ.

రాజీవ్ సూరి: 2014లో నోకియా ప్రెసిడెంట్, సీఈఓగా నియమితులయ్యారు.

దినేష్ పలివాల్: సౌండ్ అండ్ మ్యూజిక్ పరికరాల్లో ప్రపంచ అగ్రగామి సంస్థల్లో ఒకటైన హర్మన్ ఇంటర్నేషనల్‌కు ప్రెసిడెంట్ సీఈఓగా వ్యవహరిస్తున్నారు.

నికేశ్ అరోరా: సైబర్ సెక్యూరిటీలో ప్రపంచ దిగ్గజాల్లో ఒకటైన పాలో అల్టో నెట్‌వర్క్స్‌కు 2018 జూన్ నుంచి అరోరా సీఈఓగా పనిచేస్తున్నారు.

అంజలి సూద్: యూట్యూబ్‌కు పోటీనిస్తున్న యాడ్‌ఫ్రీ హైడెఫినిషన్ ఓపెన్ వీడియో ప్లాట్‌ఫామ్.. 'విమియో'కు 2017లో సీఈఓ అయ్యారు.

సంజయ్ మెహ్రోత్రా: 2017లో మైక్రాన్ టెక్నాలజీ సీఈఓగా నియామకం.

సమోసా పార్టీ..!

అరవింద్ కృష్ణ నియామకంపై దేశీ వ్యాపార దిగ్గజం ఆనంద్ మహీంద్రా వ్యాఖ్యలు నెటిజన్లను ఆకట్టుకున్నాయి. భారతీయుల సామర్థ్యాలకు తాజా నియామకం నిదర్శనమని మహీంద్రా ట్వీట్ చేశారు. అదే సమయంలో ఇకపై వైట్‌హౌస్ ఎప్పుడైనా టెక్ దిగ్గజాల సదస్సుల్లాంటివి ఏర్పాటు చేస్తే.. హాంబర్గర్ల స్థానంలో కచ్చితంగా భారతీయులకిష్టమైన సమోసాలుండేలా చూసుకోవాల్సి వస్తుందంటూ సరదాగా పేర్కొన్నారు. సాంబర్ వడ, మసాలా చాయ్ లాంటివి కూడా పెట్టాలంటూ నెటిజన్లు లిస్టులో మరిన్ని చేర్చారు.

ప్రస్థానం ఇలా...

పశ్చిమ గోదావరి జిల్లాలో పుట్టిన అరవింద్ కృష్ణ.. ఊటీలోని కూనూర్‌లో ఉన్నత పాఠశాల విద్యనభ్యసించారు. తరవాత ఐఐటీ కాన్పూర్‌లో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ చదివారు. అక్కడి నుంచి అమెరికా వెళ్లి యూనివర్సిటీ ఆఫ్ ఇల్లినాయిలో పీహెచ్‌డీ చేశారు. ఐఈఈఈ, ఏసీఎం జర్నల్స్‌కు ఎడిటర్‌గా వ్యవహరించడంతో పాటు 15 పేటెంట్లకు ఆయన సహ-రచయిత. 1990లో ఐబీఎంలో చేరి.. 30 ఏళ్లుగా అందులోనే కొనసాగుతున్నారు. సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కాకముందు.. ఆయన ఐబీఎం సిస్టమ్స్‌లో జనరల్ మేనేజర్ హోదాలో పనిచేశారు. అంతకన్నా ముందు.. ఐబీఎం సాఫ్ట్‌వేర్, ఐబీఎం రీసెర్చ్ విభాగాల్లో టెక్నాలజిస్టుగా పనిచేశారు.

విప్రో సీఈవో అబిదాలి నిష్క్రమణ

వారసుడి అన్వేషణలో కంపెనీ

న్యూఢిల్లీ: ఐటీ సేవల సంస్థ విప్రో సీఈవోగా అబిదాలి జెడ్ నీముచ్‌వాలా వైదొలగనున్నారు. దీంతో ఆయన వారసుడి కోసం కంపెనీ బోర్డు అన్వేషణ ప్రారంభించింది. స్టాక్ ఎక్స్ఛేంజీలకు విప్రో శుక్రవారం ఈ విషయాలు తెలియజేసింది. 'కుటుంబపరమైన అవసరాల కారణంగా తప్పుకోవాలని నీముచ్‌వాలా నిర్ణయించుకున్నారు. కొత్తవారిని నియమించే దాకా ఆయన సీఈవో, ఎండీ హోదాల్లో కొనసాగుతారు' అని వివరించింది. 'గడిచిన నాలుగేళ్లుగా విప్రో అంతర్జాతీయంగా పలు డిజిటల్ వ్యాపారంలో గణనీయంగా ఎదగడంలోనూ, భారీ కొనుగోళ్లు జరపడంలోనూ నీముచ్‌వాలా కీలకపాత్ర పోషించారు. ఆయన అందించిన సేవలు అభినందనీయం' అని విప్రో చైర్మన్ రిషద్ ప్రేమ్‌జీ తెలిపారు.

ఎస్‌బీఐ లాభం రూ.6,797 కోట్లు

41 శాతం వృద్ధి ● ఆదాయం రూ.95,384 కోట్లకు

ఈ క్యూ3లోనే అత్యధిక స్టాండ్‌అలోన్ నికర లాభం

న్యూఢిల్లీ: దేశీయ దిగ్గజ బ్యాంక్....స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఈ ఆర్థిక సంవత్సరం(2019-20) మూడో త్రైమాసిక కాలంలో రూ.6,797 కోట్ల నికర లాభం (కన్సాలిడేటెడ్)సాధించింది. గత ఆర్థిక సంవత్సరం(2018-19) ఇదే క్వార్టర్‌లో ఆర్జించిన నికర లాభం, రూ.4,823 కోట్లుతో పోల్చితే 41 శాతం వృద్ధి సాధించింది. కేటాయింపులు తక్కువగా ఉండటంతో నికర లాభం ఈ స్థాయిలో పెరిగింది. ఎస్సార్ స్టీల్ బకాయిలు రికవరీ కావడం, ఇతర, నిర్వహణ, నికర వడ్డీ ఆదాయాలు పెరగడం కూడా కలసివచ్చింది. మొత్తం ఆదాయం రూ.84,390 కోట్ల నుంచి రూ.95,384 కోట్లకు పెరిగింది. మరిన్ని వివరాలు...

రికార్డ్ స్థాయి లాభం....

స్టాండ్‌అలోన్ పరంగా చూస్తే, నికర లాభం రూ.3,955 కోట్ల నుంచి 41 శాతం వృద్ధితో రూ.5,583 కోట్లకు పెరిగింది. ఈ బ్యాంక్ సాధించిన అత్యధిక త్రైమాసిక లాభం ఇదే. రూ.1,333 కోట్ల పన్ను సంబంధిత వ్యయాలు లేకుంటే నికర లాభం రూ.6,916 కోట్లకు పెరిగి ఉండేది. ఆదాయం రూ.70,312 కోట్ల నుంచి రూ.76,798 కోట్లకు పెరిగింది. నికర వడ్డీ ఆదాయం 22 శాతం ఎగసి రూ.27,779 కోట్లకు పెరిగింది. ఎస్సార్ స్టీల్ నుంచి రూ.11,000 కోట్లు రికవరీ కావడం కలసివచ్చింది. రుణ వృద్ధి 7.4 శాతంగా ఉంది. డిపాజిట్లు 10 శాతం పెరిగాయి. దేశీయ నికర వడ్డీ మార్జిన్ 3.59 శాతానికి మెరుగుపడింది.

మెరుగుపడిన రుణ నాణ్యత..

ఎస్‌బీఐ రుణ నాణ్యత మెరుగుపడింది. గత క్యూ3లో 8.71 శాతంగా ఉన్న స్థూల మొండి బకాయిలు ఈ క్యూ3లో 6.94 శాతానికి తగ్గాయి. నికర మొండి బకాయిలు 3.95 శాతం నుంచి 2.65 శాతానికి చేరాయి. మొండి బకాయిలకు కేటాయింపులు తగ్గాయి. గత క్యూ3లో రూ.13,971 కోట్లుగా ఉన్న మొండి బకాయిలకు కేటాయింపులు ఈ క్యూ3లో రూ.8,193 కోట్లకు తగ్గాయి. స్థూల మొండి బకాయిలు రూ.1.59 లక్షల కోట్లకు, నికర మొండి బకాయిలు రూ.58,249 కోట్లకు తగ్గాయి. తాజా మొండి బకాయిలు మాత్రం రూ.8,805 కోట్ల నుంచి రూ.16,525 కోట్లకు పెరిగాయి. దీంట్లో డీహెచ్‌ఎఫ్‌ఎల్‌కు సంబంధించిన రుణాలు రూ.7,000 కోట్ల మేర ఉన్నాయి. ప్రొవిజన్ కవరేజ్ రేషియో 81.73 శాతానికి చేరింది.

నికర లాభం 41 శాతం పెరగడం, రుణ నాణ్యత మెరుగుపడటంతో ఎస్‌బీఐ షేర్ కూడా పెరిగింది. బీఎస్‌ఈలో ఎస్‌బీఐ షేర్ 2.5 శాతం లాభంతో రూ.318 వద్ద ముగిసింది.

మొండి బకాయిలు తగ్గుతాయ్...

ఈ క్వార్టర్‌లో నిర్వహణ పరంగా పటిష్టమైన పనితీరు సాధించాం. లాభదాయతక, రుణ నాణ్యత, ప్రొవిజన్ కవరేజ్ రేషియో, క్యాపిటల్ అడెక్వసీ అంశాల్లో చాలా మెరుగుపడ్డాం. ఈ క్యూ4లో కార్పొరేట్ రుణాలకు సంబంధించి రూ.1,200 కోట్లకు మించి తాజా మొండి బకాయిలు ఉండకపోవచ్చు. మొత్తం మీద మొత్తం తాజా మొండి బకాయిలు రూ.5,000-6,000 కోట్ల రేంజ్‌లోనే ఉంటాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రుణ వృద్ధి 8-10 శాతం రేంజ్‌లో ఉంటుందని అంచనా.

– రజనీశ్ కుమార్, చైర్మన్, ఎస్‌బీఐ

ఐటీసీ లాభం రూ.4,048 కోట్లు

న్యూఢిల్లీ: ఎఫ్ఎమ్‌సీజీ దిగ్గజం ఐటీసీకి ఈ ఆర్థిక సంవత్సరం (2019-20) డిసెంబర్ క్వార్టర్లో రూ.4,048 కోట్ల నికర లాభం వచ్చింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే క్వార్టర్‌లో ఆర్జించిన నికర లాభం (రూ.3,137 కోట్లు)తో పోల్చితే 29 శాతం వృద్ధి సాధించామని ఐటీసీ తెలిపింది. నికర అమ్మకాలు రూ.12,506 కోట్ల నుంచి 6 శాతం వృద్ధితో రూ.13,220 కోట్లకు పెరిగాయని పేర్కొంది. మొత్తం వ్యయాలు రూ.8,341 కోట్ల నుంచి 5 శాతం వృద్ధితో రూ.8,779 కోట్లకు పెరిగాయని వివరించింది.

బీఎస్‌ఈలో ఐటీసీ షేర్ 0.6 శాతం లాభంతో రూ.235 వద్ద ముగిసింది.

పవర్‌గ్రిడ్ ఆదాయం రూ.9,541 కోట్లు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ పవర్ గ్రిడ్ కంపెనీ నికర లాభం ఈ ఆర్థిక సంవత్సరం (2019-20) డిసెంబర్ క్వార్టర్లో 14 శాతం పెరిగింది. గత ఆర్థిక సంవత్సరం క్యూ3లో రూ.2,346 కోట్లుగా ఉన్న నికర లాభం (కన్సాలిడేటెడ్)ఈ క్యూ3లో రూ.2,672 కోట్లకు పెరిగిందని పవర్ గ్రిడ్ తెలిపింది. మొత్తం ఆదాయం రూ.8,879 కోట్ల నుంచి రూ.9,541 కోట్లకు పెరిగిందని పేర్కొంది.

ఆర్థిక ఫలితాల నేపథ్యంలో పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా షేర్ 4 శాతం నష్టంతో రూ.187 వద్ద ముగిసింది.

71 శాతం పెరిగిన కోరమాండల్ లాభం

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎరువుల తయారీ దిగ్గజం కోరమాండల్ ఇంటర్నేషనల్ డిసెంబరు త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో నికరలాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 71 శాతం పెరిగి రూ.264 కోట్లకు ఎగసింది. టర్నోవరు రూ.3,049 కోట్ల నుంచి రూ.3,278 కోట్లకు చేరింది.

శుక్రవారం బీఎస్‌ఈలో కోరమాండల్ షేరు ధర క్రితం ముగింపుతో పోలిస్తే 1.54 శాతం పెరిగి రూ.630.40 కోట్లుగా ఉంది.

వేదాంత లాభం 49 శాతం అప్

న్యూఢిల్లీ: వేదాంత కంపెనీ నికర లాభం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2019-20) డిసెంబర్ క్వార్టర్లో 49 శాతం పెరిగింది. గత ఆర్థిక సంవత్సరం క్యూ3లో రూ.1,574 కోట్లుగా ఉన్న నికర లాభం(కన్సాలిడేటెడ్) ఈ క్యూ3లో రూ.2,348 కోట్లకు పెరిగిందని వేదాంత కంపెనీ సీఈఓ శ్రీనివాసన్ వెంకట కృష్ణన్ వెల్లడించారు.

Sale Notice
Scrap, Building, Plant & M/c of Anil Ltd (In Lqn)
Located in Ahmedabad city under Liquidation process of IBC, 2016.
Last date for submission of EMD: Wednesday, 05.02.2020 before 06:00 P.M.
For more details visit www.sunresolution.in / www.eauctions.co.in or contact
CA Ramachandra D. Choudhary
Liquidator of Anil Limited
Reg No: IBBI/IPA-001/IP-P00157/2017-18/10326
rdc_rca@yahoo.com • 079 – 26566577 / 588

మార్కెట్‌కు సర్వే నష్టాలు

- మెప్పించని ఆర్థిక సర్వే
- పతన బాటలోనే ప్రపంచ మార్కెట్లు
- 190 పాయింట్లు పతనమై 40,723కు సెన్సెక్స్
- 74 పాయింట్ల నష్టంతో 11,962కు నిఫ్టీ

దశాబ్దం కనిష్ట స్థాయికి పడిపోయిన వృద్ధి జోరు పెంచడానికి ద్రవ్యలోటు లక్ష్యాన్ని సవరించాలని ఆర్థిక సర్వే సూచించడంతో స్టాక్ మార్కెట్ శుక్రవారం నష్టపోయింది. మరిన్ని సంస్కరణలు అవసరమని పేర్కొన్న ఆర్థిక సర్వే ఇన్వెస్టర్లను మెప్పించలేకపోయింది. కరోనా వైరస్ బాధిత వ్యక్తుల మరణాలు 213కు పెరగడంతో ప్రపంచ మార్కెట్లు బలహీనంగానే ట్రేడ్‌కావడం ప్రతికూల ప్రభావం చూపించింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 23 పైసలు పుంజుకున్నా (ఇంట్రాడేలో) ఆ ప్రభావం కనిపించలేదు. నిఫ్టీ 12,000 పాయింట్ల దిగువకు పడిపోయింది. 74 పాయింట్లు నష్టపోయి 11,962 పాయింట్ల వద్దకు చేరింది. బీఎస్‌ఈ సెన్సెక్స్ 190 పాయింట్లు పతనమై 40,723 పాయింట్ల వద్ద ముగిసింది.

483 పాయింట్ల రేంజ్‌లో సెన్సెక్స్....

ప్రభుత్వ రుణాలు మరింతగా పెరిగే అవకాశాలున్నాయని, ప్రైవేట్ ఇన్వెస్ట్‌మెంట్స్ తగ్గగలవని ఆర్థిక సర్వే సూచన ప్రాయంగా వెల్లడించిందని, దీంతో అమ్మకాలు జోరుగా సాగాయని నిపుణులంటున్నారు. నేడు (శనివారం)బడ్జెట్ కారణంగా ఇన్వెస్టర్లు, ట్రేడర్లు అప్రమత్తంగా వ్యవహరించారు. సెన్సెక్స్ లాభాల్లోనే ఆరంభమైనా, 11 గంటల తర్వాత నష్టాల్లోకి జారిపోయింది.

నేడు స్టాక్ మార్కెట్ ట్రేడింగ్

సాధారణంగా శనివారం స్టాక్ మార్కెట్‌కు సెలవు. నేడు బడ్జెట్ ప్రవేశపెడుతుండటంతో స్టాక్ మార్కెట్‌లో ట్రేడింగ్ మామూలుగానే జరగనున్నది.

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్‌ఈ	1,962
ఎన్ఎస్‌ఈ	43,530
ఎన్ఎస్‌ఈ (డెరివేటివ్స్)	7,01,181
ఎఫ్ఐఐ	- 4,179
డీఐఐ	3,816

మధ్యాహ్నం తర్వాత ఒకింత లాభపడినా, చివరి గంటలో నష్టాలు కొనసాగాయి. ఒక దశలో 240 పాయింట్ల మేర లాభపడిన సెన్సెక్స్ మరో దశలో 243 పాయింట్లు పతనమైంది. మొత్తం మీద రోజంతా 483 పాయింట్ల రేంజ్‌లో కదలాడింది. జపాన్, తైవాన్ మినహా మిగిలిన అన్ని ఆసియా మార్కెట్లు నష్టాల్లో ముగిశాయి. యూరప్ మార్కెట్లు కూడా నష్టపోయాయి.

- ఓఎన్‌జీసీ 5.8 శాతం నష్టంతో రూ.109 వద్ద ముగిసింది.
- ఆర్‌బీఐతో ఉన్న వివాదాన్ని పరిష్కరించుకోవడంతో కోటక్ మహీంద్రా బ్యాంక్ షేర్ 4 శాతం లాభంతో రూ.1,691 వద్ద ముగిసింది.
- సెన్సెక్స్‌లో బాగా లాభపడిన షేర్ ఇదే. డిజిన్వెస్ట్‌మెంట్ విషయమై మరింత దూకుడు ఉండాలని ఆర్థిక సర్వే సూచించింది. ఫలితంగా ప్రభుత్వ రంగ షేర్లు పతనమయ్యాయి.

సమ్మెతో ఆర్థిక సేవలకు అంతరాయం

న్యూఢిల్లీ: వేతన సవరణ డిమాండ్‌తో ఉద్యోగ సంఘాలు నిర్వహిస్తున్న రెండు రోజుల దేశవ్యాప్త సమ్మెతో ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో పలు సర్వీసులకు విఘాతం కలిగింది. నగదు డిపాజిట్లు, విత్‌డ్రాయల్, చెక్కుల క్లియరెన్సులు, రుణ వితరణ తదితర కార్యకలాపాలపై ప్రభావం పడింది. పలు ప్రాంతాల్లో ప్రభుత్వ రంగ బ్యాంకుల శాఖలు మూతపడ్డాయి. అయితే, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వంటి ప్రైవేట్ రంగ బ్యాంకుల్లో కార్యకలాపాలు యథాప్రకారంగానే జరిగాయి. శుక్రవారం, శనివారం.. రెండు రోజులపాటు ఉద్యోగుల సంఘాలు సమ్మెకు పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. ఆదివారం సెలవు రోజు కావడంతో బ్యాంకులు ఇక సోమవారం (ఫిబ్రవరి 3న) తెరుచుకోనున్నాయి. కేంద్ర బడ్జెట్ సమావేశాల సందర్భంలోనే ఉద్యోగుల సమ్మె కూడా జరగడం గమనార్హం.

2017 నవంబర్ నుంచి ప్రభుత్వ రంగ బ్యాంకు ఉద్యోగుల వేతన సవరణ పెండింగ్‌లో ఉంది. డిమాండ్ల సాధన కోసం తొమ్మిది బ్యాంక్ యూనియన్ల సమాఖ్య యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యూఎఫ్‌బీయూ) సమ్మెకు పిలుపునిచ్చింది. ప్రభుత్వ రంగ బ్యాంకులు, కొన్ని ప్రైవేట్ బ్యాంకులకు చెందిన దాదాపు 10 లక్షల మంది సిబ్బంది సమ్మెలో పాల్గొంటున్నట్లు వెల్లడించింది. గురువారం జరిగిన చర్చల్లో 19 శాతం దాకా వేతనాల పెంపును ప్రతిపాదించినప్పటికీ ఉద్యోగుల సంఘాలు సమ్మెకే నిర్ణయించుకున్నాయని ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబీఏ) పేర్కొంది. ఉద్యోగుల సమ్మె కారణంగా సర్వీసులపై పాక్షికంగా ప్రభావం పడగలదంటూ ఎస్‌బీఐ తదితర ప్రభుత్వ రంగ బ్యాంకులు ముందుగానే కస్టమర్లకు తెలియజేశాయి.

రియల్టీ నుంచి తప్పుకోనున్న ఇండియాబుల్స్

కొత్త సంస్థలో అసెట్స్ విలీనం

ముంబై: వ్యాపార దిగ్గజం ఇండియాబుల్స్ గ్రూప్ తాజాగా రియల్టీ రంగం నుంచి నిష్క్రమించనుంది. ఇందులో భాగంగా ఇండియాబుల్స్ రియల్ ఎస్టేట్ (ఐబీఆర్ఈఎల్)కి చెందిన 12-13 అసెట్స్‌ను ఎంబసీ గ్రూప్, బ్లాక్‌స్టోన్ సారథ్యంలో ఏర్పడే కొత్త సంస్థలో విలీనం చేయనుంది. ఈ రెసిడెన్షియల్, కమర్షియల్ ప్లాజెక్టుల్లో కొన్ని ఇప్పటికే పూర్తి కాగా .. మరికొన్ని వివిధ దశల్లో ఉన్నాయని సంబంధిత వర్గాలు తెలిపాయి. విలీనానంతరం ఏర్పడే కొత్త సంస్థలో ఎంబసీ గ్రూప్‌నకు నియంత్రణాధికారాలతో వాటాలు ఉంటాయి. రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్టు (రీట్) యూనిట్ హోల్డర్లతో కలిసి అమెరికన్ ప్రైవేట్ ఈక్విటీ (పీఈ) సంస్థ బ్లాక్‌స్టోన్ రెండో అతి పెద్ద షేర్‌హోల్డరుగా ఉంటుంది. ఇండియాబుల్స్ గ్రూప్ చైర్మన్ సమీర్ గెహ్లాట్‌కు మైనారిటీ వాటాలు ఉంటాయి. విలీనం చేసే 12-13 ప్రాపర్టీల విలువ సుమారు రూ. 12,000 కోట్లుగా ఉంటుందని సంబంధిత వర్గాలు వివరించాయి. విలీన ప్రతిపాదన ప్రకారం..

మెర్జర్ కావడానికి ముందుగానే ఎంబసీ ప్రాపర్టీ డెవలప్‌మెంట్స్ దాదాపు 200 మిలియన్ డాలర్లు (సుమారు రూ. 1,400 కోట్లు) ఇన్వెస్ట్ చేయనుంది. ఎంబసీ షేర్‌హోల్డర్లకు రూ. 2 ముఖ విలువ గల ఈక్విటీ షేర్లను ఐబీఆర్ఈఎల్ కేటాయిస్తుంది. 'రియల్టీ నుంచి నిష్క్రమించడంలో ఈ విలీనం ఆఖరు దశ. మేం పూర్తిగా ఆర్థిక సేవల వ్యాపారాలపై దృష్టి పెడతాం' అని గెహ్లాట్ పేర్కొన్నారు. ఆర్థిక సేవల విభాగంపై మరింతగా దృష్టి పెట్టేందుకు, రుణభారాన్ని తగ్గించుకునేందుకు.. గడిచిన రెండేళ్లుగా ఐబీఆర్ఈఎల్ సుమారు రూ. 12,250 కోట్లకు పలు కమర్షియల్ అసెట్స్‌ను బ్లాక్‌స్టోన్‌కు విక్రయించింది. గత ఏడాది లక్ష్మి విలాస్ బ్యాంక్‌ను టేకోవర్ చేసేందుకు ప్రయత్నించింది. అయితే, రియల్టీ రంగంలో కార్యకలాపాలు అడ్డంకిగా మారాయి. ఆ తర్వాత.. రియల్టీ నుంచి తప్పుకునే ప్రక్రియను ఇండియాబుల్స్ మరింత వేగవంతం చేసింది.

మార్కెట్లోకి లెక్సస్ మేడ్ ఇన్ ఇండియా కార్లు

ధరల శ్రేణి రూ. 51.9 లక్షలు – 1.96 కోట్లు



జపనీస్ కార్ల తయారీ కంపెనీ టయోటాకు చెందిన లగ్జరీ వాహనాల విభాగం 'లెక్సస్'.. భారత మార్కెట్లో పలు మోడళ్లను శుక్రవారం ప్రవేశపెట్టింది. బెంగళూరులో కంపెనీకి ఉన్నటువంటి ప్లాంట్‌లోనే వీటిని అసెంబుల్ చేసింది. నూతన కార్లు భారత్ స్టేజ్ (బీఎస్)-6 ఉద్గార నిబంధనలకు అనుగుణంగా ఉన్నట్లు కంపెనీ ప్రకటించింది. కొత్త కార్ల జాబితాలో.. 'ఈఎస్ 300హెచ్ ఎక్స్‌క్లెయిసైట్' ధర రూ. 51.9 లక్షలు (ఎక్స్‌షోరూమ్) కాగా, ఇదే మోడల్ లగ్జరీ ట్రిమ్ ధర రూ. 56.95 లక్షలుగా నిర్ణయించింది. నూతనంగా విడుదలైన 'ఎల్‌సీ 500హెచ్ కూపే' ధర రూ. 1.96 కోట్లుగా ఉంది. 3.5-లీటర్ వీ6 హైబ్రిడ్ పెట్రోల్ ఇంజన్ కలిగిన ఈకారు.. కేవలం 4.7 సెకన్లలోనే సున్నా నుంచి 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుంది. ఇక 'ఎన్ఎక్స్ 300హెచ్ ఎఫ్ స్పోర్ట్స్' కారులో మొత్తం మూడు వేరియంట్లు ఉండగా.. వీటి ధరల శ్రేణి రూ. 54.9 లక్షలు - 60.6 కోట్లుగా ఉన్నట్లు కంపెనీ ప్రకటించింది.

తెలంగాణ ప్రభుత్వము
రెవెన్యూ శాఖ
కలెక్టర్, వరంగల్ (రూరల్) వారి ప్రకటన
ఫారం-C

భూసేకరణ పునరుపాది పునరావాస కల్పన పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు (తెలంగాణ సవరణ) చట్టం-2016 (చట్టం నెం.21/2017) ద్వారా సవరించబడిన భూసేకరణ పునరుపాది, పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 2013, సెక్షన్ 11(1) ప్రకారము మరియు 10A మినహాయింపు అనుసరించి)
(రూల్ 6/12 చూడుము)

వరంగల్ (రూరల్) జిల్లా గెజిట్ నెం.03/WGL/(R)/2020 తేది: 06.01.2020
కలెక్టర్ ఫైల్ నెం.G/2008/2020 తేది: 03.01.2020

ఈ దిగువ నిర్దిష్టపరిచిన వరంగల్ (రూరల్) జిల్లా, నర్సంపేట్ మండలము, మేడపల్లి గ్రామ శివారులలోని నిర్దిష్టం ఎ. 8.03 గుంటలు గల భూమి ప్రజా ప్రయోజనం నిమిత్తం అనగా కంకణ్యు మరియు ఎత్తడ్డు చెరువు ఎడమ ప్రధాన కాల్వ కి.మీ.3.650 నుండి 6.700 వరకు త్రవ్వకము నిమిత్తం ఈ దిగువ చూపిన పట్టాభూములు అవసరమైయున్నదని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము/జిల్లా కలెక్టర్ వరంగల్ (రూరల్) గారు భావించినందున భూసేకరణలో సముచిత పరిహారము మరియు పారదర్శకత, పునరావాసము హక్కు, పునరావాస చట్టం 2013 మరియు సవరణ చట్టం 2016లోని సెక్షన్ 11(1) అనుసరించి ప్రకటన జారీచేయనైనది.

ఇట్టి ప్రజాప్రయోజనార్థం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సవరణ చట్టం 2016 (చట్టం నం.21/2017) ద్వారా జారీ చేయబడిన భూసేకరణ ద్వారా పునరావాస మరియు పునరుపాది కల్పనకు మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 2013లోని సెక్షన్ 10-ఎ చట్టం పరిధిలో ఉన్నందున షెడ్యూల్-2లోని సామాజిక ప్రభావం అంచనా నివేదిక మరియు షెడ్యూల్-3 ప్రకారం ఆహార భద్రత పరిరక్షణ మినహాయింపు ఉన్నందున ప్రభుత్వం ద్వారా జి.ఓ.నం.120, రెవెన్యూ (జి.ఎ. మరియు ఎల్.ఎ.) డిపార్టుమెంటు, తేది: 30-06-2017 నందు ప్రకటించిన ప్రకారం ఈ దిగువ పేర్కొనిన భూములకై ప్రకటన జారీ చేయనైనది.

షెడ్యూల్
గ్రామము: మేడపల్లి మండలం: నల్లబెల్లి జిల్లా: వరంగల్ (రూరల్)
(కి.మీ.3.650 నుండి 6.700 వరకు)

క్రమ సం.	సర్వే నెం.	భూమి రకము (మెట్ట/తరి)	భూమి విధం (పట్టా/ప్రభుత్వ/ఇనామ్)	భూసేకరణ చేయు విస్తీర్ణం	పట్టాదారు మరియు అనుభవదారు పేరు	కళ్ళకుమలు / చెట్లు / బావులు
1	2	3	4	5	6	7
1	142	మెట్ట	పట్టా	0.19	పట్టాదారు అనంతగిరి నిమ్మయ్య, తండ్రి నర్సయ్య అనుభవదారు అనంతగిరి నిమ్మయ్య, తండ్రి నర్సయ్య	లేవు
2	142	మెట్ట	పట్టా	0.10	పట్టాదారు అనంతగిరి కనకమ్మ, భర్త కొమ్మాలు అనుభవదారు అనంతగిరి కనకమ్మ, భర్త కొమ్మాలు	లేవు
3	143	మెట్ట	పట్టా	0.06	పట్టాదారు అనంతగిరి కనకమ్మ, భర్త కొమ్మాలు అనుభవదారు అనంతగిరి కనకమ్మ, భర్త కొమ్మాలు	లేవు
4	144	మెట్ట	పట్టా	0.04	పట్టాదారు అనంతగిరి నిమ్మయ్య, తండ్రి నర్సయ్య అనుభవదారు అనంతగిరి నిమ్మయ్య, తండ్రి నర్సయ్య	లేవు
5	159/27/2	మెట్ట	పట్టా	0.01	పట్టాదారు అనంతగిరి నిమ్మయ్య, తండ్రి నర్సయ్య అనుభవదారు అనంతగిరి నిమ్మయ్య, తండ్రి నర్సయ్య	లేవు
6	159/27/1	మెట్ట	పట్టా	0-19	పట్టాదారు అనంతగిరి కనకమ్మ, భర్త కొమ్మాలు అనుభవదారు అనంతగిరి కనకమ్మ, భర్త కొమ్మాలు	లేవు
7	159/18/C	మెట్ట	పట్టా	0-15	పట్టాదారు దుస్సు ఈశ్వరమ్మ, భర్త ఎల్లయ్య అనుభవదారు దుస్సు ఈశ్వరమ్మ, భర్త ఎల్లయ్య	లేవు
8	159	మెట్ట	పట్టా	0.04	రోడ్డు	లేవు
9	159	మెట్ట	పట్టా	0-21	పట్టాదారు లావూరి సారయ్య, తండ్రి లింగ్య అనుభవదారు లావూరి సారయ్య, తండ్రి లింగ్య	లేవు
10	159	మెట్ట	పట్టా	0-38	పట్టాదారు లావూరి బాబు రావు, తండ్రి లింగ్య అనుభవదారు లావూరి బాబు రావు, తండ్రి లింగ్య	లేవు
11	22	మెట్ట	పట్టా	0.01	రోడ్డు	లేవు
12	22	మెట్ట	పట్టా	0.05½	రోడ్డు	లేవు
13	22/67/9	మెట్ట	పట్టా	0.16½	పట్టాదారు మూరు కిషన్, తండ్రి మంగ్య అనుభవదారు మూరు కిషన్, తండ్రి మంగ్య	లేవు
14	22/43/B	మెట్ట	పట్టా	0.17	పట్టాదారు భూక్య మోతిలాల్ మరియు భూక్య మనేష్, తండ్రి సీత్య అనుభవదారు భూక్య మోతిలాల్ మరియు భూక్య మనేష్, తండ్రి సీత్య	లేవు
15	22/3/ఉ/2/2	మెట్ట	పట్టా	0-13	పట్టాదారు అజ్మీర రాజు, తండ్రి బాలు అనుభవదారు అజ్మీర రాజు, తండ్రి బాలు	లేవు
16	22/3/ఉ/2/8	మెట్ట	పట్టా	0-15	పట్టాదారు అజ్మీర జంపయ్య, తండ్రి బాలు అనుభవదారు అజ్మీర జంపయ్య, తండ్రి బాలు	లేవు
17	22/3/ఉ	మెట్ట	పట్టా	0.21	పట్టాదారు బదావత్ భీమ్య తండ్రి సొమ్య అనుభవదారు బదావత్ భీమ్య తండ్రి సొమ్య	లేవు
18	22/3/ఉ/7	మెట్ట	పట్టా	0-18	పట్టాదారు బదావత్ రవి, తండ్రి కీమ్య అనుభవదారు బదావత్ రవి, తండ్రి కీమ్య	లేవు
19	22/67/3	మెట్ట	పట్టా	0.10	పట్టాదారు గుగులోతు శైక, భర్త రందాస్ (లేట్) అనుభవదారు గుగులోతు శైక, భర్త రందాస్ (లేట్)	లేవు
20	22/67/3	మెట్ట	పట్టా	0.07½	పట్టాదారు భూక్య సాంబక్క, భర్త తారాచందు అనుభవదారు భూక్య సాంబక్క, భర్త తారాచందు	లేవు
21	22/43/B/5	మెట్ట	పట్టా	0-14	పట్టాదారు బానోతు చంద్రు, తండ్రి వసురాం అనుభవదారు బానోతు చంద్రు, తండ్రి వసురాం	లేవు
22	22/3/ఉ/2/1	మెట్ట	పట్టా	1.07½	పట్టాదారు గుగులోతు సమ్మక్క, భర్త భీమ అనుభవదారు గుగులోతు సమ్మక్క, భర్త భీమ	లేవు
		మొత్తం		8.03		

కావున భూసేకరణ చట్టము-2013 (నెం. 30/2013)లోని సెక్షన్ 11(1) ప్రకారం మరియు భూసేకరణ పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు పునరావాస, పునఃస్థాపన (తెలంగాణ సవరణ) చట్టం-2016 (చట్టము నెం.21/2017) ప్రకారము సంబంధిత భూయజమానులందరికీ తెలియజేయుటకు గాను ఇట్టి ప్రకటన జారీ చేయనైనది. భూమి యొక్క స్థానం మరియు వివరములు జిల్లా కలెక్టర్, వరంగల్ రూరల్ మరియు రెవెన్యూ డివిజనల్ అధికారి, వరంగల్ రూరల్ గారి కార్యాలయములో ఉంచబడినవి. ఇట్టి సంబంధిత వ్యక్తులు ఏదైనా పని దినములందు కార్యాలయ వేళలో తనిఖీ చేసుకోవచ్చు.

పరదు చట్టములోని సెక్షన్ 12ననుసరించి, తెలంగాణ ప్రభుత్వము/కలెక్టర్, వరంగల్ రూరల్ గారు భూసేకరణ అధికారి / విభాగం రెవెన్యూ డివిజనల్ అధికారి, వరంగల్ రూరల్ గారిని గాని, వారి సిబ్బందిని గాని పరదు భూమిలో ప్రవేశించి, సర్వే మరియు ఇతర పనులు చేపట్టుటకు అధికారమివ్వనైనది.

పరదు చట్టములోని సెక్షన్ 11(4) ననుసరించి, సేకరణకు ప్రతిపాదించిన భూములందు జిల్లా కలెక్టర్, వరంగల్ రూరల్ గారి అనుమతి లేకుండా, ఇట్టి ప్రాథమిక ప్రకటన జారీ చేసిన తేది నుండి షెడ్యూలులో ప్రకటించిన భూములకు సంబంధించి క్రయ, విక్రయాలు లేదా ఏ విధమైన లావాదేవీలు జరుపరాదని తెలియజేయనైనది.

ప్రతిపాదిత భూసేకరణపై ఏమైనా అభ్యంతరములు గాని ఆక్షేపణలు గాని ఉన్న యెడల మరియు నష్టపరిహారము సంప్రదింపుల ద్వారా పరిష్కారము కొరకు ప్రభావితమైన/ప్రయోజనము గల వ్యక్తులందరూ, పరదు చట్టములోని సెక్షన్ (15) ననుసరించి ఇట్టి ప్రకటన ప్రచురించబడిన తేది నుండి (60) దినములలోగా జిల్లా కలెక్టర్, వరంగల్ రూరల్ గారికి మరియు రెవెన్యూ డివిజనల్ అధికారి, నర్సంపేట్ గారిని లిఖిత పూర్వకంగా దాఖలు చేసుకోవచ్చును.

భూసేకరణ అధికారి & రెవెన్యూ డివిజనల్ అధికారి నర్సంపేట | సంయుక్త కలెక్టర్ వరంగల్ (గ్రామీణ) | జిల్లా కలెక్టర్, వరంగల్ (గ్రామీణ)

DIPR R.O. No.1240/LA/PP-Agency/2019-20

తెలంగాణ ప్రభుత్వం
ప్రజారోగ్య విభాగము మరియు మున్సిపల్ ఇంజనీరింగ్ శాఖ
ఇన్వైటేషన్ టెండర్ ప్రకటన

టెందరు ప్రకటన నం: 3,9,10,11/EE (PH)/ADB/10FIDC/2019-20 తేది: 28.01.2020
పనుల సంఖ్య: 04, పనుల స్వభావం: కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో RCC కల

'నవోదయ'లో రాష్ట్రానికి తీరని అన్యాయం: వినోద్‌కుమార్

సాక్షి, హైదరాబాద్: నవోదయ పాఠశాలల ఏర్పాటులో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరుగుతోందని రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ రాజీవ్‌కుమార్‌కు వినోద్‌కుమార్ లేఖ రాశారు. రాష్ట్రంలో ప్రస్తుతం 9 నవోదయ పాఠశాలలు మాత్రమే ఉన్నాయని, మరో 24 పాఠశాలలు ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై ఇప్పటికే సీఎం కేసీఆర్ ప్రధాని మోదీని కోరారని గుర్తు చేశారు. గతంలో తాను కూడా పార్లమెంటులో ఈ అంశాన్ని ప్రస్తావించానన్నారు. అన్ని రంగాల్లో శరవేగంగా పురోగమిస్తున్న తెలంగాణ పట్ల కేంద్రం వివక్ష చూపడం సరికాదన్నారు. ప్రతి జిల్లాకు ఒకటి చొప్పున నవోదయ పాఠశాలలను ఏర్పాటు చేస్తే గ్రామీణ ప్రాంత బాల, బాలికలకు ఎంతో ఉపయోగపడుతుందని, తద్వారా అక్షరాస్యతా శాతం కూడా పెరుగుతుందన్నారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని నీతి ఆయోగ్ వైస్ చైర్మన్‌ను వినోద్‌కుమార్ కోరారు.

సెక్యులర్ పార్టీ బీజేపీయేనని రుజువైంది

నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రపతి ప్రసంగం చూశాక దేశంలో ఏదైనా సెక్యులర్ పార్టీ ఉందంటే అది బీజేపీయేనని రుజువైందని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సబ్ కా సాత్ సబ్ కా వికాస్ సబ్ కా విశ్వాస్ అన్న నినాదంతో దృఢ సంకల్పంతో తమ ప్రభుత్వం ముందుకెళుతోందని తెలిపారు. 8 కోట్ల గ్యాస్ కనెక్షన్లు ఇస్తే అందులో అన్ని మతాల వాళ్లు ఉన్నారన్నది కేసీఆర్ ప్రత్యేకంగా గుర్తు పెట్టుకోవాలని అన్నారు. నిర్మించిన 2 కోట్ల ఇళ్లలో కూడా అనేకమంది ముస్లిం మహిళలు లబ్ధి పొందారని తెలిపారు. అయితే కేసీఆర్ ప్రభుత్వం ఆవాస్ యోజన డబ్బులు మిషన్ భగీరథ, కాళేశ్వరం ప్రాజెక్టులకు మళ్లిస్తోంది కాబట్టే ఈ రెండు కోట్ల ఇళ్లలో ఏ ఒక్క ఇల్లు కూడా తెలంగాణకు రాలేదని విమర్శించారు. తెలంగాణకు ఇళ్లు ఎందుకు రాలేదో మహిళలు సీఎం కేసీఆర్‌ను ప్రశ్నించాలని అర్వింద్ కోరారు.

నేటి నుంచి పశువులకు టీకాలు: తలసాని

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా శనివారం నుంచి నెల రోజుల పాటు పశువులలో గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు, గొర్రెలకు నట్టల నివారణకు డీ వార్మింగ్ కార్యక్రమం చేపట్టనున్నట్లు పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. యాదాద్రి జిల్లా రాజాపేట మండలం రఘునాథ్‌పూర్‌లో ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, పశుసంవర్ధక శాఖ కార్యదర్శి సందీపకుమార్ సుల్తానియాతో కలసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు. ఇప్పటికే దీనిపై రైతులకు అవగాహన కల్పించేందుకు పోస్టర్లు, కరపత్రాల ద్వారా గ్రామాల్లో విస్తృత ప్రచారం చేపట్టామన్నారు. జీవాల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉన్న 84 లక్షల పశువులకు టీకాలు వేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు శుక్రవారం ఓ ప్రకటనలో చెప్పారు.

దౌర్జన్యం చేసిన మంత్రులను బర్తరఫ్ చేయగలరా?

మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

సాక్షి, హైదరాబాద్: దౌర్జన్యం చేసి మున్సిపాలిటీలు దక్కించుకున్న మంత్రులను మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ బర్తరఫ్ చేయగలరా అని కాంగ్రెస్ నేత, మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ప్రశ్నించారు. శుక్రవారం గాంధీ భవన్‌లో ఆయన మాట్లాడుతూ.. అవినీతి ఎమ్మెల్యేలను పక్కన పెట్టుకుని కేటీఆర్ నీతులు చెబుతున్నారని విమర్శించారు. ఎన్నికల్లో దొడ్డిదారిన, అవినీతి అక్రమాలకు పాల్పడి అధికార పార్టీ ఎక్కువ స్థానాలు కైవసం చేసుకుందన్నారు. ఆదిభట్ల, పెద్ద అంబర్‌పేట, బడంగ్‌పేట్‌లో కాంగ్రెస్ నుంచి గెలిచిన వారిని మేయర్, చైర్‌పర్సన్లను చేశారన్నారు. కొన్ని మున్సిపాలిటీల్లో ఇతర పార్టీల వారిని లాక్కొని మేయర్లు, చైర్‌పర్సన్లుగా ఎంపిక చేశారని దుయ్యబట్టారు. సీఎం కేసీఆర్ సొంత నియోజకవర్గం గజ్వేల్ మున్సిపాలిటీలోనూ ఇండిపెండెంట్ల బలంతో టీఆర్ఎస్ చైర్‌పర్సన్ సీటును దక్కించుకుందన్నారు. కొన్ని చోట్ల కాంగ్రెస్ నుంచి ఎన్నికైన వారిని పోలీసు ఎస్కార్టు పెట్టుకొని టీఆర్ఎస్ నేతలు వారిని ఎత్తుకెళ్లి చైర్‌పర్సన్ స్థానాలు గెలుచుకున్నారని ఆరోపించారు.

మేడారం జాతర సమయంలో సహకార ఎన్నికలా?: సీపీఐ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రెండేళ్లకు ఒకసారి అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే సమ్మక్క–సారలమ్మ జాతర సమయంలోనే టీఆర్ఎస్ ప్రభుత్వం సహకార సంఘాల ఎన్నికలను నిర్వహించడాన్ని సీపీఐ తప్పుబట్టింది. ఈనెల 5–8 తేదీల మధ్య జరిగే జాతరలో కోటి మందికి పైగా పాల్గొంటారని, అంతకు ముందు, ఆ తర్వాతి రోజుల్లో కూడా పెద్దసంఖ్యలో అక్కడికి భక్తులు వెళ్తుంటారని, ఈ సమయంలో ఎన్నికల నిర్వహణ వెనుక ఆంతర్యమేమిటని ప్రశ్నించింది. ప్రతిపక్షాలకు ప్రచార సమయం కూడా ఇవ్వకుండా ఇంత హడావుడిగా, ఆగమేఘాల మీద ఈ ఎన్నికలు జరపడం సరికాదని ఆ పార్టీ కార్యదర్శి చాడ వెంకటరెడ్డి ఒక ప్రకటనలో మండిపడ్డారు. ఈ జాతర తేదీల్లో కోఆపరేటివ్ ఎన్నికలు నిర్వహించాలని సీఎం ఆదేశించడం సమంజసంగా లేదన్నారు.

రేపు పద్మశాలి సంఘం కార్యవర్గ భేటీ

సాక్షి, హైదరాబాద్: మున్సిపల్ ఎన్నికల్లో గెలుపొందిన పద్మశాలీలను సన్మానించడంతోపాటు సంఘం కార్యవర్గ భేటీని ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్నట్లు రాష్ట్ర పద్మశాలి సంఘం తెలిపింది. ఉదయం 10 గంటలకు జరగనున్న ఈ కార్యక్రమంలో అన్ని జిల్లాల అధ్యక్షులు, ఆయా జిల్లాల పరిధిలో గెలిచిన పద్మశాలి చైర్‌పర్సన్లు, కౌన్సిలర్లతో సహా హాజరవ్వాలని సంఘం అధ్యక్షుడు బూర మల్లేశం, వర్కింగ్ ప్రెసిడెంట్ దిడ్డి ప్రవీణ్ కుమార్ ఓ ప్రకటనలో కోరారు.

పోలీసు మహిళా సిబ్బంది కోసం మొబైల్ టాయిలెట్లు

సాక్షి, హైదరాబాద్: బందోబస్తు విధుల్లో ఉండే పోలీసు మహిళా సిబ్బంది కోసం ఆ శాఖ ప్రత్యేకంగా మొబైల్ రెస్ట్‌రూమ్స్, టాయిలెట్లను అందుబాటులోకి తెచ్చింది. ఇందుకు మొదట 17 వాహనాలను సిద్ధం చేసింది. వీటిని ప్రస్తుతం మేడారం జాతర విధుల్లో ఉన్న పోలీసు మహిళా సిబ్బంది కోసం అందుబాటులో ఉంచబోతున్నారు. శుక్రవారం వీటిని హోంమంత్రి మహమూద్ అలీ జెండా ఊపి ప్రారంభించారు. త్వరలో వీటి సంఖ్యను 25కు పెంచుతామని, బందోబస్తు విధుల్లో ఉండే మహిళా సిబ్బందికి వీలుగా ఆయా ప్రాంతాల్లో ఉంచుతామని డీజీపీ మహేందర్‌రెడ్డి వెల్లడించారు. ప్రత్యేకంగా ఇందుకు వాహనాలను సమకూర్చుకుని వాటిని మొబైల్ టాయిలెట్లుగా రూపొందించారు.

నదీ కాలుష్యానికి అడ్డుకట్ట

- గోదావరి నదీ తీరం వెంబడి నదీ పునరుజ్జీవనానికి రాష్ట్రం ప్రణాళిక
- ఎన్జీటీ ఆదేశాల ప్రకారం పట్టణాల నుంచి మురుగు చేరకుండా జాగ్రత్తలు
- 19 నదీ ప్రాంతాల్లో మురుగు నిర్వహణకు మురుగు శుద్ధి కేంద్రాల నిర్మాణం

సాక్షి, హైదరాబాద్: గోదావరి నదీ కాలుష్యానికి అడ్డుకట్ట వేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది. ఆయా రాష్ట్రాల్లోని ప్రధాన నదుల కాలుష్యాన్ని నివారించేలా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలన్న జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్జీటీ) సూచనల మేరకు గోదావరి పునరుజ్జీవన చర్యలు ప్రారంభించనుంది. ముఖ్యంగా నదీ పరివాహక ప్రాంతంలోని ప్రధాన పట్టణాల నుంచి వచ్చి చేరే మురుగు, పారిశ్రామిక వ్యర్థాల నివారణపై ఎక్కువగా దృష్టి పెట్టనుంది.

ఎస్టీపీలతో మురుగుకు అడ్డు..

గోదావరి నది బాసర నుంచి భద్రాచలం వరకు 500 కి.మీ.ల మేర ప్రయాణిస్తుండగా, నది పరీవాహక ప్రాంతంలో ఉన్న 20 ప్రధాన పట్టణాల నుంచి గోదావరిలో పారిశ్రామిక వ్యర్థాలు, మురుగు నీరు వచ్చి చేరుతోంది. మొత్తంగా 60 వరకు నాలాలు గోదావరిలో కలుస్తున్నాయి. ప్రధాన పట్టణాల నుంచి రోజుకు 250 ఎంఎల్‌డీ (మిలియన్ లీటర్ పర్ డే) మేర నీరు వినియోగిస్తుండగా, 200 ఎంఎల్‌డీ మురుగు నదిలో చేరుతోంది. ప్రధానంగా కందకుర్తి, తుంగిని, మంచిర్యాల, బూర్గంపహాడ్, కోటిలింగాల వంటి నాలాల ద్వారా నదిలోకి పెద్ద ఎత్తున మురుగునీరు చేరుతోంది. దీనికి తోడు రోజుకు 6.8 లక్షల కేజీల ఘన వ్యర్థాలు, పారిశ్రామిక వ్యర్థాలు నదిలో చేరుతున్నాయి. ఈ దృష్యా ఘన వ్యర్థాలు రాకుండా చూడాలని, పరీవాహకంలో అక్రమాలను నిరోధించి, అక్రమ మైనింగ్ అడ్డకుని నదికి పునరుజ్జీవం పోయాలని రాష్ట్రాలను కేంద్రం ఆదేశించింది. దీంతో పట్టణ ప్రాంతాల్లోని మురుగు నదిలో చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు ప్రధాన పట్టణాల పరిధిలో 19 ప్రాంతాల్లో మురుగు శుద్ధి కేంద్రాలు (ఎస్టీపీ) నిర్మించాలని నిర్ణయించింది. ఇప్పటికే 70 ఎంఎల్‌డీల మేర మురుగు శుద్ధి జరుగుతుండగా, మరో 80 ఎంఎల్‌డీల మురుగు శుద్ధి చేసేలా చర్యలు తీసుకోనుంది. పరిశ్రమల నుంచి నేరుగా నదిలోకి వ్యర్థాలు వెళ్లకుండా వాటిని శుద్ధి చేశాకే తరలించేలా నిబంధనలు కఠినతరం చేయాలని నిర్ణయించింది. పట్టణాలు, గ్రామాల నుంచి ఉత్పత్తి అయిన ప్లాస్టిక్ వ్యర్థాలను రీసైక్లింగ్ చేసేలా లేనిపక్షంలో సమీపంలోని పవర్‌ప్లాంట్లకు పంపేలా చర్యలు చేపట్టనుంది. ప్రతి ఆస్పత్రిలో తక్కువ వ్యయంతో వారి పరిసరాల్లో ఎస్టీపీలు ఏర్పాటు చేయించడం, ఇలా శుద్ధి చేసిన నీళ్లను పూల తోటల పెంపకానికి పునర్ వినియోగించే దిశగా ఆదేశాలు ఇవ్వనుంది. గోదావరి కాలుష్య నివారణపై తీసుకునే చర్యలను పేర్కొంటూ ఎన్జీటీకి ప్రభుత్వం నివేదిక సమర్పించింది.

తన స్వచ్ఛంద విరమణ సందర్భంగా భావోద్వేగానికి గురై కన్నీరు పెట్టుకుంటున్న పద్మ శర్మ అనే ఉద్యోగి

సుదీర్ఘ అనుబంధానికి... స్వచ్ఛందంగా స్వస్తి..!

- బీఎస్ఎన్ఎల్‌లో 77%మంది వీఆర్ఎస్‌లోకి
- ఒక్కరోజే 2,613 మంది ఉద్యోగ విరమణ

సాక్షి, హైదరాబాద్: భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్)తో ఏర్పరచుకున్న సుదీర్ఘ అనుబంధాన్ని ఆ సంస్థ మెజార్టీ ఉద్యోగులు శుక్రవారం స్వచ్ఛందంగా తెంచుకున్నారు. బీఎస్ఎన్ఎల్ స్వచ్ఛంద పదవీ విరమణ పథకం (వీఆర్ఎస్) ప్రవేశపెట్టడంతో ఎగ్జిక్యూటివ్, నాన్ ఎగ్జిక్యూటివ్ శ్రేణికి చెందిన ఐదు పదుల వయసు దాటిన ఉద్యోగులందరూ పదవీ విరమణ చేశారు. హైదరాబాద్‌లోని టెలికం ఉద్యోగుల్లో 77% మంది వీఆర్ఎస్ తీసుకున్నట్లు అధికార గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. సంస్థలో కొత్తగా చేరిన ఉద్యోగులు మినహా మిగిలిన వారంతా వీఆర్ఎస్ తీసుకున్నారు.ఇప్పటికే బీఎస్ఎన్ఎల్ ఆదాయాన్ని పెంపొందించుకునేందుకు సంస్థ ఆస్తుల్లో కొన్నింటిని లీజులు, అద్దెలకు ఇచ్చింది. తాజాగా ఉద్యోగుల వీఆర్ఎస్‌తో మిగిలిన భవన సముదాయాలు సైతం ఖాళీ అయ్యాయి.

నగరంలో ఇలా...

హైదరాబాద్ టెలికం జిల్లా పరిధిలో మొత్తం 3,500 మంది ఉద్యోగులకు గాను అందులో 2,613 మంది ఉద్యోగులు స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. ఎగ్జిక్యూటివ్ కేడర్‌కు చెందిన వారిలో 17 మంది డీజీఎంలు, 80 ఎజీఎంలు, 100 మంది ఎస్‌డీవోలు, 80 మంది జేటీవోలు ఉన్నారు. మిగతా వారిలో నాన్ ఎగ్జిక్యూటివ్ కేడర్‌కు చెందిన వారున్నారు.హైదరాబాద్ సర్కిల్ సీజీఎం పరిధిలోకి వచ్చే మరో 284 మంది ఉద్యోగులు సైతం వీఆర్ఎస్ తీసుకున్నారు.

బీఎస్ఎన్ఎల్ భవన్ మూడొంతులు ఖాళీ

ఉద్యోగుల పదవీ విరమణతో హైదరాబాద్‌లో ఉన్న ఆదర్శ నగర్‌లోని టెలికం ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ (పీజీఎం) కార్యాలయమైన బీఎస్ఎన్ఎల్ భవన్ దాదాపు మూడొంతులు ఖాళీ అయింది. బీఎస్ఎన్ఎల్ భవన్ లోని కొన్ని అంతస్తులను జీఎస్‌టీ శాఖకు అద్దెకివ్వగా ఖాళీ అయిన మిగిలిన అంతస్తులు సైతం అద్దెకు ఇచ్చేందుకు ఇప్పటికే టెండర్లు ఆహ్వానించారు.

విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదనలు వాయిదా

- గడువు పొడిగింపు కోరిన డిస్కంలు
- సహకార ఎన్నికల నేపథ్యంలో నిర్ణయం
- ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి తెచ్చే అవకాశం

సాక్షి, హైదరాబాద్: విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదనలను రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లు వాయిదా వేసుకున్నాయి. 2020–21 ఆర్థిక ఏడాదికి సంబంధించి వార్షిక ఆదాయ అవసరాల నివేదిక(ఏఆర్ఆర్)ను గతేడాది నవంబర్ 31లోగా డిస్కంలు సమర్పించాల్సి ఉండగా, మున్సిపల్ ఎన్నికల కారణంగా జనవరి 31 వరకు గడువు పొడిగింపును పొందాయి. ఏఆర్ఆర్ నివేదికతో సహా విద్యుత్ చార్జీల పెంపునకు సంబంధించిన ప్రతిపాదనలను సమర్పించేందుకు డిస్కంలు అన్ని ఏర్పాట్లు చేసుకున్నాయి. ఈలోగా సహకార సంస్థలకు ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో మళ్లీ వాయిదా వేసుకున్నాయి. ఫిబ్రవరి 15 వరకు గడువు పొడిగించాలని కోరుతూ శుక్రవారం ఈఆర్సీకి డిస్కంలు విజ్ఞప్తి చేశాయి. గడువు పొడిగింపుపై ఈఆర్సీ చైర్మన్ నిర్ణయం తీసుకోనున్నారు. ఫిబ్రవరి 15న సహకార ఎన్నికలు ముగియనున్నాయి. ఎన్నికలు ముగిసిన తర్వాత అదే రోజు ఈఆర్సీకి డిస్కంలు విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదనలను సమర్పించే అవకాశముంది. ఈ ప్రతిపాదనలపై ఈఆర్సీ ప్రజాభిప్రాయాలను సేకరించడంతో పాటు బహిరంగ విచారణ నిర్వహించి 2020–21కి సంబంధించిన టారిఫ్ ఉత్తర్వులను జారీ చేయనుంది. ఏఆర్ఆర్ ప్రతిపాదనలు ఆలస్యమైనా ఏప్రిల్ 1 నుంచి రాష్ట్రంలో చార్జీల పెంపు అమల్లోకి రానుంది.

ఎంపికైన అభ్యర్థులు శిక్షణకు రావాలి

హైదరాబాద్: తెలంగాణ కారాగార శాఖలో జైల్ వార్డర్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు శిక్షణకు హాజరుకావాలని రాష్ట్ర అధికారి రాజీవ్ త్రివేది శుక్రవారం పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈ నెల 10న ఉదయం 9.30 గంటలకు ఆయా జిల్లాల సబ్ జైల్ అధికారిని కలవాలని సూచించారు. ఫిబ్రవరి చివరి వారంలో ఆరంభమయ్యే శిక్షణ నిమిత్తం ప్రధానాచార్యులు, రాష్ట్ర సంస్కరణల పరిపాలన శిక్షణ సంస్థ (సికా), చంచల్‌గూడ, హైదరాబాద్ చిరునామాలో అభ్యర్థులు రిపోర్టు చేయాలని వివరించారు.

బతుకమ్మ చీరల డిజైన్లు ఖరారు

- సిరిసిల్ల నేతన్నలకు ఆర్డర్లు
- 6 కోట్ల మీటర్లు తయారు చేయాలని ఆదేశాలు

సిరిసిల్ల: తెల్లరేషన్ కార్డు ఉన్న ఆడపడుచులకు రాష్ట్ర ప్రభుత్వం అందించే బతుకమ్మ పండుగ కానుక చీరల డిజైన్లను రాష్ట్ర చేనేత, జౌళి శాఖ అధికారులు ఖరారు చేశారు. జౌళి శాఖ గతేడాది బంగారు వర్ణంలో జరీ అంచులతో చీరలు తయారు చేయించగా.. ఈసారి కొత్తగా లైనింగ్ గీతలు, చిన్నబార్డర్లతో కంటికి ఇంపైన డిజైన్లను రూపొందించారు. వీటి తయారీకి నాణ్యమైన నూలు వాడాలని, కొన్ని కంపెనీల నూలును నిర్దేశించారు. సిరిసిల్ల నేతన్నలకు 6 కోట్ల మీటర్ల బతుకమ్మ చీరల ఆర్డర్లను ఇస్తున్నారు. ఇందుకోసం రూ.300 కోట్లు కేటాయించారు. కోటి 20 లక్షల మంది మహిళలకు బతుకమ్మ చీరలను అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

స్తంభించిన బ్యాంకులు

సాక్షి, హైదరాబాద్: ఉద్యోగుల వేతన సవరణతో పాటు, పలు సమస్యలపై ప్రభుత్వరంగ బ్యాంకుల ఉద్యోగసంఘాలు చేపట్టిన రెండ్రోజుల సమ్మెలో భాగంగా మొదటి రోజు శుక్రవారం నగరంలోని పలు ప్రాంతాల్లో బ్యాంకుల కార్యకలాపాలు పూర్తిగా స్తంభించాయి. జంట నగరాల్లో సుమారు 6 వేల బ్రాంచీల్లో సేవలు నిలిచిపోయినట్లు ఉద్యోగ సంఘాలు ప్రకటించాయి. ప్రైవేట్ బ్యాంకుల సేవలు మాత్రంకొనసాగాయి. బ్యాంకుల బంద్ వల్ల ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. బ్యాంకులపైన ఆధారపడి సాగే రోజువారీ వ్యాపార లావాదేవీలకు ఆటంకం ఏర్పడింది. ఆబిడ్స్, కోఠి,తదితర ప్రాంతాల్లో ఉద్యోగులు ధర్నాలు, ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ ఏపీ, తెలంగాణ స్టేట్స్ యూనిట్ పిలుపు మేరకు బ్యాంకు సంఘాల ఆధ్వర్యంలో బ్యాంక్ స్ట్రీట్‌లో చేపట్టిన ధర్నాలో మాజీ ఎమ్మెల్సీ నాగేశ్వర్ పాల్గొని సంఘీభావం తెలిపారు. యునైటెడ్ ఫెడరేషన్ బ్యాంక్ ఆఫీసర్స్ యూనియన్ కన్వీనర్ ఆర్.శ్రీరామ్, యూఎఫ్‌బీఎ రాష్ట్ర కన్వీనర్ బీఎస్.రాంబాబు, ఎఐబీవోసీ ప్రధాన కార్యదర్శి ఎం.చుక్కయ్య, సీఐటీయూ నాయకులు వీరయ్య తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పసికందు

కని పారేశారు..

- ముళ్లపొదల్లో పసికందును కుక్క పట్టుకెళ్తుండగా కాపాడిన రైతు
- వికారాబాద్ జిల్లాలో ఘటన

మర్పల్లి: ముక్కుపచ్చలారని ఓ పసికందు (అప్పుడే పుట్టిన పాప)ను గుర్తుతెలియని వారు ముళ్లపొదల్లో పడేశారు. దీంతో ఓ కుక్క ఆ పసికందును పట్టుకెళ్తుండగా ఓ రైతు గమనించి పాపను కాపాడాడు. అనంతరం పాపను మర్పల్లిలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించాడు. ఈ ఘటన వికారాబాద్ జిల్లా మర్పల్లి మండలం పంచలింగాలలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బాబు అనే రైతు శుక్రవారం మధ్యాహ్నం భోజనం చేసి ఇంటి నుంచి పొలానికి వెళ్తున్నాడు. దారిలోని పొదల్లో పడి ఉన్న పసికందును కుక్క తన నోటితో పట్టుకుని వెళ్తుండగా గుర్తించాడు. వెంటనే కుక్కను వెళ్లగొట్టి పాపను రక్షించాడు. తర్వాత పాపను మర్పల్లిలోని కమ్యూనిటీ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. ప్రథమ చికిత్స అనంతరం హైదరాబాద్‌లోని నీలోఫర్ ఆస్పత్రికి వైద్యులు పంపించారు.

పంచాయతీ కార్యదర్శుల గ్రేడ్‌లకు కత్తెర

- ప్రస్తుతం ఉన్న నాలుగు గ్రేడ్లను ఏ,బీలుగా కుదింపు
- ప్రమోషన్లలో అన్యాయం జరుగుతుందని ఉద్యోగ సంఘాల ఆవేదన

సాక్షి, హైదరాబాద్: పంచాయతీ కార్యదర్శుల గ్రేడ్‌లకు రాష్ట్ర ప్రభుత్వం కత్తెర పెడుతోంది. ప్రస్తుతం ఉన్న నాలుగు గ్రేడ్‌ల విధానాన్ని సమీక్షిస్తున్న ప్రభుత్వం.. వీటిని రెండింటికే పరిమితం చేయాలని భావిస్తోంది.ఈ మేరకు పంచాయతీరాజ్‌శాఖ చేసిన ప్రతిపాదనలు ప్రభుత్వ పరిశీలనకు వెళ్లాయి. గతంలో కొనసాగిన క్లస్టర్ విధానానికి రాష్ట్ర సర్కార్ చరమగీతం పాడిన నేపథ్యంలో గ్రేడ్‌లను కొనసాగించడం అర్థరహితమని భావిస్తున్నట్లు తెలుస్తోంది. జీపీల ఆదాయం ఆధారంగా సగటున రెండు, మూడు గ్రామాలను కలిపి ఒక క్లస్టర్‌ను ఏర్పాటు చేసిన పంచాయతీరాజ్‌శాఖ.. రూ.10 లక్షల ఆదాయం ఉన్న క్లస్టర్ గ్రేడ్–1, రూ.7 లక్షల రాబడి ఉన్న క్లస్టర్ గ్రేడ్–2, రూ.5 లక్షల ఆదాయం ఉన్న క్లస్టర్ గ్రేడ్–3, రూ.5 లక్షల రాబడిలోపు క్లస్టర్‌కు గ్రేడ్–4 హోదా కలిగిన కార్యదర్శులను నియమించింది. 2018లో కొత్త పంచాయతీరాజ్ కార్యదర్శి ఉండాలనే నిబంధనను పొందుపరిచింది. 12,751 పంచాయతీల్లో ఖాళీలను భర్తీ చేసేందుకు కొత్తగా 9వేలమందికి పైగా జూనియర్ పంచాయతీ కార్యదర్శులను నియమించింది. దీంతో అప్పటివరకు కొనసాగిన క్లస్టర్ వ్యవస్థకు ఫుల్‌స్టాప్ పడింది. ఈ నేపథ్యంలో పంచాయతీలన్నింటినీ ఒకే గొడుగు కిందకు తెచ్చినందున నాలుగు గ్రేడ్లు అనవసరమనే వాదన వచ్చింది. దీంతో పంచాయతీ కార్యదర్శులను ఏ, బీ గ్రేడ్లుగా నిర్వచించి.. 1,3 గ్రేడ్లకు కోత పెట్టాలని నిర్ణయించినట్లు తెలిసింది.

ఉద్యోగులకు అన్యాయం: కార్యదర్శుల సంఘం

గ్రేడ్‌ల విధానాన్ని ఎత్తివేయాలనే ప్రతిపాదనలను ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని రాష్ట్ర పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మధుసూదన్‌రెడ్డి, రమేశ్‌లు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్‌కు విజ్ఞాపన పత్రాన్ని అందజేశారు. గ్రామ పంచాయతీల జనాభా ఆధారంగా గ్రేడ్‌లను ఏర్పాటు చేసి.. ప్రస్తుత విధానాన్ని కొనసాగించాలని కోరారు.పదోన్నతులు కల్పించకపోవడంతో 600 మంది ఉద్యోగులకు నష్టం వాటిల్లుతోందన్నారు. 200 గ్రేడ్–1 పంచాయతీ కార్యదర్శి పోస్టులు ప్రమోషన్లతో ఖాళీ అయినా పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్న 370 మంది గ్రేడ్–2 కార్యదర్శులను పట్టించుకోకపోవడం దారుణమన్నారు.

సోనియాతో బీసీ సంక్షేమ సంఘం నేతల భేటీ

సాక్షి, న్యూఢిల్లీ: చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీని బీసీ సంక్షేమ సంఘం పార్లమెంటు ఆవరణలో కలిసింది. సంఘం ప్రతినిధులు గుజ్జ కృష్ణ, నీల వెంకటేశ్, భూపేష్ సాగర్, మద్విరాజ్, పద్మారెడ్డి తదితరులు సోనియాను కలిసిన వారిలో ఉన్నారు. చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్ల అమలు ఆవశ్యకతను, పదోన్నతుల్లో రిజర్వేషన్ల ఆవశ్యకతను వివరించారు. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 34 శాతం నుంచి 50 శాతానికి పెంచేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited,Sakshi Press, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792, Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.